ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-5-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 97 పేజీలు: 10+4 వెల: 6.50


ఆపరేషన్ 'సిందూర్'కు గంగాహారతి

ఉగ్రస్థావరాలను మట్టుబెట్టాం: రాజ్‌నాథ్ 5లో



గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

# అమరావతే రాజధాని

## ఎపి పునర్విభజన చట్టంలో సవరణకు కేంద్రాన్ని కోరిన కేబినెట్

### 'ఆపరేషన్ సిందూర్'ను సక్సెస్ చేసిన ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీకి అభినందనలు తెలిపిన మంత్రిమండలి

### కేబినెట్ భేటీలో పలు తీర్మానాలకు ఆమోదం

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విభజిత రాష్ట్ర రాజధాని పేరును 'అమరావతి'గా నిర్ణయిస్తూ గతంలోని ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 యొక్క సెక్షన్ 5 అనుబంధ సబ్ సెక్షన్ (2) మరియు సెక్షన్ 5కు వివరణలో చట్ట సవరణ కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేరుస్తూ చట్ట సవరణ చేసేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు.2014 పునర్విభజన చట్టంలో రాజధాని అమరాతి అని లేదని.. ఒకసారి పునర్విభజన చట్టంలో రాజధాని అమరావతి అని నిర్ణయిస్తే రాజధానికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతుందని పలువురు న్యాయనిపుణులతో పాటు ఇటీవల సిఎం చంద్రబాబును కలిసిన రైతులు కూడా సూచించారు. ఈ క్రమంలో రాజధాని అమరావతిగా నిర్ణయించి కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించారు. 2014 పునర్విభజన చట్టాన్ని కేంద్రంలో ఉన్న ఉభయ సభలు ఆమోదించాయి. అందువల్ల వాటికి చట్ట సవరణ చేయాలి అంటే రాజ్యసభ, లోక్‌సభ చేయాల్సి ఉండటంతో ఎపి రాజధాని అమరావతి అని పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని అభ్యర్థించారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌కు ఎపి కేబినెట్ అభినందలు తెలియజేసింది. ప్రధాని, భారత >>2

# పాక్‌కు చావుదెబ్బ

సమర 'సిందూర'ం

- దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లిన సరిహద్దులు
- దాయాది కుట్రలను సమర్థంగా తిప్పికొట్టిన భారత్
- 5 పాక్ యుద్ధ విమానాలు, 8 మిస్సైళ్ల కూల్చివేత
- సూసైడ్ డ్రోన్లను విఫలం చేసిన ఎస్- 400
- లాహోర్, సియాల్‌కోట్ ముష్కర స్థావరాలపైనా దాడులు
- ధర్మశాల ఐపిఎల్ మ్యాచ్‌ల నిలిపివేత
- జమ్ముపైకి పాక్ ప్రయోగించిన రాకెట్లు ధ్వంసం



బిఎస్ఎఫ్ అదుపులో పాక్ పైలట్ 2లో

**న్యూఢిల్లీ, మే 8:** కయ్యానికి కాలు దువ్వుతున్న పాకిస్తాన్‌కు భారత్ గట్టిగా బుద్ధిచెపుతోంది. దాయాదిరాజధాని ఇస్లామాబాద్, పంజాబ్‌ప్రావిన్స్‌లోని సియాల్‌కోట్, రావల్పిండి, లాహోర్ నగరాలపై డ్రోన్లు, క్షిపణులతో భారత్ విరుచుకుపడింది. పాక్‌కు ఊపిరాడని విధంగా భారత్ దాడులు నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మరింతగా పాకిస్తాన్ భారత్‌పై దాడులకు ఉపక్రమించడంతో మన రక్షణరంగం కదనరంంలోకి దిగింది. తాజాగా జమ్ము ఎయిర్‌పోర్టుపై రాకెట్ దాడికి దిగడంతో రష్యా తయారీ ఎస్ 400 సుదర్శనతో నిర్వీర్యంచేసింది. సరిహద్దురాష్ట్రాలను లక్ష్యంగాచేసుకుని పాకిస్థాన్ దాడులకు దిగుతోంది. దీనితో భారత్ మొత్తం సరిహద్దు రాష్ట్రాలయిన జమ్ముకాశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్‌ల్లోని తీరప్రాంతాలు, సరిహద్దుల్లో విద్యుత్‌సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. జమ్ముయూనివర్సిటీ, జమ్ము ఎయిర్‌పోర్టుపై జరిపిన పాక్ రాకెట్‌దాడులను ఎస్ 400 క్షిపణులతోనే తిప్పికొట్టింది. >>2



ఐసి-814 హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ మృతి 2లో

పాక్ ఒటిటిలు, సినిమాలు, వెబ్‌సిరీస్‌లపై నిషేధం

# ఇద్దరు మావోయిస్టుల మృతి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

## దూమకొండ అటవీ ప్రాంతంలో ఎన్ కౌంటర్

### భారీగా ఆయుధాలు స్వాధీనం

**పాడేరు, మే 8, ప్రభాతవార్త:** విశ్వసనీయమైన సమాచారం మేరకు అల్లూరిసీతారా మరాజు జిల్లా ఎస్పీ సూచనలతో అడిషినల్ ఎస్పి (అడ్మిన్) పర్యవేక్షణనలో, వై. రామవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న యార్లగడ్డ పంచాయతీ శేషరాయి గ్రామానికి ఉత్తర దిక్కుగా 2 కిలో మీటర్లు లో గల దూమకొండ మరియు గంగకొండ మద్య అటవీ ప్రాంతంలో పోలీసు పార్టీలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ నెల 7 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం సుమారు 02.30 గంటల సమయంలో అకస్మాత్తుగా మావోయిస్టులు, పోలీసు పార్టీల మీదకి కాల్పులు జరిపగా వెంటనే పోలీసు బలగాలు తమ ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపగా ఈ ఘటనలో సిపిఐ మావోయిస్ట్ పార్టీకి చెందిన ఇద్దరు పురుషులు మృతి చెందారు. ఈ కాల్పుల్లో చనిపోయిన కాకూరి పండన్న అలియాస్ జగన్,ఆండ్రూ,పొసన్న, బిరుసు, భీమన్న, మటియ (ఎస్‌జెడ్‌సిఎం) వాగపొడియామి అలియాస్ రమేష్ నాగన్న (డిసిఎం) గా గుర్తించడం జరిగిందనీ ఎస్పీ అమిత్ బార్డర్ తెలిపారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా లో ఇప్పటి వరకు మావోయిస్ట్ >>2

# ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ ఎపి

## పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రాన్ని మార్చుతున్నాం

### ఎల్జీ యూనిట్ భూమి పూజలో మంత్రి లోకేష్



గురువారం శ్రీసిటిలో ఎల్‌జి ఎలక్రానిక్స్ యూనిట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

**శ్రీసిటీ(తిరుపతి),మే 8ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు ఐదువేల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులతో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ప్రపంచస్థాయి తీసుకురావడమేగాక ఏపిని పెట్టుబడులకు గమ్యస్థానంగా తయారుచేస్తున్నామని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో సృష్టించబడే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్‌గా మార్చేందుకు బాటలువేస్తున్నామని స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కొత్తపునాదులు వేస్తున్నామన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీలో అంతర్జాతీయ స్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శ్రీసిటీలో గురువారం ఉదయం మంత్రి నారాలోకేశ్ భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ యూనిట్ ఒక నిర్మాణ ప్రాజెక్టు ప్రారంభం కంటే పెద్దదన్నారు. ఇది మన రాష్ట్రంతోడాటు భారతదేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒకమైలురాయిగా అభివర్ణించారు. మేడ్ఇన్ ఆంధ్రనుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు కూటమి ప్రభుత్వం జైత్రయాత్ర కొనసాగుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో వేగం,బలమైన మౌలిక సదుపాయాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడతుందన్నారు. శ్రీసిటీలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ అత్యాధునిక తయారీ కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఇక్కడకు రావడం గౌరవంగా భావిస్తున్నాన్నారు. ఎల్‌జిసంస్థ దాని భాగస్వాములు కలసి భారత దేశంలో ఎఐ ఆధారిత తయారీ, స్మార్ట్ ఉత్పత్తి ప్రక్రియలు, ఎనర్జీ ఎఫిషియంట్ విధానాలు, అత్యాధునిక సాంకేతికతలను తీసుకువస్తున్నాయన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రపంచస్థాయి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలనే ఆశయాన్ని ఎల్‌జి సంస్థ ముందుకు తీసుకెళుతోందని మంత్రి లోకేష్ >>2

# నేడు ఉరవకొండకు సిఎం చంద్రబాబు

## హంద్రీనీవా విస్తరణ పనుల పరిశీలన

**అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో :** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం, వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ప్రధాన కాలువ విస్తరణపనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిశీలించేందుకు శుక్రవారం వస్తున్నారు. కాలువ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో పనులను సమీక్షించి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఛాయాపురం గ్రామం వద్ద నిర్వహించనున్నారు. సాయంత్రం బెంగుళూరులో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొని హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం కానున్నారు.

సిఎం చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటనకు హంద్రీనీవా ఆయకట్టు రైతుల్లో గంపెడుఆశలు నెలకొన్నాయి. హంద్రీనీవా ప్రధాన కాలువను మాల్యాల వద్ద నుంచి జీడిపల్లి రిజర్వాయర్ వరకు 3850 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరణ పనులు కాలువ కింది భాగంలో లైనింగ్ పనులను చేపడుతున్నారు. 3850 క్యూసెక్కులకు బదులు 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులను చేపట్టాలని, ఆ దిశలో రాష్ట్ర >>2

# ముగ్గురు లిక్కర్ కేసు నిందితులకు ఎదురు దెబ్బ

## బెయిలుకు సుప్రీం నిరాకరణ

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కృష్ణ మోహనరెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్పకు ముందస్తు బెయిలు ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వాదనల సందర్భంగా, హైకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడే నిందితులు సుప్రీం కోర్టులో మధ్యంతర బెయిలు పిటీషన్ దాఖలు చేశారని ఎపి ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఆ పిటీషన్ ఇప్పుడు విచారణార్హం కాదని పేర్కొన్నారు. హైకోర్టు తాజాగా ముందస్థ బెయిలు నిరాకరించినందున నిందితులు గతంలో దాఖలు చేసిన పిటీషన్‌ను సవరించాలని,లేదా కొత్త పిటీషన్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను ధర్మాసనం పనిగణనలోకి తీసుకుంది.

ఈ క్రమంలో కొత్తగా మరోసారి పిటీషన్ దాఖలు చేయడానికి అనుమతివ్వాలని ధర్మాసనాన్ని నిందితులు కోరగా,జస్టిస్ పార్ధీవాలా ధర్మాసనం అనుమతించింది. మరోవైపు ఈ నెల 13వ తేదీ వరకైనా మధ్యంతర రక్షణ కల్పించాలని నిందితుల తరపు న్యాయవాదులు అభ్యర్థించారు. మధ్యంతర రక్షణ ఇవ్వడం కుదరదని ధర్మాసనం తేల్చి చెప్పింది. మిమ్మల్ని మీరే రక్షించుకోవాలని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. >>2

# 'నకిలీ' మందులపై గట్టి నిఘా



## ఆయుర్వేదంపై అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలకు 13 మంది ఆయుష్ వైద్యులకు అధికారం

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆయుర్వేద వంటి భారతీయ సంప్రదాయ మందుల వినియోగానికి సంబంధించి తప్పుడు ప్రకటనలపై చట్ట ప్రకారం తగు చర్యల్ని తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 13 మంది ప్రభుత్వ ఆయుష్ వైద్యులకు అధికారాల్ని కట్టబెట్టింది. డ్రగ్స్ అండ్ మేజికల్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టయిజ్‌మెంట్స్) చట్టం, 1954 కింద ఉమ్మడి 13 జిల్లాల్లో తగు చర్యలు తీసుకునేందుకు వీరికి రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తగు అధికారాల్ని కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసారు.

ఎపి రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ ఈ అంశంపై ఒక ప్రకటన విడుదల చేసింది.అల్లోపతిక్ మందులతో పాటు భారతీయ సంప్రదాయ మందుల ప్రయోజనాలపై అసత్యపు ప్రచారంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయుష్‌కు సంబంధించి నిఘా విభాగాన్ని పటిష్టం చేయడానికి మంత్రి ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు ఆయుష్ మందులకు సంబంధించిన అసత్యపు ప్రచారంపై చర్యలు తీసుకునేందుకు కేవలం ఒక్క అధికారి మాత్రమే విధులు నిర్వహించేవారు.

ఈ యంత్రాంగాన్ని అవసరాల మేరకు మరింత విస్తృతం చేయాలని సుప్రీం కోర్టు ఇటీవల అన్ని రాష్ట్రాలకు సూచించింది. అల్లోపతిక్ మందులకు సంబంధించి అటువంటి ప్రకటనలపై చర్యలు తీసుకునేందుకు గతంలోనే డ్రగ్ ఇన్స్‌పెక్టర్లందరికీ అధికారాలు సంక్రమించబడ్డాయి. ఆయా మందులకు సంబంధించి తప్పుడు ప్రకటనలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశమున్నందున వాటిని నిషేధించాలని 1954నాటి చట్టం స్పష్టం చేసింది. అయినా...అప్పట్నించీ భారతీయ సంప్రదాయ మందులపై అసత్యపు ప్రకటనల పట్ల తగు స్థాయిలో చర్యలు తీసుకోబడలేదని సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. 1954 చట్టం ప్రకారం.. మందుల వాస్తవ గుణాలకు విరుద్ధంగా తప్పుడు సమాచారం చేసి, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం, కొన్ని వ్యాధులకు అద్భుత పరిష్కారాలు( మేజికల్ రెమెడీస్) లభిస్తాయని ప్రచారం చేయడం నేరంగా పరిగణించబడుతుంది. అటువంటి ప్రచారాన్ని ఏ రీతిలోనైనా చేయడాన్ని చట్టం నిషేధించింది.

గర్భధారణ, గర్భస్రావ నివారణ, రుతు చక్ర లోపాల నివారణ, లైంగిక శక్తి ఇనుమడింపు వంటి వాటికి కొన్ని మందులు పనిచేస్తాయంటూ చేసే ప్రచారాన్ని చట్టం నిషేధించింది. మరికొన్ని ఇతర వ్యాధులకు ఇతర వైద్య విధానాల ద్వారా వీలు కాని అద్భుత పరిష్కారాలు (మేజికల్ రెమెడీస్) దొరుకుతాయంటూ చేసే ప్రకటనలపై కూడా చర్యలు చేపట్టేందుకు చట్టం వీలు కల్పించింది. 1954చట్టం కింద శిక్ష.. 1954 చట్టం ప్రకారం అసత్యపు ప్రకటనలతో నేరం చేసిన వారికి 6 నెలల >>2

# దేశవ్యాప్తంగా పెండింగ్‌లో 7 లక్షల క్రిమినల్ ఫైళ్లు 5లో

# జంట హత్యల కేసు 11 మందికి యావజ్జీవం

## ఐదుగురు నిర్దోషులుగా తీర్పు

### వైఎస్సార్సీ నేత నారాయణ రెడ్డి హత్యకేసు

### తీర్పు నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత



హత్యకు గురైన నారాయణ రెడ్డి (ఫైల్)

**కర్నూలు, మే 8, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లాలో జరిగిన జంట హత్యల కేసులో11 మందికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. ఫ్యాక్షన్ నేపథ్యంలో జరిగిన ఈ జంట హత్యల కేసులో మొత్తం 19 మంది నిధులు కాగా.. 11 మందికి జీవిత ఖైదు విదిస్తూ... ఐదు మందిని నిర్దోషులుగా ప్రకటించింది. ముగ్గురు ఇప్పటికే మరణిం చారు. 2017 జరిగిన ఈ ఫ్యాక్షన్‌లో రెండు రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉండడం గమనార్హం. కాగా సదరు హత్య కేసులో నిందితులుగా ఉన్న ప్రముఖులను అప్పుడే తప్పించారని ప్రత్యర్థులు ఆరోపణలు చేస్తున్నారు. అదే క్రమంలో హత్య చేసిన వర్గానికి చెందినవారు అప్పుడే గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వారి ఆస్తులను ప్రత్య ర్థులు అనుభవిస్తున్నారు. వారిని తిరిగి గ్రామంలోచేర్చాలని ప్రభుత్వాలు, పోలీసులు ఎంతగా ప్రయత్నిం చినా సత్ఫలితాలు రాలేదు. జంట హత్యలలో ఒకరు పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి భర్త చెరుకులపాడు నారాయణరెడ్డి మరొకరు ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు. బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మద్దికుంట వెంకటరెడ్డి వాదనలు వినిపించారు. 2017 మే 21న రామకృష్ణాపురంలో వివాహానికి హాజరై వస్తుండగా కృష్ణగిరి సబ్ స్టేషన్ దగ్గర.. నారాయణరెడ్డి దారుణ >>2



గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఆల్‌పార్టీ సమావేశానికి హాజరైన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ తదితరులు

# పాక్‌కు చావుదెబ్బ

>> పాక్ డ్రోన్లు, క్షిపణులను ఎక్కడికక్కడ కూల్చివేసింది. దాయాది మొత్తం 15 నగరాలపై ఫోకస్ పెట్టిందన్న సమాచారం రావడంతో ముందు పాక్‌వైపు ఉన్న రాడార్ వ్యవస్థలను నిర్వీర్యంచేసిన భారత్ వెనువెంటనే దాడులకు ఉపక్రమించింది. ఇజ్రాయిల్ టెక్నాలజీతో తయారుచేసిన హారోప్ డ్రోన్లను దాడులకు ఉపయోగించింది. యుద్ధం అన్న పదం మాత్రమే వినపడటంలేదుకాని దాదాపు యుద్ధం మాదిరిగానే జరుగుతుండటంతో ఇరుదేశాల్లోని సరిహద్దుగ్రామాలప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా భారత్‌లోని 15 నగరాలను టార్గెట్‌చేసినా పాక్ ఆటలను ఎక్కడా సాగనీయలేదు. రష్యా తయారీ సుదర్శన్ చక్రతో మొత్తం అన్నింటిని భారత్ నేలకూలుస్తోంది. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన దీర్ఘశ్రేణి వాయురక్షణ వ్యవస్థల్లో సుదర్శన్‌చక్రొకటి. రాత్రి ఎనిమిది గంటలు దాటినతర్వాత దాడులు ముమ్మరం అయ్యాయి. పాక్ క్షిపణులను ఎక్కడికక్కడ కూల్చివేసింది. భారత గగనతలంలోకి ప్రవేశించిన నాలుగు పాక్ ఎఫ్ 16 యుద్ధవిమానాలనుభారత్ ఈ సుదర్శన చక్రతోనే కూల్చివేసింది. దీనితో ఇక భారత్‌కూడా పాక్ నగరాలపై దాడులకు ఉపక్రమించింది. పాక్‌లోని తొమ్మిది నగరాల్లో సైనికస్థావరాలపై డ్రోన్ దాడులతో భారత్ ఉగ్రరూపం చూపించింది. మన రక్షణ వ్యవస్థ దెబ్బకు పాక్ బెంబేలెత్తిపోతోంది. లాహోర్ ఎయిర్‌పోర్టు, లాహోర్ సైనిక కేంద్రం, రావల్పిండి, సియాల్‌కోట్‌ప్రాంతాల్లోని సైనిక, ఆయుధ, వైమానిక స్థావరాలే టార్గెట్‌గా భారత్ దాడులుచేస్తోంది. 400 కిలోమీటర్ల దూరంవరకూ శత్రువులు ప్రయోగించే వైమానిక దాడులనుసమర్థవంతంగా తిప్పికొడుతోంది. స్టీల్త్ ఎయిర్‌క్రాఫ్ట్, ఫైటర్ జెట్స్, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణుల్ని ట్రాక్‌చేసి మార్గమధ్యలోనే కూల్చివేస్తున్నాయి. పంజాబ్‌లోని సరిహద్దుజిల్లాల్లో పాక్ దాడులకు ఉపక్రమించడంతో పఠాన్‌కోట్‌వైపు రాకుండా భారత్ అడ్డుకోగలిగింది. అక్కడితో ఆగకుండా పాక్ భూభాగంలోనే ఏడు డ్రోన్లు, యుద్ధవిమానాలను విజయవంతంగా కూల్చివేసింది. భారత్ రక్షణరంగం సత్తా ఏమిటో ఈ దాడులతో ప్రపంచానికి తెలిసిపోయింది. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోబాల్ ప్రధాని నరేంద్రమోడీతో అత్యవసర భేటీ అయ్యారు. మరోపక్క త్రివిధ దళాలఅధిపతులు, సిడిఎస్‌లతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమావేశం అయ్యారు. ఇదిలా ఉండగా హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే ఐపిఎల్ మ్యాచ్‌ను నిలిపివేసారు. పాకిస్తాన్ టార్గెట్‌లో ఉండొచ్చన్న సమాచారంతో మ్యాచ్‌ను నిలిపివేస్తున్నట్లు బిసిసిఐ ప్రకటించింది. పాకిస్తాన్‌పై దాడులకు ఎస్400 సుదర్శన చక్రతోపాటు ఎల్70 డిఫెన్స్ సిస్టమ్‌లను కూడా సిద్ధంచేసింది. జమ్ములో రాకెట్‌దాడులు చేయడం, భారత్ వాటిని విజయవంతంగా కూల్చివేసిన తర్వాత జమ్ముల్లో బ్లాకౌట్‌ను ఎత్తివేస్తున్నట్లు ఆర్మీ ప్రకటించింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఎయిర్‌వార్నింగ్ వ్యవస్థలనుకూడా భారత్ ధ్వంసంచేసింది. ఉదయమే లాహోర్ రక్షణ వ్యవస్థలను ధ్వంసంచేసిన భారత్ తాజాగా సియాల్‌కోట్‌పైనా దాడులుచేసి సైనిక,వైమానిక రక్షణరంగ వ్యవస్థలపై డ్రోన్‌దాడులు కురిపించింది.

## బిఎస్ఎఫ్ అదుపులో పాక్ పైలట్

**న్యూఢిల్లీ, మే 8:** భారత్‌లోని నగరాలను టార్గెట్‌చేస్తున్న పాకిస్తాన్ డ్రోన్లను ఎక్కడికక్కడ కూల్చివేయడంతోపాటు పాక్‌కు చెందిన జెఎఫ్17 విమానాన్ని భారత్ సుదర్శన చక్ర కూల్చివేసింది. రష్యా తయారీ శక్తివంతమైన ఎస్ 400ను సుదర్శన చక్ర అని పేరుపెట్టింది. ఇదిలా ఉంటే రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో దాడికి ప్రయత్నించిన పాక్ యుద్ధవిమానం పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. సరిహద్దుభద్రతా దళం క్విక్ రెస్పాన్స్ టీమ్ పాక్ పైలట్‌ను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించినట్లు తెలుస్తోంది. పాక్‌క్షిపణులను కూల్చివేయడంలో ఎస్ 400 కీలకభూమిక పోషిస్తోంది. ఉదయం లాహోర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసంచేసిన భారత్ ఇపుడు ఇస్లామాబాద్, సియాల్‌కోట్, పివోకే, లాహోర్; రావల్పిండి, కరాచి వంటి నగరాలపై డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపిస్తోంది. అయితే పట్టుబడిన పైలట్‌నుంచి పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## ఐసి-814 హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ మృతి

**ఇస్లామాబాద్, మే 8:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది దేశం పాక్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా చేపట్టిన ఈ దాడులతో జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్‌కు కోలుకోలేని దెబ్బతగిలింది. ఇప్పటికే అజార్‌కుటుంబం మొత్తం హతమైన విషయం తెలిసిందే. తాజాగా ఆయన సోదరుడు, ప్రస్తుతం జైషే నంబరు-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ సైతం ప్రాణాలు కోల్పోయారు. భారత్ దాడుల్లో బహవల్‌పూర్‌లోని జైష్ మహ్మద్ ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో 10 మంది మసూద్ కుటుంబసభ్యులు, నలుగురు సహాయకులు ప్రాణాలు కోల్పోయారు. జైషే చీఫ్ ప్రాణాలతోనే ఉన్నట్లు తెలిసింది. భారత్ జరిపిన దాడిలో తన కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయినట్లు మసూదే స్వయంగా వెల్లడించారు. తాజాగా అతడి సోదరుడు రవూఫ్ అస్గర్ కూడా మరణించారు. రవూఫ్ అస్గర్ పలు ఉగ్రదాడుల్లో కీలక నిందితుడు. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసి-814 హైజాక్ సూత్రధారి. అతడి మాస్టర్‌మైండ్స్‌తో ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్‌చేసి కాందహార్‌కు తరలించారు. అనంతరం భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. ఇక్కడి జైళ్లలో ఉన్న ఉగ్రనాయకులు మసూద్ అజహార్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్‌ను విడిపించుకొని తీసుకెళ్లారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్ట్ డేనియల్ పెర్ల్ హత్యలో కూడా ఇతడి పాత్ర ఉంది.

## పాక్ ఒటిటిలు, సినిమాలు, వెబ్‌సిరీస్‌లపై నిషేధం

### కేంద్రసమాచారశాఖ ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ మే 8:** పాకిస్థాన్‌లో రూపొందిన మీడియా కంటెంట్ ప్రసారంపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. ఓటీటీ, ఇతర మీడియా ప్లాట్‌ఫామ్స్ కోసం తయారైన వెబ్‌సిరీస్‌లు, సినిమా పాటలు, పాడ్‌కాస్ట్‌లను నిషేధించింది. జాతీయ భద్రత దృష్ట్యా నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడికి ప్రతీకారంగా, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు దాడులు చేశాయి. దీనితో ఇరుదేశాల మధ్య మరింతగా ఉద్రిక్తతలు . ఈ నేపథ్యంలో సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. "జాతీయ భద్రత దృష్ట్యా, భారతదేశంలో పనిచేస్తున్న అన్ని ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఇంటర్మీడియరీస్ పాకిస్థాన్‌కు చెందిన వెబ్ సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు సహా ఇతర మీడియా కంటెంట్‌ను నిలిపివేయాలి. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కేంద్రసమాచార శాఖ ఆదేశాలు జారీచేసింది.

## నేడు ఉరవకొండకు సిఎం చంద్రబాబు

>> ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, మేధావులు, రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. అదే విధంగా హంద్రీనీవా కాలువ విస్తరణపనులు లైనింగ్ పనులకు మాత్రమే టెండర్లు పిలిచారు, పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా హంద్రీనీవా కాలువ వెంట డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి పంట పొలాలకు నీళ్లు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశలో జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు తగిన ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద శ్రీశైలం జలాశయం లోతట్టు ప్రాంతమైన మాల్యాల వద్ద నుంచి జీడిపల్లి జలాశయం వరకు 800 కోట్లతో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో గుత్తేదారులు ప్రస్తుతం చేపడుతున్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. మెగా ఇంజినీరింగ్ సంస్థ, విపిఆర్ ఇన్‌ఫ్రా కంపెనీలకు పనులను అప్పగించారు. ఆ సంస్థలు కాలువ విస్తరణ పనులను చురుగ్గా చేపడుతున్నాయి. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి ప్రధాన కాలువ వెడల్పు పనులు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించడంతో పనులను గుత్తేదారులు చురుగ్గా చేపడుతున్నారు. ఇదే విధంగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వరకు 216.3 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్ల వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు 936 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఈ పనులను ఐదు రీచ్‌లుగా విభజించి లైనింగ్ పనులకు టెండర్లు పిలవడంతో మూడు రీచ్‌లను ఆర్‌విఆర్ విశాఖపట్నం సంస్థ, రెండు రీచ్‌లను బిఎస్ఆర్, బెంగుళూరు సంస్థ కాంట్రాక్టు పనులను చేజిక్కించుకున్నాయి. అదే విధంగా పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కింద 0 నుంచి 75 కిలోమీటర్ల వరకు రూ.266 కోట్లతో ఎస్ఆర్‌సి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ సంస్థ పనులు చేజిక్కించుకుంది. పుంగనూరు బ్రాంచ్‌కెనాల్ కింద రెండు రీచ్‌లకు టెండర్లు పిలువగా రెండు రీచ్‌లను ఎస్ఆర్‌సి ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ చేజిక్కించుకుని కాలువ లైనింగ్ పనులను వేగంగా నిర్వహిస్తోంది.

## నయనానంద భరితం.. సత్యదేవుని దివ్య కళ్యాణం..

**అన్నవరం, మే 8, (ప్రభాత వార్త ).** రత్నగిరి వాసుడు శ్రీసత్యదేవుని దివ్య కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. రత్నగిరిపై రామాలయం ప్రక్కన గల వార్షిక కళ్యాణ వేదికను, కనులు మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో, వివిధరకాల పరిమళ పుష్పజాతులతో రమణీయంగా ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు.



గురువారం సచివాలయంలో జరిగిన ఆర్ అండ్ బి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# దేశంలోనే నంబర్ వన్‌గా రాష్ట్రంలో రహదారుల నిర్మాణం

### ప్రతి రహదారి పనులకు డెడ్‌లైన్ తప్పనిసరి: సిఎం చంద్రబాబు

**విజయవాడ మే 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రహదారులను అత్యుత్తమ నాణ్యతనిర్వహణ కలిగి ఉండేలా తీర్చిదిద్దాలని... అలాగే తలపెట్టిన అన్ని రహదారుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రతీ రహదారి పనులకు డెడ్‌లైన్ నిర్దేశించి, అనుకున్న సమయానికల్లా కార్యరూపం దాల్చేలా చూడాలని స్పష్టం చేశారు. వర్షాకాల రాకముందే రోడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. 8,744 కి.మీ వరకు రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులు జాతీయ స్థాయిలోనే నెంబర్‌వన్‌గా ఉండాలని సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో పూర్తిగా పాడైన 2,683 కి.మీ. రహదారులను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... పలు అంశాలపై అధికారులకు మార్గదర్శకం చేశారు. ఆర్ అండ్ బీలో ఉన్న 304 ఎఇ పోస్టుల ఖాళీల్లో గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న సివిల్ ఇంజినీరింగ్ ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

**రాష్ట్రంలో 97 శాతం మరమ్మతులు పూర్తి**

రాష్ట్రంలో రూ.860 కోట్లతో 20,060 కి.మీ. పొడవునా గుంతలు లేకుండా చేపట్టిన మరమ్మతుల పనులు 97 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌హెచ్ఏఐ, మార్త్‌కి సంబంధించి రూ.78,295 కోట్లతో 3,510 కి.మీ. పొడవైన.. 146 పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. 2024 25లో ఎన్‌హెచ్ఏఐ, మార్త్‌కి సంబంధించి రూ.11,682 కోట్లతో 546 కి.మీ. పొడవైన.. 22 పనులు పూర్తి చేశామని చెప్పారు. 202526లో ఎన్‌హెచ్ఏఐ, మార్త్, ఆర్ అండ్ బీకి సంబంధించి రూ.47,788 కోట్లతో 1,186 కి.మీ. పొడవైన... 46 పనులు పూర్తి చేస్తామని అన్నారు.

## ఇద్దరు మావోయిస్టుల మృతి

>> కాకూరి పండన్న అలియాస్ జగన్ పైన సుమారు 100కు పైగా కేసులు ఉన్నాయని, ఇరవై లక్షల రూపాయలు రివార్డులు ఉందన్నారు. అలాగే వాగ పొడియామి అలియాస్ రమేష్ పైన సుమారు 30 కు పైగా కేసులు ఉన్నాయని ఈయనపై ఐదులక్షల రివార్డు ఉందన్నారు. మావోయిస్టులు మృతి చెందిన సదరు సంఘటనా స్థలంలో ఈ క్రింది తెలిపిన వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎ కె 47 02,0.303 01,4 మ్యాగజైన్లు 3,ఎకె ఒక 0.303 మ్యాగజైన్, మ్యాగజైన్ పౌచ్లు, మెడిసిన్, చిన్న కత్తి, 2 లక్షల98 వేలు నగదు, కిట్ బ్యాగులు, కళ్ళ అద్దాలు 03 జతలు, మావోయిస్ట్ సాహిత్యం, పుస్తకాలు, ఆలీవ్ గ్రీన్ యూనీఫారం, ఇతర వస్తువులు పై సంఘటనలో లభ్యం అయ్యాయన్నారు. అడ్డతీగల సర్కిల్ వై రామవరం పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసారన్నారు. ఇంకా ఎవరైనా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోవాలని అనుకుంటే అల్లూరి జిల్లా పోలీసు వారు అందుకు సిద్ధంగా ఉన్నారన్నారనీ ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.

## లిక్కర్ కేసు నిందితులకు ఎదురు దెబ్బ

>> వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో ...నాటి సిఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి,జగన్ ఓఎస్టీ కృష్ణమోహనరెడ్డి,భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఇప్పటి వరకు 30 మందిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ముడుపుల వసూళ్ళకు వీలుగా మద్యం విధానాన్ని సిద్దం చేయాలనే కుట్ర రూపకల్పన,ముడుపుల వసూళ్ళ నెట్‌వర్క్ నిర్వహణలో అప్పటి ప్రభుత్వ పెద్దల తరపున కీలక పాత్ర పోషించిన ప్రధాన నిందితుడు(ఎ1) రాజ్ కెసిరెడ్డివైకాపా ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి,ఆ పార్టీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి తదితరులతో కలిసి ఈ ముగ్గురు కుంభకోణంలో అన్ని స్థాయిల్లోనూ భాగస్వాములయ్యారని,మద్యం సింటికేట్‌లో వీరిదీ ప్రధాన పాత్రేనని సిట్ ఇప్పటికే గుర్తించింది.

విజయవాడలోని వెటర్నరీ కాలనీలో సిట్ అధికారులు సోదాలు చేపట్టారు. జగన్‌కు అప్పటి కార్యదర్శి ధనుంజయరెడ్డి,ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డి,వ్యక్తిగత కార్యదర్శి కెఎన్ఆర్ నివాసాల్లో తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో పలు డాక్యుమెంట్లును స్వాధీనం చేసుకున్నట్లు కీలక సమాచారం.

# ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ ఎపి

>> అన్నారు. ఎల్‌జి యూనిట్ నిర్మాణానికి పూర్తిసహాయ సహకారాలందిస్తామని, ఇక్కడ అనుబంధ యూనిట్లతోబాటు ఎల్‌జి సిటీ నిర్మించాలని కోరారు. శ్రీసిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంతో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. ఒక ప్రతిష్టాత్మకమైన యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ కు మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ఎల్‌జిప్రధాన యూనిట్ ద్వారా దాదాపు 1,500 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుందన్నారు. ఎల్‌జిముఖ్యవిక్రేతలు అదనంగా 839కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడం ద్వారా మరో 690కిపైగా ఉపాధి అదకాశాలను కల్పిస్తారని తెలిపారు. ఇది స్థానికఆర్థిక వ్యవస్థపై గణనీయమైన భారీప్రభావాన్ని చూపుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్తకలల సాకారంగా మారిందన్నారు. వాణిజ్యానికి ఎప్పుడూ ఆంధ్రప్రదేశ్ గేట్లు తెరిచే ఉంటాయని మంత్రి ఉద్ఘాటించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జి జియోన్, ఎల్‌జి విక్రేత సంస్థల నాయకత్వ బృందాలు, భాగస్వాములు ,భారత్‌లో కొరియన్ రిపబ్లిక్ రాయబారి లీ సియాంగ్ హో, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ హోం సొల్యూషన్స్ సిఇఒ జేచియోల్‌లియు, ఎకో సొల్యూషన్స్ సిఇఒ జే సంగ్ లి, సిడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలు పులివర్తినాని, కోనేటి ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఏపి ఐటి ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి కాటంనేని భాస్కర్, తిరుపతి జిల్లా కలెక్టర్‌డాక్టర్ వెంకటేశ్వర్, ఎపిఐఐసి ఉపాధ్యక్షుడు అభిషిక్త్‌కిశోర్, ఎపి,తెలంగాణ కాన్సులేట్ జనరల్ చుక్కపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతే రాజధాని

>> సైన్యానికి అండగా ఉండాలని నిర్ణయించింది. అదే విధంగా ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన భారత ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీలకు కేబినెట్ అభినందనలు తెలిపింది. అలాగే ఎపి రాజధాని అమరావతిగా కేబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని నిర్ణయించింది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కేబినెట్ కోరింది. పునర్విభజన చట్టంలో రాజధానిగా అమరావతి అని పెట్టాలని మంత్రి మండలి కోరింది. దీని వలన అమరావతికి చట్టబద్ధత కల్పించినట్టు అవుతుందని కేబినెట్ పేర్కొంది. క్యాపిటల్ అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ. 10,000 నుంచి 20,000కు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే మత్స్యకారులకు ఈ నిధులు ప్రభుత్వం పంపిణీ చేసింది. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి మెగా ఈవెంట్స్ నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చించి, ఆమోదించారు. మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో చేపట్టేందుకు కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. వైఎస్సార్సీపీ హయాంలో ఆమోదించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న మూడు బిల్లులను వెనక్కి తీసుకునేలా కేబినెట్ లో ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ చట్ట సవరణ బిల్లు 2019, కార్మిక చట్ట సవరణ బిల్లు 2019, ఫ్యాక్టరీస్ సవరణ బిల్లు 2019 లను వెనక్కు తీసుకోవాలని కేబినెట్‌లో ప్రతిపాదించారు.

అమరావతి రీ స్టార్ట్ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోడీకి కేబినెట్ ధన్యవాదాలు తెలిపింది. 47వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై కేబినెట్ ఆమోదించింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ కార్యక్రమాలపై కేబినెట్‌లో చర్చించారు. దేశ సరిహద్దులో యుద్ధ వాతావరణంపైనా మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. తీర ప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమలు, ఇతర కీలకమైన ఇన్స్టలేషన్‌ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై కూడా మంత్రులతో చర్చించినట్లు తెలుస్తోంది. సీఆర్డీఏ 47వ అథారిటీ సమావేశంలో రాజధానిలో భూ కేటాయింపులపై తీసుకున్న నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.రూ.514 కోట్లతో గెజిటెడ్ అధికారుల నివాస భవనాల నిర్మాణం చేపట్టనుంది. అక్కడ అదనపు మౌలిక సదుపాయాలు కల్పన కోసం 194 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చింది. 9 టవర్‌ల నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు 517 కోట్లతో టెండర్‌లకు అనుమతి ఇచ్చింది. మొత్తంగా 1732.31 కోట్లకు అనుమతి ఇచ్చారు.

అమృత్ 2.0 కింద రాష్ట్ర జల కార్యాచరణ ప్రణాళిక మొదటి రెండవ విడతలో గతంలో చేసిన సవరణల అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని పురపాలక సంస్థల్లో 281 పనులను ఎస్ఎన్ఏ స్పాష్ ప్లాట్‌ఫాం ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈ పనులకు సంబందించి ప్రతిపాదించిన 12 రకాల నిబంధనలకు కూడా ఆమోదం తెల్పింది. 2025-26 సంవత్సరానికి పెద్ద, మధ్యమ మరియు చిన్న నీటిపారుదల వనరులకు సంబంధించి రూ.345.39 కోట్లతో 7174 ఆపరేషన్ మరియు నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం కోసం మరియు నీటి వినియోగదారుల సంఘాలు అందుబాటులో లేని 7 రోజులలోపు రూ.10.00 లక్షల విలువ కంటే పైబడిన పనులకు స్వల్పకాలిక టెండర్ నోటీసును ఆహ్వానించడానికి అనుమతించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

**అమరావతి నిర్మాణంపైన, ప్రభుత్వ పథకాలపైన విస్తృత ప్రచారం ఇవ్వండి**

మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో పర్యటనలు పెంచాలని, ప్రతి నియోజక వర్గానికి వెళ్లాలని, మూడు పార్టీల నాయకులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. కె.అచ్చెన్నాయుడు,ఎన్ఎండీ ఫరూక్,కందుల దుర్గేష్,టిజి భరత్,గుమ్మడి సంధ్యారాణిలతో సమావేశమయ్యారు. వారి శాఖలు,నియోజక వర్గం, ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో వారి పనితీరుపై తన దగ్గరున్న నివేదికలు, సర్వేల్లోని విషయాలపై మాట్లాడారు. దస్త్రాల పరిష్కారంలో ఎవరు ఏ స్థానంలో ఉన్నారు,సామాజిక మాధ్యమాల్లో ఎంత చురుగ్గా ఉన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులుగా జిల్లాల్లో ఎన్నిసార్లు పర్యటించారు. డీఆర్‌సి సమావేశాలు ఎన్ని నిర్వహించారు వంటి అంశాల ఆధారంగా వారి పనితీరు గురించి సిఎం మాట్లాడినట్లు తెలిసింది. బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసిస్తూనే ఇంకా మెరుగు పర్చుకోవాల్సిన వారికి తగుసూచనలు చేసినట్లు సమాచారం. మంత్రులు ఇన్చార్జిలుగా ఉన్న జిల్లాలకు వెళ్లినపుడు మూడు పార్టీల నాయకులతో వీలైనంత తరచుగా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. టిడిపి నాయకుల మధ్య గాని,టిడిపి,జనసేన నాయకుల మధ్య గానీ ఏమైనా విభేధాలుంటే ఇన్‌ఛార్జి మంత్రులే భాధ్యత తీసుకొని పరిష్కరించాలని స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీల నాయకుల మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా,ఎన్నికల నాటి స్ఫూర్తి ఎప్పటికీ కొనసాగేలా చూడాలని చంద్రబాబు వారికి దిశా నిర్దేశం చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 09-05-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి మ.2.57
హస్త రా12.09
వర్జ్యం ఉ.9.11-ఉ.10.59
దు.8.14-9.05 2) మ.12.31-మ.1.22
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. చర్చలు సఫలం. పుణ్యక్షేత్రాల సందర్శిస్తారు.

**వృషభం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొత్త ఆశలు చిగురిస్తాయి. వస్తు, వస్త్రాల కొనుగోలు చేస్తారు.

**మిథునం:** పనులలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. సోదరుల కలయిక.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. ఉద్యోగ యత్నాలు నత్తనడకన సాగుతాయి.

**కన్య :** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. శ్రమ పెరుగుతుంది. ఇంటాబయటా అనుకూలం.

**ధనుస్సు:** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**మకరం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 'నకిలీ' మందులపై గట్టి నిఘా

>> జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటినీ విధించవచ్చు. తదనంతర నేరాలకు ఏడాది పాటు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటినీ విధించవచ్చు. ప్రకటనల్ని జారీ చేసే వారే కాక వాటిని రూపొందించడంలో పాల్గొనే వారు కూడా శిక్షార్హులే. అధీకృతులు చేయబడిన 13 మంది ఆయుష్ అధికారులు ఆయా జిల్లా పరిధుల్లో అసత్యపు ప్రకటనల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసు యంత్రాంగం వాటిని నమోదు చేయాలి.

సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు తప్పుడు ప్రకటనల తీవ్ర ప్రభావాల దృష్ట్యా ప్రజల్ని చైతన్యపర్చేందుకు, పోలీస్ యంత్రాంగంలో తగు అవగాహన కల్పించేందుకు వెంటనే చర్యలకు ఉపక్రమించాలని ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఫిర్యాదుల పరిష్కారానికి అడిషనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో తగు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, జాతీయ స్థాయిలో తగు సమన్వయంతో సమర్థవంతమైన చర్యల్ని తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలని..ఈ దిశగా తీసుకునే చర్యలపై ఈ ఏడాది జూన్ నెలలోగా తమకు నివేదించాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది.

**అల్లోపతిక్ మందుల ప్రకటనలపై నిఘా..**

అల్లోపతిక్ మందులకు సంబంధించి ప్రకటనలపై నిఘాఉంచి తగు చర్యల్ని తీసుకునేందుకు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లందరికీ అధికారాలిచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు విధులునిర్వహిస్తున్నారు. గత పదేళ్లలో ఈరంగంలో 118అసత్యపు ప్రకటనలపైచర్యలు తీసుకున్నారు.

## 11 మందికి యావజ్జీవం

>> హత్యకు గురయ్యారు. ప్రత్యర్థులు కాపుగాసి అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ సంఘటనలో నారాయణరెడ్డితో పాటు ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు కూడా హత్యకు గురయ్యారు. ఆ ఘటనపై కృష్ణగిరి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 46/2017 కేసు నమోదు చేశారు. అందులో ఐపిసి147,148,302,109 సెక్షన్‌లతో ఈ ఎస్ యాక్ట్‌తో పాటు మరికొన్ని సెక్షన్ మేరకు అభియోగాలు నమోదు చేశారు. ఈ జంట హత్యల కేసులో 17 మంది నిందితులు కాగా ఒకరు మృతి చెందారు. ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు కూడా గతంలో నిందితుడిగా ఉండేవారు. అయితే అప్పట్లోనే ఆయన పేరును కోర్టు తొలగించింది. చెరుకులపాడు నారాయణ రెడ్డి, బోయ సాంబ శివుడు డబల్ మర్డర్ కేసులో కర్నూల్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ కోర్టు గురువారం తుది తీర్పును వెలువరించింది. తుది తీర్పు కావడంతో 16.మంది ముద్దాయిలు కోర్టుకు హాజరు అయినారు. నిందితుల జాబితా ఇలా ఉంది. ఎ వన్ రామాంజనేయులు ఎటు బోయ రామానాయుడు ఏ.1 రామాంజనేయులు, ఏ.2 బోయ రామనాయుడు, ఏ3 కురువ రామకృష్ణ , ఏ5 మబోయ బాలుడు, ఏ6 బోయ చిన్న ఏలప్ప, ఏ7 బోయ పెద్ద ఎల్లప్ప , ఏ8 బోయ వెంకటరాముడు, ఏ9 బోయ గంటల శ్రీను, ఏ10 చాకలి నారాయణ, ఏ11 రామాంజనేయులు, ఏ12 రామాంజనేయులు, ఏ13 పెద్ద బీషన్న , ఏ16 కురువ పెదయ్య , ఏ17 బోయ గిడ్డయ్య, ఏ18 బోయ గోపాల్, ఏ 19 చిన్న వెంకట్. సుదీర్ఘకాలం విచారణ అనంతరం 11 మందికి శిక్ష విధించింది కోర్టు.. సాక్షాధారాలు రుజువు కాకపోవడంతో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఇందులో ఏ 1, ఏ 3, ఏ 5, ఏ 9, ఏ 11, ఏ 13 లకు ఐపిసి 302 సెక్షన్ ప్రకారం జీవిత ఖైదు విధించడంతోపాటు.. ఐపీసీ 148 సెక్షన్ మేరకు ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు... రూ.1000 జరిమానా విధించడం జరిగింది. ఏ 10, ఏ 16, ఏ 17, ఏ 18, ఏ 19 లను నిర్దోషులుగా కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో 11 మంది దోషులను జైలుకు తరలిస్తున్నారు. తీర్పు అనంతరం చెరుకులపాడులో తొగట్చేడులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.. ఈ నేపథ్యంలో పోలీసులను భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు తీర్పుపై.. కర్నూలు జిల్లా కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పట్ల దివంగత నారాయణరెడ్డి భార్య పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించారు. కోర్టు తీర్పుతో న్యాయస్థానాల పట్ల మరింత నమ్మకం పెరిగిందని చెప్పారు. కోర్టు ఇచ్చిన ఈ సంచలన తీర్పుతోనైనా తనలాంటి మరో మహిళకు అన్యాయం జరగకూడదని భావిస్తున్నట్లు తెలిపారు.

# కలెక్టర్లకు 'రెడ్‌క్రాస్' అవార్డులు

## పేదరోగులకు ఉచితంగా రక్తం అందచేస్తున్న సంస్థ: గవర్నర్ అబ్దుల్ నజీర్



విజయవాడలోని రాజ్‌భవన్‌లో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అవార్డు అందిస్తున్న గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

**విజయవాడ, మే 8.ప్రభాతవార్తప్రతినిధి:**రెడ్ క్రాస్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పేద రోగులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్ర శాఖాధ్యక్షులు.గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ తెలిపారు. గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన వరల్డ్ రెడ్ క్రాస్, ఇంటర్నేషనల్ థలసీమియా డే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ 20 బ్లడ్ సెంటర్లను నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం 65,000 పైబడి రక్త యూనిట్లను సేకరిస్తోందని, లక్షకు పైగా యూనిట్లను అవసరమైన నిరుపేదలకు జారీ చేస్తోందని తెలిపారు. వీటిలో మూడొంతులు ప్రభుత్వ ఆసుపత్రులకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ ఉద్యమం కోసం విశేష సేవలు అందించి గరిష్టంగా విరాళాలు సమీకరించిన జిల్లా కలెక్టర్లకు గవర్నర్ అవార్డులు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ అవార్డు తన ఒక్కరి సొంతం కాదని, వరద బాధితుల సహాయార్థం, సహాయం చేసిన ప్రతి ఒక్కరి కృషికి ఇది గుర్తింపు అన్నారు. అవార్డుతో తన బాధ్యత పెరిగిందని భవిష్యత్తులో కూడా జిల్లా ప్రజల కోసం పూర్తిస్థాయిలో, అంకితభావంతో పనిచేస్తానన్నారు. దూరదృష్టి, అపారమైన అనుభవంతో జిల్లా యంత్రాంగానికి మార్గదర్శకత్వం వహించిన ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేసారు. తూర్పు గోదావరి కలెక్టర్ పి. ప్రశాంతి, కృష్ణా కలెక్టర్ డి.కే. బాలాజీ, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు కలెక్టర్ ఓ. ఆనంద్, నంద్యాల కలెక్టర్ జి. రాజకుమారి, కాకినాడ కలెక్టర్ సాగిలి షాన్ మోహన్, కర్నూలు కలెక్టర్ పి. రంజిత్ బాషా, బాపట్ల కలెక్టర్ జె. వెంకట మురళి లకు పతకాలు అందుకున్న వారిలో ఉన్నారు. తొలుత గవర్నర్ రాజ్‌భవన్ నుండి వర్చువల్ విధానంలో శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో స్థాపించిన రెడ్ క్రాస్ థలసీమియా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. కీలక రక్త మార్పిడి చికిత్స అవసరమున్న పిల్లలు, వ్యక్తులకు మద్దతుగా ఈ పథకం చేపట్టారు. గవర్నర్ మాట్లాడుతూ ఇక రక్త కణ విభజన ఉన్న అన్ని బ్లడ్ సెంటర్లలో ట్రాన్స్‌ఫ్యూషన్ సేవలను విస్తరించాలన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ చైల్డ్ కేర్, మహిళా సంక్షేమం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొలిమహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు, సీఈఓ ఏ.కె. పరీడా, వివిధ జిల్లా శాఖల చైర్మన్లు, రాజ్‌భవన్ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.



## అంతరిక్షంలో నిఘా నేత్రం

**- ఆర్‌ఐ శాట్-1బి ప్రయోగానికి ఇస్రో సిద్ధం**

**శ్రీహరికోట (తడ), మే 8 ప్రభాతవార్త** అంతరిక్షం నుంచి నిఘానేత్రంలా పనిచేసే ఆర్‌ఐ శాట్-1బి ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. సరిహద్దుల్లో ఉగ్రవాద కదలికలను పసిగట్టడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుందని నమ్ముతున్నారు. ఇఓఎస్-09 పేరుతో ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్‌ను ఇస్రో రూపొందించింది. ఈ నెల 18న ఉదయం 6.59 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్ ద్వారా దీన్ని ప్రయోగించనున్నారు. ఈ స్పై శాటిలైట్ హై రిజల్యూషన్ రాడార్ ఇమేజ్‌తో శక్తివంతమైనదిగా రూపొందించారు. ప్రస్తుతం చోటుచేసుకున్న తీవ్ర పరిణామాల నేపథ్యంలో ఇటువంటి ఉపగ్రహాలు భారత్‌కి అవసరంగా ఉన్నాయని దేశ ప్రజలు కూడా ఎదురు చూస్తున్నారు. గతంలోను రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్షంలోకి చేర్చి అక్కడి నుంచి నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకున్న ఘనత ఇస్రోది. రీ శాట్-1ఎ పేరుతోను గతంలో ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించి ఉంది. ప్రస్తుతం అత్యవసర పరిస్థితుల్లో భూ పరిశీలన ఉపగ్రహ అవసరాలను ఇస్రో గుర్తించి శ్రీహరికోట నుంచి ప్రయోగించడానికి సిద్ధమయింది. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో ఏర్పాట్లు జోరందుకున్నాయి. కౌంట్‌డౌన్ తేదీలను ప్రకటించాల్సి ఉంది. ఇఓఎస్-09 ప్రయోగం తర్వాత భారతీయ శాస్త్రవేత్తలు ఇటువంటి శక్తివంతమైన మరిన్ని ఉపగ్రహాలకు రూపకల్పన చేసి ప్రయోగించనున్నారు.

# హైకోర్టునే దారి మళ్లించిన పిఎస్సార్!

**గ్రూప్ - 1 మెయిన్స్ జవాబు పత్రాలు మూల్యాంకనం చేయించలేదని అభియోగం - క్యామ్‌సైన్ మీడియా సంస్థను పెట్టుకుని అక్రమాలు**

**- పమిడికాల్వ మధుసూధన్ రిమాండ్ రిపోర్టులో ప్రస్తావన**

**విజయవాడ,మే 8,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ హయంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్‌ఆర్ ఆంజనేయులు ఏకంగా హైకోరునే పక్కదోవపట్టించినట్లు అభియోగాన్ని తాజాగా ఎదుర్కొంటున్నారు. 2018లో విడుదలైన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి మెయిన్స్ జవాబు పత్రాల డిజిటల్ మూల్యాంకనాన్ని రద్దు చేసి, మాన్యువల్ మూల్యాంకనం జరిపించాలని హైకోర్టు ఆదేశించగా వాటిని ఆయన పట్టించుకోలేదన్నది ఆరోపణ,కోర్టు చెప్పినట్లు చేయకుండానే చేసినట్లు...న్యాయస్థానాన్ని నమ్మించేందుకు హాయ్‌ల్యాండ్ వేదికగా ఓ మొక్కుబడి తంతు నడిపించారంటూ పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసారు.ఆ రిపోర్టును అనుసరించి డిజిటల్ మూల్యాంకనంలో అభ్యర్థులకు వచ్చిన మార్కులనే మాన్యువల్ మూల్యాంకనం పేరిట మరోసారి నమోదు చేయించారు. దీని కోసం శ్యామ్‌సైన్ మీడియా అనే ప్రైవేటు సంస్థను ముందుపెట్టారు. పోలీసు దర్యాప్తులో ఈ కుట్ర మొత్తం బయటపడింది. ఈ కేసులో రెండో నిందితుడైన క్యామ్‌సైన్ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూధన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు బుధవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఆయనకు ఈ నెల 21 వరకు రిమాండును విధిస్తూ న్యాయాధికారి దేవకి ఆదేశాలిచ్చారు. పోలీసులు ఈ కుంభకోణంలో పీఎస్‌ఆర్ ఆంజనేఏయులు,మధుసూధన్‌ల పాత్ర గురించి రిమాండు రిపోర్టులో వివరించారు. 169 గ్రూపు-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ 2020లో నిర్వహించిన మెయిన్ పరీక్షలకు 6,807 మంది హాజరయ్యారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్నదానికి విరుద్ధంగా సమాధాన పత్రాల్ని డిజిటల్ మూల్యాంకనం చేయించి 2021 ఏప్రిల్ 28న ఫలితాలు ప్రకటించేసింది. అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉంటూ సర్వం తానై వ్యవహరించిన ఆంజనేయులు న్యాయస్థానాన్ని మభ్యపెడుతూ మాన్యువల్ మూల్యాంకనం చేయకుండానే చేసినట్లు సృష్టించేందుకు తతంగం నడిపించారు. ఒక రోజున ఏపీపీఎస్సీ అదనపు కార్యదర్శి డి.విశాల,సంయుక్త కార్యదర్శి కెవి ప్రసాద్,ఉప కార్యదర్జిశ ఐ.నర్సింహమూర్తి,సహాయ కార్యదర్శి బి.వెంకట సుబ్బయ్య,అధికారిణి వెంకటలక్ష్మిని తన ఛాంబర్‌కు పిలిపించారు.


## ఎల్‌జీకి స్వాగతం - సిఎం చంద్రబాబు ట్వీట్

**విజయవాడ మే8, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు హర్షం ప్రకటించారు. ఎల్‌జీకి ఆంధ్రప్రదేశ్ ఆహ్వానం పలుకుతోందంటూ ట్వీట్ చేశారు. శ్రీసిటీలో రూ.5800 కోట్లకు పైగా పెట్టుబడులతో ప్రత్యక్షంగా పరోక్షంగా 2500 పైగా ఉద్యోగాలతో ఈ సంస్థ ఏపీని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక కమిటీ కింద ఈ సంస్థ 100శాతం ప్రోత్సాహకాలు పొందిందని సీఎం తెలిపారు. ఇది మన రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధికి ఒక ఉత్తేజకరమైన కొత్త అధ్యాయనానికి నాంది పలికిందని పేర్కొంటూ శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు మంత్రి నారా లోకేశ్ నేడు శంకుస్థాపన చేసిన అనంతరం దిగిన ఫోటోను సీఎం షేర్ చేశారు.

# కొండపై హోటళ్లలో చైనీస్ వంటకాలు నిషేధం

**- భక్తులకు సాంప్రదాయ వంటకాలు అందించాలి - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** దేశంనలుమూలల నుండి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు కొండపై హోటళ్ళలో చైనీస్ వంటకాలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రకటించారు. ఈ ఆహారపదార్థాలు భక్తుల ఆరోగ్యానికి హానికరంగా మారాయని అన్నారు. తిరుమలలోని అన్ని హోటళ్ళ యాజమాన్యం భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలోఉంచుకుని సాంప్రదాయ వంటకాలు తయారుచేసి పూర్తిగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పుణ్యక్షేత్రం తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులు, పనిచేస్తున్న సిబ్బంది కూడా సాంప్రదాయ వస్త్రధారణ ధరించి భక్తులకు సేవలందించాలని ,ముఖ్యంగా తెలుగుసాంప్రదాయంఉట్టిపడాలని చెప్పారు. గురువారం మధ్యాహ్నాం తిరుమలలోని ఆస్థానమండపంలో హోటళ్ళ నిర్వాహకులు, సిబ్బందితో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్రకుమార్, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు,



విఎస్‌ఒలు సదాలక్ష్మి, సురేంద్ర,క్యాటరింగ్ అధికారి శాస్త్రితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ మాట్లాడుతూ దేశ:ంలోని ఇతర రాష్ట్రాల నుండి విదేశాల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులకు సాంప్రదాయ వంటకాలను అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా హోటళ్ళలో పరిశుభ్రత ,నిర్వహణ చక్కగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారపదార్థాలను అందించాలన్నారు. తిరుమలయాత్ర భక్తులకు ఒక మధురానుభూతిని కల్పించాలన్నారు. హోటళ్ళ నిర్వాహకులు చేసే చిన్నచిన్న పొరబాట్ల వల్ల భక్తులు చాలా అసంతృప్తితో వెళుతున్నారని చెప్పారు. హోటళ్ళ నిర్వాహకులు చట్టబద్దమైన నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. టిటిడి ఆరోగ్యవిభాగం ప్రతి రోజూ చేయాల్సిన పనులతో చెక్‌లిస్ట్ అందిస్తుందని, దాన్ని తప్పకుండా ఆచరించాలన్నారు. టిటిడిలోని అన్ని విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు హోటళ్ళ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేస్తారన్నారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంతోబాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో 33 అన్నప్రసాద కౌంటర్లలో టిటిడి నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. భగవంతుని సన్నిధిలోని హోటళ్ళలో కూడా అదే స్ఫూర్తితో భక్తులకు నాణ్యమైన, రుచికరమైన శుచిగా సాంప్రదాయ ఆహారపదార్థాలు అందించాలని చౌదరి సూచించారు.

## మద్యం కుంభకోణం కేసు: ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి అరెస్ట్‌లో నిబంధనలు పాటించాం

**- హైకోర్టుకు నివేదించిన అడ్వకేట్ జనరల్**

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:**మద్యం కుంభకోణం కేసులో ప్రదాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి అరెస్ట్ విషయంలో సిఐడి అధికారులు నిబంధనలు పాటించారని, అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టుకు తెలిపారు. అరెస్ట్‌కు కారణాలను తెలియచేసామన్నారు. అరెస్ట్ అనంతరం సంబంధిత అథారిటీ నునండి అనుమతి రాగానే అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)సెక్షన్లను చేర్చామన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే కోర్టు కెసిరెడ్డికి రిమాండ్ విధించిందన్నారు. ఇరువైపు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు,జస్టిస్ కె.మన్మథరావులతో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. తన కుమారుడు కెసిరెడ్డిని రిమాండ్‌కు పిటీషన్ వేశారు. సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటీషనర్‌ను అరెస్ట్ చేసిన 24 గంటల తర్వాత నిందితుడిగా చేర్చారని తెలిపారు.

అరెస్ట్‌కు కారణాలను పేర్కొంటూ అందచేసిన నోటీసులో సీపీ యాక్ట్ క్రింద సెక్షన్లు నమోదు చేసినట్లు వెల్లడించలేదని చెప్పారు. రిమాండు రిపోర్టులో మాత్రం ఆ సెక్షన్లను చేర్చారన్నారు. అరెస్ట్ విషయంలో అధికారులు నిబంధనలను పాటించలేదన్నారు.

రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

## ఐపిఎస్‌లు బిందుమాధవ్, అమిత్ బర్దార్‌పై క్రమశిక్షణ చర్యలు నిలిపివేత

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:**ఇద్దరు ఊపీఎస్ అధికారులపై తదుపరి క్రమశిక్షణా చర్యలను నిలిపివేసూప్త ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో పల్నాడు జిల్లా అప్పటి ఎస్పీ బిందుమాధవ్,అనంతపురం జిల్లా అప్పటి ఎస్పీ అమిత్ బర్ధార్‌పై ఈసీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. అయితే,ఈ ఘటనకు సంబంధించి ఇరువురు అధికారుల నుండి వివరణ తీసుకున్న ప్రభుత్వం వారిపై తదుపరి క్రమశిక్షణా చర్యలను నిలిపివేసింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపికి సిఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేసారు.

## కొత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**- బైక్‌ను ఢీకొన్న కంటైనర్ ముగ్గురు మృతి**

**పెండ్లిమర్రి, మే 8, ప్రభాతవార్త:** పెండ్లిమర్రి మండలం కొత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైకుపై ప్రయాణిస్తున్న వారిని కంటైనర్ ఢీకొనడంతో ఇద్దరు ఇక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులు వేంపల్లె శ్రీరామ్‌నగర్ గుటక్టకు చెందిన బాలయ్య, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మల్లికార్జున, మదనపల్లికి చెందిన మల్లికార్జునలుగా గుర్తించారు. ఘటనా స్థలం వద్దకు స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు మృతితో వారి కుటుంబాల్లో విషాధచాయలు అలుముకున్నాయి. పూర్తి సమాచారం పోలీసుల విచారణలో తేలియాల్సి

## ప్రైవేటు బడుల్లో ఆర్టీఇ ప్రవేశాలకు రేటింగ్ ఆధారంగా ఫీజులు

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:**విద్యా హక్కు చట్టం క్రింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా కల్పించే ప్రవేశాలకు ఫీజులు నిర్ణయించడంపై పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.ప్రతి ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం 25 శాతం సీట్లలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తోంది.ఈ అంశంలో న్యాయస్దానం ఉత్తర్వులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరే విద్యార్దులకు ఫీజులను నిర్ణయించేందుకు ప్రభుత్వం ఇటీవల వేసిన కమిటీ సమావేశమైంది. సదుపాయాల ఆధారంగా ప్రైవేటు పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,953 ప్రైవేటు పాఠశాలలు ఉండగా,వీటిల్లో ఒక స్టార్ ఉన్నవి 95,రెండు స్టార్లు ఉన్నవి 3,240,మూడు స్టార్లు 5,730,నాలుగు స్టార్లు ఉన్నవి 708 ఉన్నాయి. ఐదు స్టార్ల రేటింగ్ పొందిన ప్రైవేటు పాఠశాల రాష్ట్రంలో ఒక్కటీ లేదు. ఈ రేటింగ్ ఆధారంగా ఫీజులను ప్రతిపాదించారు. ఒక స్టార్ ఉన్న బడులకు సగటున 8 వేలు,రెండు స్టార్లు ఉన్న వాటికి రూ.9వేలు,మూడు స్టార్లు ఉంటే రూ.10 వేలు,నాలుగు స్టార్లు ఉన్న వాటికి రూ.12 వేలు,ఐదు స్టార్లు ఉంటే రూ.15 వేలు ఇవ్వాలని సమావేశంలో అధికారులు ప్రతిపాదించారు.



## రాయచోటి కేంద్రంగా నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ఏర్పాటు చేయండి

**- సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**

**విజయవాడ,వే8,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నమయ్య జిల్లాలో రాయచోటి కేంద్రంగా నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడువినతి పత్రం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అందజేసారు.అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని మరింత అభివృద్ధి చేయడానికి జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల ఏర్పాటు అత్యవసరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిఅభిప్రాయపడ్డారు.. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. నూతన కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాన్ని రాయచోటిలో త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా, శ్రీనివాసపురం వద్ద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనులు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రూ.290 కోట్ల నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే రాయచోటి నియోజకవర్గంలోని అనేక గ్రామా లకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు రాయచోటి నియోజకవర్గంలో మిగిలిన మున్సిపాలిటీల్లో నెలకొన్న సాగునీటి సమస్యలపై కూడా మంత్రి చంద్రబాబు నాయుడికి వివరించి, తక్షణ పరిష్కారం కోసం నిధుల కేటాయింపు జరగాలని కోరారు.

# తిరుమల సమాచారం



## గరుడవాహనంపై మలయప్ప

**- కన్నులపండువగా ముగిసిన పద్మావతి పరిణయం**

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీమహావిష్ణువు కలియుగంలో వేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించిన తొలిరోజుల్లో నారాయణవనంలోని ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వివాహమాడిన ఘట్టం నేటికీ తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు నిర్వహిస్తున్నారు. మూడురోజులుపాటు జరిగే ఈ పరిణయోత్సవాలు గురువారం సాయంత్రం కన్నులపండువగా ముగిశాయి. చివరిరోజు సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న మలయప్పస్వామి గరుడవాహనం అధిరోహించగా, శ్రీదేవిభూదేవి పల్లకీపై మరోవైపు నారాయణగిరి ఉద్యానవనంలోని కల్యాణవేదికపైకి మంగళవాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కల్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల,పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు,ఎదుర్కోలు, పూలబంతులాట, నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్ధులయ్యారు. అన్నమాచార్యకళాకారులు అలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకోవడంతో పరిణయోత్సవాలు ముగిశాయి. పరిణయోత్సవ మండపాన్ని వివిధ రకాల రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించి, శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు దంపతులు, టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్‌ఒలు సదాలక్ష్మి,సురేంద్ర, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు. స్వామివారి పరిణయోత్సవం వేళ శేషాచలం కొండల్లో చిరుజల్లులతో వరుణదేవుడు ఆశీర్వదించారు. చల్లటి వాతావరణంలో స్వామివారి పరిణయోత్సవం అత్యంత ఆహ్లాదకరంలో వేడుకగా ముగిసింది.

## తెలుగు ప్రజలకు శ్రీవారి ఆశీస్సులుండాలి

**- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు**



**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నట్లు రాష్ట్రహైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్‌లో ఆయన కుటుంబంతో కలిసి శ్రీవారినిదర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మొదటిఘాట్‌లో రైలింగ్‌ను ఢీకొన్న కారు

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళుతున్న భక్తుల కారు మొదటిఘాట్‌లో చివరన కారుటైరు పేలడంతో ప్రమాదానికి గురైంది. తిరుపతికి వెళ్ళేసమయంలో జరిగిన ఈ సంఘటనతో కారు పిట్టగోడ రైలింగ్‌ను ఢీకొంది.

ఈ ప్రమాదంలో కారులో ఉన్న తమిళనాడు భక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంతో ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న అలిపిరి విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని వాహనాన్ని తప్పించారు.

## ఎండల్లో వాన.. తిరుమలలో మోస్తరు వర్షం



**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో మండే ఎండలకు భక్తులు అల్లాడి పోతున్నారు. దీంతో గత రెండు రోజులుగా పూర్తిగా వాతావరణం మారింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై తిరుమలలోమోస్తరగూ వర్షం కురుస్తోంది. గత రెండురోజులుగా వాతావరణంలో మార్పుతో చల్లటిగాలులు వీయడంతో సాయంత్రం చిరుజల్లులతో మొదలైన వర్షం అర్ధగంటపాటు మోస్తరుగాకురిసింది. తొలుత వాన చిరుజల్లులతో మొదలైంది. ఈ వర్షానికి భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. తిరుమలలో కురిసిన వర్షంతో కాస్త వేడి చల్లబడింది. ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకున్నారు. ఈ వానకు భక్తులు ఆనందంగా పరవశించారు.

## ఆంధ్ర తెలంగాణ రైల్వే సరిహద్దుల్లో రూ.426 కోట్లతో రైల్వే డబ్లింగ్ పనులు

**రాజంపేట అర్బన్, మే8 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్ర తెలంగాణ సరిహద్దుల్లో మరో కొత్త రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి కేంద్ర రైల్వే బోర్డు 426 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే 28.50 కిలోమీటర్ల దూరం కొత్త రైల్వే డబుల్ లైన్ నిర్మాణంతోపాటు ఇతరు పనులు చేపట్టేందుకు గురువారంటెండర్లనుఆహ్వానించింది.రేవూరురామాపురంసంత్ సేవాలాల్ మహారాజు రైల్వే స్టేషన్ మధ్య(36.60 కిలోమీటర్ నుంచి 65.10 కిలోమీటర్ల చైనేజ్ వరకు కొత్త రైల్వే డబుల్ లైన్ పనులు చేపడతారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని మోటుమర్రి విష్ణుపురం మధ్య రైల్వే లైన్ సిగ్నలింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులు కూడా చేపడతారు. రెండేళ్ల లోగా ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అదేవిధంగా రాష్ట్రంలో గుంటూరు నంబూరు రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ గేట్ 03 వద్ద నాలుగు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను చేపడతారు. అలాగే నల్లపాడు బండారుపల్లె వద్ద లెవెల్ క్రాసింగ్ 06 వద్ద రెండు లైన్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపడతారు. ఇందుకు కేంద్ర రైల్వే బోర్డు 106.65 కోట్ల నిధులు కేటాయించింది. పెదన మచిలీపట్నం లెవెల్ క్రాసింగ్ 38 వద్ద , మాజెల్ల గుడ్లవల్లూరు లెవెల్ క్రాసింగ్ 12 వద్ద రెండు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు 108.03 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా రామవరప్పాడు నిడమనూరు రైల్వే స్టేషన్ల మధ్య జాతీయ రహదారి 16న కలుపుతూ కేసరి పల్లె వద్ద లెవెల్ క్రాసింగ్ 20 వద్ద 108.19 కోట్లతో రెండు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతారు.

## పాస్టర్ ప్రవీణ్‌కేసులో రూ.5 లక్షలు కట్టాలి: కెఎపాల్‌కు హైకోర్టు సూచన

**విజయవాడ.మే8,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్ ప్రవీణ్ మృతి కేసు విషయంలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఏ పాల్ కు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన పిల్ ను హైకోర్టు విచారించింది. ఆ కేసును సిబిఐతో విచారణ జరిపించాలని పిల్ లో కెఏపాల్ కోరారు. ఆ వ్యాజ్యాన్ని ఆయన సదుద్దేశంతోనే దాఖలు చేశారన్న రుజువు కోసం కోర్టు రిజిస్ట్రీ వద్ద రూ. 5లక్షలు కట్టాలని సూచించింది. ఆ సొమ్ము చెల్లించిన తర్వాతే విచారణ ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. హైదారాబాద్ నుంచి రాజమండ్రి వస్తూ మార్గమధ్యంలో అనుమానస్పద పరిస్థితుల్లో సువార్తకుడు పాస్టర్ ప్రవీణ్‌కుమార్ చనిపోయారు.ఈ కేసుపై ప్రత్యేకంగా దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించింది.ప్రవీణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో చనిపోయారని విచారణ అనంతరం పోలీసు నిర్ధారించింది. అదే విషయం ప్రకటించింది.ప్రవీణ్‌కుమార్ మరణంపై అనేక అభియోగాలను పాస్టర్ కె.ఏ పాల్ చేసారు. ప్రవీణ్ మృతి ఘటనపై ఆయన ఏపీ హైకోర్టులో పిల్ వేసారు.తానే స్వయంగా కేసును వాదిస్తూ ఈ ఘటనపై సీబీఐ విచారణ కోరారు.

వార్త

కొంత మందిని ఎల్లకాలం, అందరినీ కొంతకాలం మోసం చేయగలరేమో కాని ఎల్లకాలం అందరినీ మోసం చేయాలనుకోవడం అసాధ్యం.

-అబ్రహాం లింకన్

# సూత్రధారులే మూలం

ఎన్ని చట్టాలు చేసినా, మరెంతమంది అధికారులను నియమించినా, మరెన్ని సార్లు హెచ్చరించినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అరుదైన ఎర్రచందనం వృక్ష సంపద తరలిపోతూనే ఉన్నది. పట్టుబడిన స్మగ్లర్లపై కేసులు నమోదు చేస్తూనేఉన్నారు. జైళ్లకు పంపుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాల్పులకూడా వెనుకాడడం లేదు. అయినా ఇవేమీ ఈ స్మగ్లింగ్‌ను ఆపలేకపోతున్నాయి. గత నెలలో కోట్లాది రూపాయల విలువైన ఎర్రచందనం దుంగలు స్మగ్లర్లతోసహా పట్టుబడ్డాయి. గత నెలే కాదు అంతకుముందు కూడా ఈ ఎర్రచందనం తరలింపు నిరాటంకంగానే కొనసాగింది. ఈ అరుదైన ఎర్రచందనం వృక్షసంపదను కాపాడేందుకు ప్రత్యేకటాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన అన్ని హంగులను కల్పించారు. ప్రాణాలకు తెగించి సిబ్బంది శక్తిమేరకు కృషి చేస్తున్నారు. ఏకంగా పదుల సంఖ్యలో స్మగ్లర్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేతిలో మరణించినా ఏ మాత్రం వెరవడం లేదు. కొన్ని సందర్భాల్లో సిబ్బందిపై దాడులకు, చివరకు చంపడానికి కూడా స్మగ్లర్లు వెనుకాడడం లేదు. ఇందుకు వారు వాడుతున్న తుపాకులు, మారణాయుధాలే సజీవ సాక్ష్యం. గత యేడాది ఎర్రచందనం తరలిస్తున్న ఒక కారును కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయడంతో తొక్కించుకుంటూ స్మగ్లర్లు వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మరణించాడు. అయితే తమ సహచర ఉద్యోగిని ఢీకొట్టి పారిపోతున్న వాహనాన్ని మిగిలిన సిబ్బంది వెంబడించి కొంతదూరం వెళ్లిన తర్వాత పట్టుకోగలిగారు. వారు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించారు. గత మూడు, నాలుగు దశాబ్దాలుగా అత్యంత విలువైన వృక్షసంపద తరలిపోతూనే ఉన్నది. ప్రతిసారి కూలి కోసం వచ్చి, చెట్లను కూలగొడుతున్న కూలీలే పట్టుబడుతున్నారు తప్ప వారి వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగుచూడడం లేదు. ఆ ప్రాంతంలో ఎవరిని అడిగినా ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక పాత్ర ఎవరిది ఉందో కథలు కథలుగా చెప్తారు. అయినా పాలకపెద్దలు ఆ వైపు దృష్టిసారించకుండా మూలాల్లోకి వెళ్లకుండా ఈ అక్రమ స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ప్రయత్నం చేయడం ప్రయోజనం లేకుండాపోతున్నది. ఆంధ్రప్రదేశ్, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే ఈ ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయి. వీటిని 1973లో అరుదైన వృక్షజాతులజాబితా సైడ్స్‌లోకి చేర్చారు. దీంతో ఎర్రచందనం దుంగల ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. వాస్తవంగా చూస్తే ఈ ఎర్రచందనానికి మనదేశంలో పెద్ద గిరాకీ లేదు. మార్కెట్ కూడా లేదని చెప్పొచ్చు. జపాన్, చైనా దేశాల్లో ఊహించని రీతిలో డిమాండ్ ఉంది. అవి అంతకంతకు పెరుగుతుండడంతో కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడం స్మగ్లర్లు ఈ దుంగలను విదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్ర మార్గాల ద్వారా దేశ సరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలు అనుసరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే వ్యవసాయోత్పత్తుల పేరుతో బోగస్ అనుమతులు పొంది తరలింపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చెన్నై, ముంబయి, కొచ్చి తదితర రేవుల నుండి ఓడల ద్వారా తరలిపోతున్నాయి. రోడ్డు మార్గాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఢిల్లీ, చండీగఢ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును ఒక వ్యూహం ప్రకారం నేపాల్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి చైనాకు రవాణా అవుతున్నది. అదేకాదు, మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి కూడా యధేచ్ఛగారవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఈ చెట్లకు ఎందుకు ఇంత విలువ వస్తున్నది? ఎందుకు ఉపయోగిస్తున్నారనే విషయాల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. సంగీత పరికరాలకు, ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదనే ప్రచారం జరిగినా అది తప్పు అని తేలిపోయింది. అణు ఇంధనం తయారీలోనూ, శృంగార సామర్థ్యం పెంచేమందుల్లో వీటిని వాడుతున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. మరొకపక్క అటు జపాన్ కానీ, ఇటు చైనా కానీ వాటిని తాము ఎందుకు కొంటున్నారు, ఎందుకు ఉపయోగిస్తున్నామనే విషయం ఏమాత్రం బయటపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీటి ధర మాత్రం యేడాది యేడాదికి పెరిగిపోతున్నది. అంతర్జాతీయ బయో డైవర్సిటీ సంస్థ అధ్యయనం ప్రకారం ఒక టన్ను ఎర్రచందనానికి ఆరేడు కోట్లు పలుకుతుందని చెబుతారు. అందుకే రాయల సీమలోని కొన్ని మాఫియా ముఠాలు, కొందరు ఫ్యాక్షన్ నేతులు, మరికొందరు రాజకీయ నాయకులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తమ వ్యాపకంగా మార్చుకున్నారు. దీనికి తోడు అటవీ శాఖ సిబ్బంది అధికారులు కొందరు వారితో చేతులు కలుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. చట్టాల్లోని లొసుగులు కూడా స్మగ్లర్ల పాలిట వరాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా మిగులుతున్నాయనేందుకు వీగిపోతున్న కేసులను పరిశీలిస్తే అర్థమవుతుంది. దీంతో పట్టుబడుతున్నది, జైళ్లల్లో మగ్గుతున్నది కేవలం పొట్టకూటి కోసం రోజువారీ కూలీకి వస్తున్న తమిళనాడుకు చెందిన నిరుపేదలే. ఇలా పట్టుబడిన వారు కూడా శిక్షలు అనుభవించి మళ్లీ అదే వ్యాపకంలో మునిగిపోతున్నారు. డబ్బు ఆశ చూపి కొందరు పెద్దలు అమాయక కూలీలను ఇందులోకి దించుతున్నారు. వీరి వెనుక ఉన్న సూత్రధారులు బయటకు రావడం లేదు. ఆ సూత్రధారులను బయటకు తీసి మూలాలపై చర్యలు తీసుకుంటేనే ఈ వృక్ష సంపదను కాపాడగలుగుతారు.

జీవితంలో ప్రతి నిముషాన్ని వ్యర్థం చేయక ఉపయోగించుకో, లేకుంటే నీవు వృథా చేసినట్టి కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

## ప్రజావాక్కు



### శత్రువుకి బలమైన సందేశం

**భారతదేశం** తలపెట్టి, ముప్పావు గంటలోనే ముగించిన, సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ అభినందనీయం. రెండు వారాల క్రితంకాశ్మీరులోని పహెల్గాంలో అమాయక పర్యాటకులపై దాడికి తెగబడ్డ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మూలాల్ని అంతంచేసే తలంపుతో తలపెట్టిన ఈ సైనిక చర్య భారత్ శక్తియుక్తులను తెలిపేది. తీవ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు తాజా హెచ్చరిక లాంటిది. భారత దేశానికి వ్యతిరేకంగా తీవ్రవాదాన్ని ప్రోత్సహించడంపాకిస్థాన్‌కు కొత్తకాదు. 1947నుండి ఇప్పటికి నాలుగు సార్లు యుద్ధానికి తెగబడినా, లెక్కకు మిక్కిలి సార్లు భారత్‌పైకి ఉగ్రవాదుల్ని ఉసిగొల్పినా భారత్ సంయమనం కోల్పోలేదు. ఆ సందేశం అర్థంచేసుకుని ఉగ్రవాదుల్ని వదులుకోవడమా, లేదా భారత్‌తో తలపడి సర్వనాశనాన్ని కొని తెచ్చుకోవడమాఅన్నది ఆదేశపువిజ్ఞతపై ఆధారపడి ఉంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గురుకుల ఇంటర్ సమ్మర్ క్యాంపులు

**ఇటీవల**ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం చాలా సంతోషకరం. ఒక సంవత్సర కాలంపాటు చదివిన విద్యార్థులుఫెయిల్ అయారు. కానీ కేవలం 20రోజులలో సమ్మర్ క్యాంపులు నిర్వహించి తప్పనిసరిగా అన్ని సబ్జెక్టులు పాస్ కావాలని లేనిచోమెమోలు జారీ చేయడం సరికాదు. ఇలా అయితే విద్యార్థులు లెక్చరర్స్ భవిష్యత్తులో వచ్చే క్యాంపుకు ఆసక్తి చూపుతున్నారు. ఉన్న 10 రోజులలో అందరు విద్యార్థులు హాజరయ్యే విధంగా ప్రిన్సిపాల్ కృషి చేయాలి. వేసవి సెలవులలో సమ్మర్ క్యాంపుకు వచ్చిన లెక్చరర్స్‌కు అదనపు వేతనాలు ఇవ్వాలి.

-రాపాక రవీందర్, జనగాం

### దడ పుట్టిస్తున్న సుంకాలు

**అమెరికా** అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు ప్రపంచ దేశాలకు దడ పుట్టిస్తున్నాయి. చిన్న చిన్న కారణాలు చూపి వీసాలు, వగైరా రద్దు చేయడానికి వెనుకాడడం లేదు. వ్యాపారులు, విద్యార్థులు ఉద్యోగులపై ఆంక్షల పంజా విసురుతున్నారు. అక్కడ మనవారి పరిస్థితి గందరగోళంగా ఉంది. ట్రంప్ 2.0 హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో వాణిజ్య యుద్ధానికి తెరతీసింది.

-ఆర్. వెంకటేశ్, బెంగళూరు

### తూకాలలో మోసాలు ఆగేదెలా?

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని కూరగాయల మార్కెట్లు, రోడ్ల వెంబడి అమ్మే కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, చికెన్, మటన్ విక్రయించే షాపులలో తూకంలలో భారీ మోసాలు జరుగుతున్నాయి. దీని వల్ల వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు. ఒక కిలో కూరగాయలు కొన్న ఎనిమిది వందల గ్రాములు వస్తున్నాయి. వారు పెట్టె తూకం బాట్లు కిలో వుండడం లేదు. ఎలెక్ట్రానిక్స్ కాంటాలో కూడా మోసం చేయడం జరుగుతుంది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి వారిమీద చర్యలు తీసుకోవడం లేదు. పండ్ల మార్కెట్‌లో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఇకనయినా తూనికలు కొలతలశాఖ అధికారులు స్పందించి నిఘావేసి పట్టుకుని కేసులు నమోదు చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

### మెరుపుదాడులు న్యాయమే

**భారత్** జరిపిన మెరుపు దాడులు న్యాయమైన డిమాండును ఒకింత న్యాయం చేసినట్టే. ఎందుకంటే 28 మంది పౌరుల ప్రాణాలను పొట్టన పెట్టుకొని పైశాచిక ఆనందం పొందిన ఉగ్రవాదులను చావుదెబ్బ కొట్టినట్టు అయ్యింది. అంత మాత్రమే కాదు ఉగ్రవాద స్థావరాలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి సమాధానము ఇచ్చినట్టు అయ్యింది భారత్ వల్ల పాకిస్థాన్‌లోని ఆర్మీ కానీ సాదారణ పౌరులు కానీ నష్టపోలేదని గుర్తించాలి అంత మాత్రమే కాదు ప్రపంచ దేశాల సమ్మతితో భారత్ ఈ పని చేయడంతో పాకిస్థాన్ ఒంటరిగా మారింది. మొత్తం మీద ఈ దాడులు చేయడం ద్వారా దేశ సార్వభౌమత్వాన్ని సమగ్రతను కాపాడడమే ధ్యేయం

-భారత అవినాష్, జనగామ

### అభివృద్ధికి దూరం చేయడం తగదు

**రాష్ట్రంలో** ఏ ప్రభుత్వం అధికారంలోఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయకక్ష్యలు, కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి. ఆ రాజకీయకక్ష్యలు, కార్పణ్యాలు గత ప్రభుత్వం నాటినచెట్లు, మొక్కలపైకూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన, మన అనేభేదం లేకుండా ప్రభుత్వంపై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి. పని.

-పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం!

**అకాల వర్షం వల్ల కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యం తడిసిపోవడంతో ధాన్యం నాణ్యత తగ్గి నష్టం వాటిల్లుతుంది. కొనుగోలు కేంద్రాలలో నిల్వచేసిన ధాన్యం కూడా వర్షానికి తడిసి ముద్దయిపోయింది. అకాల వర్షం వల్ల రైతులు ఆరుగాలం కష్టం వృథాగా పోతుంది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమ వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. తూకాలకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తల్లాడిపోయారు. ఎప్పుడు వర్షం పడుతుందో ఎప్పుడు ధాన్యం తడుస్తుందో అన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. తేమ శాతం చూడకుండానే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పగటిపూట ఎండ కొడుతూ రాత్రిపూట వర్షం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు.**



డాక్టర్ మోటె చిరంజీవి

ఇటీవల కురిసిన భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగుల్చింది. పలు జిల్లాల్లో పంట నష్టం వాటిల్లగా, రహదారులు, ధాన్యం కేంద్రాల వద్ద అన్నదాతలు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అన్నదాతపై ప్రకృతి పగబట్టింది. గతంలో కొంత వానకు పడిపోగా, గత కొద్ది రోజులుగా కురిస్తున్న వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. అరబెట్టిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు ఉరుకులు పరుగులు పెట్టారు. వరితోపాటు మామిడి, మొక్క జొన్న, ఉద్యానం పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కురిసిన అకాల వర్షాలు, గాలివానతో రైతులకు నష్టం కలిగింది. ధాన్యాలు తడిసి రైతులు మార్కెట్లలో అవస్థలుఎదుర్కొన్నారు. పలు జిల్లాల్లో గత కొన్ని రోజులుగా కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులు రైతులను నట్టేట ముంచాయి. నల్గొండ, ఖమ్మం, జనగామ, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో గాలివానకు పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోయాయి. కల్లాలు, మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల సుమారు రెండు గంటలకు పైగా వీచిన బలమైన గాలులకు జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లు, రైస్ మిల్లుల పైకప్పు రేకులు ఎగిరిపోగా, షెడ్లు, గోడలు కూలిపోయాయి. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లిలో అత్యధికంగా 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో వాతావరణం వేడిగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. భారీ వర్షంతో రోడ్లు మునిగిపోయాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు పడిపోయాయి. జిల్లాలో వైరా కొణిజర్ల, ఏన్కూరు, ముదిగొండ, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లోనూ భారీగా వర్షం కురిసింది.



కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోయింది. వైరాలో చెట్లు నేలకూలాయి. కురిసిన భారీ వర్షానికి ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యమంతా పక్కనే ఉన్న కాలువలోకి కొట్టుకుపోయింది. తూకమేసిన ధాన్యం బస్తాలుసైతం తడిసిపోయాయి. ఉదయం రైతులు కాలువలో నుంచి ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకున్నారు. ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అధికారులు లారీలను ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఎదులాబాద్, మాధారం కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోందని తెలిపారు. కాగా, కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుకురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి, యాదాద్రి, జనగామ, మంచిర్యాల, ఆసిఫాబాద్, నల్గొండ, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. వ్యవసాయ మార్కెట్ యార్డులలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కురిసిన అకాల వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోయాయి. తూకాలకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు అల్లాడిపోయారు. సీసీ కల్లంపై పోసిన రాశుల కిందకు వర్షపు నీరు చేరడంతో ధాన్యం తడిసింది. మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందంటూ వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కోపోద్రిక్తులైన రైతులు మార్కెట్ గేటును మూసివేశారు. దీంతో అధికారులు రైతులను సముదాయించి, వ్యాపారులను పిలిపించి, వారు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. మిగతా గ్రామాల రైతుల ధాన్యం తడిసిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధాన్యం కుప్పలు తడిసిపోవడంతో, రైతులు తమ పంటను కాపాడుకోవడానికి ప్లాస్టిక్ కవర్లు టార్పాలిన్ కవర్లు వంటి వాటిని ఉపయోగించి దానిని కప్పి వర్షం నుంచి కాపాడుతున్నారు. అకాల వర్షం వల్ల కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యం తడిసిపోవడంతో ధాన్యం నాణ్యత తగ్గి నష్టం వాటిల్లుతుంది. కొనుగోలు కేంద్రాలలో నిల్వచేసిన ధాన్యం కూడా వర్షానికి తడిసి ముద్దయిపోయింది. అకాల వర్షం వల్ల రైతులు ఆరుగాలం కష్టం వృథాగా పోతుంది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమ వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. తూకాలకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తల్లాడిపోయారు. ఎప్పుడు వర్షం పడుతుందో ఎప్పుడు ధాన్యం తడుస్తుందో అన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. తేమశాతం చూడకుండానే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పగటిపూట ఎండ కొడుతూ రాత్రిపూట వర్షం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు. ●

# హోదా పెరిగినా ప్రాధాన్యత ఏది?

అంకం నరేష్

ప్రాథమిక విద్యావ్యవస్థలో వారు సీనియర్ ప్రధానోపాధ్యాయులు. కానీ హోదా పెరిగినా వారి ప్రాధాన్యత పెరగడం లేదు. రావలసిన హక్కులు ఇవ్వవలసిన బాధ్యతలు ఇవ్వడం లేదు. సరైన జాబ్ చార్ట్ లేక ఏళ్లగా అన్నింటిలో వివక్ష ఎదుర్కొంటున్నారు. పాఠశాల సముదాయ సమావేశాలను కార్యదర్శి హోదాలో నడిపించాల్సిన పిఎస్ హెచ్‌ఎంలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల పొందవలసిన హోదా పొందడం లేదు. అలాగే ఉన్నత పాఠశాలల్లో బోధించే స్కూల్ అసిస్టెంట్లతో సమాన హోదా కలిగిన పిఎస్ హెచ్‌ఎంలకు పరీక్ష విధులు, ఎన్నికల విధులలో వారితో సమాన హక్కులు దక్కడం లేదు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 5500 మంది వరకు ప్రాథమిక పాఠశాలలో పిఎస్ హెచ్‌ఎంలు పనిచేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వు నెంబర్ 6225 ప్రకారం ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులకు జరిగే పాఠశాల సముదాయ సమావేశంలో కన్వీనర్ అయిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఆ పాఠశాల సముదాయంలో పనిచేస్తున్న సీనియర్ పిఎస్ హెచ్‌ఎంకు కార్యదర్శి హోదా ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు కార్యదర్శి హోదాలో ఎస్‌జిటి ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించాలి. కానీ ఆదేశాలు ఉన్నా కొందరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల కార్యదర్శి హోదాను పొందలేకపోతున్నారు. అలాగే కాంప్లెక్స్ పాఠశాలకు వచ్చే నిధుల ఖర్చు విషయంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పిఎస్ హెచ్‌ఎంతో కలిపి సంయుక్తంగా బ్యాంకు ఖాతా తెరిచి నిధులను ఖర్చుపెట్టాలి. కానీ చాలాచోట్ల అలా జరగడం లేదు. ఇటీవల జరిగిన పిఎస్ హెచ్‌ఎం పదోన్నతులలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలకు కాకుండా మంజూరి పోస్టు ఉండి తక్కువ విద్యార్థులు ఉన్నా కూడా అక్కడ పిఎస్ హెచ్‌ఎం పోస్టులను ఇచ్చారు. దీనివల్ల హోదా పెరిగినా ప్రాధాన్యత పెరగని పరిస్థితి నెలకొంది. అలాగే హేతుబద్ధీకరణ నిబంధనలలో పిఎస్ హెచ్‌ఎం పోస్టులను సీనియర్ ఎస్జీటీగా



పరిగణలోకి తీసుకోవడం వల్ల చాలామంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీలలో తీవ్రంగా నష్టపోతున్నారు. పిఎస్ హెచ్‌ఎం పోస్ట్ అనేది స్కూల్ అసిస్టెంట్స్ పోస్ట్‌తో సమానహోదా కలిగిన పోస్ట్ కానీ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఇతర విధులలో కూడా వివక్ష ఎదుర్కొంటున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక కులసర్వేలో హోదాకు తగిన సూపర్వైజర్ బాధ్యతలు ఇవ్వకుండా ఎన్యుమరేటర్‌గా చాలా జిల్లాల్లో ఎంపిక చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు ఇతర ఎన్నికలలో ఎన్నికల సిబ్బంది ఎంపికలో భాగంగా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు ఇస్తున్న అదే సమాన హోదా కలిగిన పిఎస్ హెచ్‌ఎంలకు ఆ బాధ్యతలు కేటాయించడం లేదు. రేషనలైజేషన్ నిబంధనలో భాగంగా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను వేరుగా లెక్క కట్టినట్లు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను లెక్కకట్టాలి. అలాగే విద్యార్థులతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఒక పిఎస్ హెచ్‌ఎంను ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలలకు సంబం ధించిన బోధన అభ్యసన ప్రక్రియ బోధన పద్ధతులపై ఏళ్ల గా పనిచేస్తున్న పిఎస్ హెచ్‌ఎంలకు అనుభవం ఉంది. కావున ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ పోస్టు అయిన మండలం నోడల్ అధికారి పోస్టును అన్ని అర్హతలు ఉన్న సీనియర్ పిఎస్ హెచ్‌ఎంలకు ఇస్తే క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ పటిష్టమవుతుంది. అలాగే పిఎస్ హెచ్‌ఎంలకు సంబంధించిన జాబు చార్ట్‌ను రూపొందించి వారి బాధ్యతలను విధులను పొందుపరచాలి. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి పిఎస్ హెచ్‌ఎంకు గెజిటెడ్ హోదా ఇవ్వాలి. మొత్తంగా ప్రభుత్వం చిన్నబడుల పెద్ద సార్ల సమస్యలను పరిష్కరించాలి. ఉన్నత పాఠశాలల్లో బోధించే స్కూల్ అసిస్టెంట్లతో సమాన హోదా కలిగిన పిఎస్ హెచ్‌ఎంలకు పరీక్ష విధులు, ఎన్ని కల విధులలో వారితో సమాన హక్కులు కల్పించాలి. పాఠశాల విద్యలో పునాది అయినా ప్రాథమిక విద్య బాగుపడితేనే ఉన్నత విద్య పటిష్టమవుతుంది. ●

# సముద్ర శక్తిగా రాంబిల్లి స్థావరం

యేచన్ చంద్ర శేఖర్

ఆధునిక జలాంతర్గాములు (సబ్ మెరైన్) సాంప్రదాయ అణ్వాయుధాల ద్వారా సముద్రం, భూమిపై దాడి చేయగలవు. యుద్ధ అవసరాలతో పాటు జలాంతర్గాములను, ప్రత్యేకదళాల కార్యకలాపాలు నిఘాకు సైతం ఉపయోగించవచ్చు. ప్రపంచంలోని ఆధునిక నావికాదళాలు జలాంతర్గాములను ప్రధానంగా ప్రాదేశిక జలాల్లో శత్రు మూకలను నిరోధించేందుకు ఉపయోగిస్తాయి. గ్లోబల్ ఫైర్‌పవర్ ర్యాంకింగ్స్ ప్రకారం ప్రపంచంలో శక్తివంతమైన జలాంతర్గాములు గల దేశాల జాబితాలో వరుసగా అమెరికా, రష్యా, చైనా, ఇరాన్, జపాన్, దక్షిణ కొరియా భారత్ ఏడవ స్థానంలో ఉంది. సెప్టెంబర్ 2024నాటికి ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, చైనా భారతదేశం మాత్రమే అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్నాయి. అయితే హిందూ మహాసముద్రంలో విస్తరిస్తున్న చైనా ప్రభావాన్ని ఎదుర్కోవాలనే ఉద్దేశంతో భారతదేశం ఒక కొత్త అత్యాధునిక నావికా స్థావరాన్ని ఆవిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని రాంబిల్లి గ్రామాన్ని ఎంచుకుంది. ఈ స్థావరం, భారతదేశ యుద్ధనౌకలు అణుశక్తితో నడిచే జలాంతర్గాములకు కేంద్రంగా పనిచేస్తుంది. దక్షిణాసియా భద్రతా వ్యవహారాల అంశాల నిపుణులు, కింగ్స్ కాలేజ్ లండన్‌లో సీనియర్ అంతర్జాతీయ సంబంధాల లెక్చరర్ వాల్టర్ లాడ్విగ్ ప్రకారం, కొత్త ఐఎన్ఎస్ అరిధమాన్‌తో సహా భారతదేశ అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాముల సముదాయానికి ఈ కేంద్రం మద్దతు ఇస్తుంది. "ప్రాజెక్ట్ వర్ష" కింద రాంబిల్లి స్థావరం మొదటి దశ దాదాపు పూర్తయింది. 2026లో ప్రారంభించబడిన తర్వాత, దీనిని ప్రాజెక్ట్ సీబర్డ్ కింద కార్వార్ స్థావరంలో జరుగుతున్నట్లుగా దశలవారీగా విస్తరించే అవకాశం ఉంది. ఇది భారత నావికాదళం సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు అణు జలాంతర్గాముల కార్యాచరణ గోప్యతను నిర్ధారిస్తుంది. ఈ సంవత్సరాంతంలో రాంబిల్లి వద్దఏర్పడబోయే ఈ స్థావరంలో అణుశక్తితో నడిచే మూడవ జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ అరిధమాన్‌ను ప్రవేశపెట్టనుంది. 7,000టన్నుల బరువుతో అణు బాలిస్టిక్ క్షిపణులతో అమర్చబడిన ఈ నౌక గతంలో ప్రవేశపెట్టబడిన ఈ శ్రేణికి చెందిన ఐఎన్ఎస్ అరిహంత్ ఐఎన్ఎస్ అరిఘాత్ కంటే పెద్దది. ఈ అణు జలాంతర్గాములు ప్రస్తుతం సముద్రంలో భారతదేశం అణు నిరోధక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. హిందూ మహాసముద్రం విస్తృత ఇండోపసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం భారత్‌చైనాల మధ్య పెరుగుతున్న పోటీ నేపథ్యంలో ఇది అత్యంత కీలకమైన పరిణామం. ఇప్పటి వరకు, ప్రపంచంలో కేవలం రష్యా, చైనాలు మాత్రమే స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. భారతదేశం విశాఖపట్నంలోని తూర్పు నేవల్ కమాండ్ నుండి 50 కిమీ (31 మైళ్లు) దూరంలో వ్యూహాత్మకంగా నిర్మిస్తున్న రాంబిల్లి స్థావరంలో ఏకంగా 12 జలాంతర్గాములను, ప్రత్యేకించి అణు జలాంతర్గాములను లంగరు వేసుకోవచ్చు. చైనా హైనాన్ ద్వీపంలో గల అణు జలాంతర్గామి స్థావరం లాగానే రాంబిల్లిలో కూడా సముద్రపు నీటిలోతు ఎక్కువగా ఉండడంతో జలాంతర్గాములు ఉపగ్రహాల నిఘా పరిధిలోకి వచ్చే



అవకాశాలు ఉండకపోవడమే కాకుండా సునాయాసంగా సంచరించగలవు. జలాంతర్గాములు సముద్రంలోని సొరంగ మార్గాల ద్వారా హబ్‌కు చేరుకునేలా నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లకుపైగా పట్టింది. 2004లో ప్రారంభించబడిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసల్ (ఏటీవీ) ప్రాజెక్టులో భాగంగా స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్స్ (ఎస్ఎస్బిఎన్) పేరుతో నాలుగు అణుజలాంతర్గాముల నిర్మాణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసల్ (ఏటీవీ) ప్రాజెక్టును 2004లో ప్రారంభించారు. రష్యా సహకారంతో మొట్టమొదట ప్రారంభమైన ఐఎన్ఎస్ అరిహంత్‌ను అనేక ట్రయల్స్ అనంతరం ఆగస్టు 2016లో నేవీకి అప్పగించారు. రెండవ జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను 2024 ఆగస్టు 29న రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. వీటిని అరిహంత్ క్లాస్ అణు జలాంతర్గాములుగా పరిగణిస్తారు. ఈ ప్రాజెక్ట్‌లో వస్తున్న మూడో అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిధమాన్ గతేడాది అక్టోబరులోనే ట్రయల్స్‌కు వెళ్లింది. దీన్ని త్వరలోనే కమిషనింగ్ చేసినేవీకి అప్పగించనున్నారు. 7వేల టన్నుల సామర్థ్యంతో 3,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల ఈ అణు జలాంతర్గామి మరిన్ని కే4 క్షిపణులను మోసుకెళ్తుంది. రాంబిల్లిలోని "ప్రాజెక్ట్ వర్ష తూర్పు తీరంలో పహారా కాస్తుంది. కార్వార్ నౌకాదళ స్థావరంలో పలు మౌలిక ప్రాజెక్టుల ప్రారంభంతో 32నౌకలు, జలాంతర్గాములతోపాటు మరికొన్ని నౌకలు అందుబాటులోకి రానున్నాయి. అత్యధిక కాలంపాటు నీటి అడుగున ఉండేందుకు, ఖండాంతర క్షిపణులను గుట్టుగా మోసుకెళ్లేందుకు అణు జలాంతర్గాములకు లోతైన సముద్ర జలాలు అత్యంత అనువైన ప్రాంతం. అంతేకాదు రూ.90 వేల కోట్ల వ్యయంతో రహస్యంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్ (ఏటివి) ప్రాజెక్ట్‌లో భాగంగా నాల్గవ ఎస్ఎస్బీఎన్ ఇప్పటికే నిర్మాణంలో ఉంది. ఇదిదాదాపు రెట్టింపు సామర్థ్యం అనగా 13,500టన్నులతో ప్రస్తుత 83 మెగావాట్ల డిజైన్ కన్నా మరింత అధునాతనమైన 190 మెగావాట్ల ప్రెషరైజ్డ్ లైట్‌వాటర్ సాంకేతికతతో అందుబాటులోకి రానుంది. ఇవే కాకుండా సంప్రదాయ యుద్ధాలకోసం రూపొందించిన ఆరు అణుశక్తితో నడిచే దాడి జలాంతర్గాముల (ఎస్ఎస్ఎన్)కోసం గత సంవత్సరం అక్టోబర్‌లో, భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ రూ.40 వేల కోట్ల బడ్జెట్‌తో దాదాపు 9,800 టన్నుల బరువున్న మొదటి రెండు జలాంతర్గాముల నిర్మాణానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. రాంబిల్లి భారతదేశ తూర్పు పార్శ్వాన్ని సురక్షితం చేసే బాధ్యతను చేపడుతుండగా, పశ్చిమ తీరాన్ని కూడా ఏమాత్రం విస్మరించడంలేదు. భారత ప్రభుత్వం ఇటీవల కార్వార్‌లో ప్రాజెక్ట్ సీబర్డ్ కింద రూ.2 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో కొత్త కార్యాచరణ, మరమ్మత్తు లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను ప్రారంభించింది. ఈ నవీకరణ పనులు పాకిస్థాన్ దుందుడుకు చర్యలను ధీటుగా తిప్పికొట్టేందుకు భారత నావికాదళానికి కీలకమైన వ్యూహాత్మక మద్దతును అందిస్తాయి. ప్రాజెక్ట్ ఎస్4గా పిలవబడే నాల్గవ అణు జలాంతర్గామి కూడా ప్రస్తుతం ట్రయల్స్‌లో ఉంది. ఇది ప్రాజెక్ట్ సీబర్డ్"లో భాగంగా కర్ణాటకలోని కార్వార్ స్థావరం పశ్చిమ తీరాన్ని కాపాడుతోంది. "ప్రాజెక్ట్ సీబర్డ్"దశఐఐఏ కార్వార్లో 32యుద్ధనౌకలను మోహరించేందుకు వీలు కల్పిస్తుంది. లోపలి నౌకాశ్రయం ఇప్పటికే సిద్ధం కాగా అవసరమైన బ్రేక్ వాటర్స్ జెట్టీలతో బాహ్యానౌకాశ్రయం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దశ ఐఐబి పూర్త యిన తర్వాత, 25 కి.మీ. పొడవైన స్థావరం 50 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు 40 సహాయక నౌకలను మోహ రించేందుకు అనువుగాఉంటుంది. భారతదేశ ప్రాదేశిక జలాల పరిరక్షణలో భాగంగా వ్యూహాత్మక నిరోధకతను స్థాపించడంలో భారత నావికాదళం పాత్ర ఎంతో కీలకమైనది. ముఖ్యంగా హిందూ మహా సముద్రప్రాంతంలో చైనా ప్రభావంపెరు గుతున్న సందర్భంలో, సంభావ్య ప్రత్యర్థులను అరికట్టడాని కి, నావికాశక్తిని ప్రదర్శించాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ విమాన వాహకాలు జలాంతర్గాములు వంటి అధునాతన నావికాదళ ఆస్తుల అభివృద్ధితో, పటిష్టమైన సముద్ర శక్తిగా మారడానికి రాంబిల్లి స్థావరం ఒక గొప్ప మైలురాయి. ●

# ఉగ్రస్థావరాలను మట్టుబెట్టాం




## క్షిపణి వ్యవస్థలను ధ్వంసంచేసాం

### అఖిలపక్ష సమావేశంలో నాయకులకు వివరించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ, మే 8:** పాకిస్తాన్‌లో ఉగ్ర స్థావరాలను ధ్వంసంచేసిన తర్వాత లాహోర్‌లోని క్షిపణి డిఫెన్స్ వ్యవస్థను సైతం ధ్వంసం చేసిన భారత రక్షణరంగ కార్యాచరణను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష సమావేశంలో విపక్షాలకు వివరించారు. గురువారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అధ్యతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీల నాయకులకు ఆపరేషన్ సింధూర్ వివరాలను వెల్లడించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై జరిగిన దాడులు, పివోకేలో జరిగిన దాడుల వివరాలను వివరించారు. సమావేశంలోనే 100 మందికిపైగా ఉగ్రవాదులను హతమార్చినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని, పాకిస్థాన్ మళ్లీ దాడులకు పూనుకుంటూ భారత్ పరంగా ఈసారి మరింత తీవ్రంగా ఉంటుందని వెల్లడించారు. పాకిస్థాన్ ముందురోజు సరిహద్దులవెంబడి చేసినకాల్పుల్లో అమాయకులైన 16 మంది చనిపోయారని కూడా రాజ్‌నాథ్ వివరించారు. దీనితో లాహోర్‌లో ఉన్న క్షిపణి వ్యవస్థల నిల్వకేంద్రాన్ని ధ్వంసంచేసామని వివరించారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌పై జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయ సాధనకోసమే ఈసమావేశం నిర్వహించామని, పార్టీల నాయకులందరూ కూడా ఒకే మాటపై ఉన్నారని వివరించారు. అంతేకాకుండా దేశపౌరుల రక్షణ, భద్రతపైనా కొందరునేతలు ఆందోళన వ్యక్తంచేసారని, ప్రత్యేకించి సరిహద్దుల్లో ఉన్న ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెపుతూనే జాతిమొత్తం ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని, ఉగ్రవాదంపై పోరులో దేశం మొత్తం సమైక్యంగా నిలుస్తుందని చెప్పారని కేంద్ర మంత్రి వివరించారు. కేవలం ప్రభుత్వాల ఏర్పాటుకోసం మేం రాజకీయాలు చేయబోమని జాతినిర్మాణంకోసం కృషిచేస్తామని చెప్పారు. ఇదొక కొనసాగుతున్న కార్యాచరణ అని అందువల్ల సాంకేతిక వివరాలను అందించలేమని ఆపరేషన్ సింధూర్ ఇకపైనా కొనసాగుతుందని అన్నారు. సైనిక కార్యాచరణలో ఉన్నందువల్లనే సాయుధ దళాల అధికారులు ఈసమావేశంలో పాల్గొనలేకపోయారని మంత్రి వివరణ ఇచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గేలు సమావేశం తర్వాత మాట్లాడుతూ ప్రభుత్వానికి ఉగ్రవాద నిర్మూలన కార్యాచరణలో సంపూర్ణ మద్దతునిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు నిస్తున్నామని కొన్ని అంశాలను లేవనెత్తాలని భావించినా ఇది సందర్భం కాదని వాటిజోలికి వెళ్లలేదన్నారు. మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేయడంలో సాయుధదళాలు విశేష కృషిచేసాయని ప్రశంసించారు. టిఆర్‌ఎఫ్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోకూడా టిఆర్‌ఎఫ్‌ను నిషేధిత సంస్థగా ప్రకటించాలని డిమాండ్‌చేయాలని సూచించారు. అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, జైశంకర్,జెపినడ్డా, నిర్మలా సీతారామన్‌లు ప్రభుత్వం తరపున హాజరయ్యారు. కాంగ్రెస్‌నుంచి రాహుల్‌గాంధీ, ఖర్గే, టిఎంసి నుంచి సందీప్ బందోపాధ్యాయ్, డిఎంకెనుంచి టిఆర్‌బాలు వంటిప్రముఖులు పాల్గొన్నారు. ఇతరత్రా సమాజ్‌వాదిపార్టీనుంచి రామ్‌గోపాల్ యాదవ్, ఆప్‌నుంచి సంజయ్‌సింగ్; శివసేన థాకరేనుంచి సంజయ్‌రౌత్, ఎన్సీపీ పవార్ విభాగంనుంచి సుప్రియా సూలే, బిజెడినుంచి సస్మిత్‌పాత్రా, సిపిఎంనుంచి జాన్ బ్రిట్టాస్‌లు పాల్గొన్నారు. అలాగే జెడియు నుంచి సంజయ్ ఝా, కేంద్ర మంత్రి ఎల్జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్‌లు కూడా వచ్చారు.



## లాహోర్ పరిసరాల్లో భారత్ క్షిపణి దాడి

### భీతిల్లి పరుగులు తీసిన పాక్ ప్రజలు

**న్యూఢిల్లీ, మే 8:** సరిహద్దుల్లో ఉద్రిక్తతలను రెచ్చగొడుతూ కాల్పులకు తెగబడుతున్న పాకిస్తాన్‌కు భారత్ రక్షణ దళాలు గట్టిగానే బుద్ధిచెప్పాయి. లాహోర్‌లోని క్షిపణి వ్యవస్థల కేంద్రాన్ని ధ్వంసంచేసి సత్తాచూపించాయి. జమ్ముకాశ్మీర్, పంజాబ్, గుజరాత్‌లలో దాడులకు ఉపక్రమించేందుకు పాకిస్తాన్ కుట్రలుచేస్తున్నట్లు సమాచారం పసిగట్టిన కేంద్రం ఉత్తర భారత్‌లోని 15 నగరాలు, దేశంలోని పశ్చిమ ప్రాంత నగరాల్లోను దాడులకు పన్నాగం చేస్తున్నట్లు తెలియడంతో వెంటనే అప్రమత్తం అయింది. పాకిస్తానీ ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, క్షిపణి వ్యవస్థలే లక్ష్యంగా దాడులుచేసింది. లాహోర్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లోని పాక్ రక్షణ వ్యవస్థలు టార్గెట్‌గా ధ్వంసంచేసింది. భారత్‌లో కీలకంగా ఉన్న శ్రీనగర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, లూథియానా, చండీఘర్ ఇతర ప్రాంతాల్లో పాకిస్థాన్ దాడులుచేయడంతో భారత్ ప్రతిగా లాహోర్ పరిసరాల్లో దాడులుచేసింది. అదే స్థాయిలో, అదే తీవ్రతతో భారత రక్షణ దళాలు దాడులుచేసినట్లు భారత ఆర్మీ ప్రకటించింది. భారత్ ఇజ్రాయిల్ సహకారంతో తయారయిన హార్పీడ్రోన్లను పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు వినియోగించింది.

భారత్‌లోని రావల్పిండి క్రికెట్ స్టేడియంపైనా దాడిచేయడంతో మ్యాచ్‌ను కరాచికి మార్చివేసారు. అలాగే భారత నగరా లను టార్గెట్ చేసిన పాక్ ఎయిర్‌డిఫెన్స్‌లను ధ్వంసంచేసేందుకు రష్యా తయారీ ఎస్ 400 క్షిపణి వ్యవస్థలను వినియోగించింది. భారత క్షిపణి వ్యవస్థలను పాకిస్థాన్ రాడార్లు గుర్తించలేకపోయాయి. పెషావర్ జల్మి, కరాచికింగ్స్‌మధ్య జరిగే మ్యాచ్‌ను అత్యవసరంగా మారిన దీనితో ఇపుడు పాకిస్థాన్‌లోని కీలక నగరాల్లో ప్రజలు భయపడిపోతున్నారు. రావల్పిండి క్రికెట్ స్టేడియంలో క్షిపణి దాడి జరగడంతో పిసిబి నిర్వహిస్తున్న మ్యాచ్‌ను కరాచి స్టేడియంకు మార్చివేసారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌లో వణుకు బయలుదేరింది.

## నిఘా వ్యవస్థ పటిష్టతకు ఇస్రో 52 ఉపగ్రహాలు

**న్యూఢిల్లీ, మే 8:** నిఘా సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే వచ్చే ఐదేళ్లలో ఇస్రో 52 నిఘా ఉపగ్రహాలను భూకక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్, ఆథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్) ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా పేర్కొన్నారు. ఢిల్లీలో బుధవారం జరిగిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ 2025 కార్యక్రమంలో ఈ మేరకు వెల్లడించారు. అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థ విషయంలో భారత్ ఇప్పటికే బలమైన సామర్థ్యాలు కలిగి ఉంది. అయితే దానిని నిరంతరం మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే రక్షణ రంగం నిఘా సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు రానున్న ఐదేళ్లలో 52 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రైవేటు రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తాం. భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టే 52 ఉపగ్రహాల్లో సగం ప్రైవేటు రంగం ద్వారా సమకూర్చుతుంది అని పవన్ కుమార్ తెలిపారు.

మిగిలిన ఉపగ్రహాలను ఇస్రో నిర్మిస్తుంది. ఈ ఉపగ్రహాలు శత్రువుల కదలికలను పసిగట్టేందుకు, సరిహద్దులను పర్యవేక్షించేందుకు, సైనిక కార్యకలాపాల సమయంలో సమన్వయాన్ని మెరుగుపర్చేందుకు త్రివిధ దళాలకు సాయపడతాయి. అయితే ఈ నిఘా సామర్థ్యాల పెంపు నిర్ణయాలు కేంద్ర హోంశాఖ, రక్షణశాఖ చేతుల్లోనే ఉంటాయి అని పవన్ కుమార్ గోయెంకా పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ఈ సామర్థ్యాలు అవసరం మరోవైపు, ఇస్రో తన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్‌ఎస్‌ఎల్‌వీ) సాంకేతికతను ప్రైవేటు రంగానికి బదిలీ చేసే ప్రక్రియలో ఉందని పవన్ కుమార్ గోయెంకా ఉన్నారు. అదే తక్కువ సమయంలో భూ దిగువ కక్ష్యలోకి చిన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ఎస్ఎస్ఎల్‌విని అభివృద్ధి చేశారు.

ఇవి 10 కిలోల నుంచి 500 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కి.మీ వరకు కక్ష్యకి ప్రవేశపెట్టగలవు. అత్యవసర సమయాల్లో రక్షణ బలగాలకు ఈ సామర్థ్యం అవసరం అవుతుంది. ఎస్ఎస్ఎల్‌వీ సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి సమయం ఆసన్నమైందని, మరికొద్ది రోజుల్లోనే దీనిపై కూడా ప్రకటన వెలువడే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్‌కు గంగా హారతి



**రిషికేశ్, మే 8:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌పై భారత ఆర్మీ మెరుపు దాడులు జరపడంపై యావత్ దేశం గర్వంతో ఉప్పొంగిపోతోంది. దేశ సైనికుల ధైర్యసాహసాలు, సేవలను కొనియాడుతోంది. అయితే రిషికేశ్‌లోని అధ్యాత్మిక కేంద్రం పరమార్థ్ నికేతన్ బుధవారం సాయంత్రం గంగా హారతిని 'ఆపరేషన్ సిందూర్'కు అంకితం చేసింది. రిషికేశ్‌లోని పరమార్థ్ నికేతన్‌లో జరిగిన గంగా హారతిని భారత దేశ దృఢ సంకల్పం, అసాధారణ సైనిక పరాక్రమం, వ్యూహాత్మక ధైర్యానికి అంకితం చేశారు. అలాగే భారత త్రివర్ణ పతాకాల ముందు దీపం వెలిగించి ఆపరేషన్ సిందూర్‌కు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో పరమార్థ్ నికేతన్ అధినేత స్వామి చిదానంద సరస్వతి, దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఈ గంగా హారతి భారత సైన్యం తీసుకున్న చారిత్రాక అడుగుకు అంకితమని పరమార్థ్ నికేతన్ అధినేత స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. దేశ సంకల్పం, బలం, తేజస్సుకు ఈ హారతి ఒక శ్లోకం లాంటిదని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదు, దేశ గుర్తింపు, సార్వభౌమాధికారం, ఆత్మగౌరవానికి చిహ్నంగా అభివర్ణించారు. భారతదేశ శాంతిని దాని బలహీనతగా భావించే శక్తులకు ఇదొక సందేశం. శత్రువు మన సహనాన్ని పరీక్షించకూడదు. భారత్ శాంతిని కోరుకుంటోంది. మాకు చర్చలు కావాలి. ఉగ్రవాదం కాదు. మన సహనాన్ని పరీక్షించినప్పుడల్లా, భారతదేశం అదే ఉత్సాహంతో స్పందిస్తుంది. ఆపరేషన్ సిందూర్ అనేది భారతసైన్యం తాలుక సాహసోపేతమైన ప్రతీకారం. పహల్గాంలో భారతీయులపై జరిగిన దాడి భారతదేశ ఆత్మపై జరిగిన దాడి. అది భారతమాత గుండెపై జరిగిన పాశవిక దాడి. పాక్ చేసిన దుశ్చర్యకు మన సైనికులు ప్రతీకారం తీర్చుకున్నారు. అందుకు గర్విస్తున్నాం. ఈ దాడి కేవలం ఆరంభం మాత్రమే. భారత్ ఎప్పుడూ ఎవరీ జోలికి పోదు. కానీ తమ జోలికొస్తే వదిలిపెట్టదు.

ఈ ఆపరేషన్ మన ధైర్య సైనికుల పరాక్రమం, వ్యూహం, దృఢ సంకల్పానికి నిదర్శనం అని స్వామి చిదానంద తెలిపారు. గంగా హారతి దృశ్యాలు దేశ రక్షణ కోసం యుద్ధం చేయాల్సి వస్తే అది కూడా ఒక తపస్సు లాంటిదేనని మన రుషులు చెప్పారని స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అటువంటి యుద్ధ సాధనలలో ఒకటన్నారు. దీనిలో సమతుల్యత, శాంతి రెండూ ఉన్నాయని కొనియాడారు. భారతదేశం ఏ నేలపైనా యుద్ధాన్ని లేదా హక్కులను కోరుకోదని, కానీ తమ సార్వభౌమాధికారంపై దాడి జరిగితే కచ్చితంగా ప్రతిస్పందిస్తుందని పేర్కొన్నారు. భారత్ ఆత్మరక్షణకే ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. దేశ సంస్కృతి వసుధైక కుటుంబం లాంటిదని, కానీ భారత్ తన కుటుంబం కాపాడుకోవడానికి ఎంతవరకైనా వెళ్లగలదన్నారు

## పంజాబ్ సరిహద్దు గ్రామాల్లో క్షిపణి శబ్దాలు



### పొలాల్లోను,ఇళ్లల్లోను పడినట్లు గ్రామస్తుల వెల్లడి

**చండీఘర్, మే 8:** సిలిండర్ ఆకారంలో ఉన్న క్షిపణులు అర్ధరాత్రి 1.30 గంటలకు పంజాబ్‌ప్రాంతంలో పడటంతో ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు. అమృత్‌సర్ బటాలా ప్రాంతంలోని జేతువాల్‌గ్రామంలో క్షిపణి ఆకారంలో ఉన్న డొల్ల సిలిండర్‌లను గుర్తించారు. పాకిస్థాన్‌తో సరిహద్దును పంచుకుంటుండటంతో పంజాబ్‌ను కేంద్రం హై అలర్ట్ రాష్ట్రంగా కేంద్రం ప్రకటించింది. పాకిస్థాన్, పీవోకేల్లోని ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసిన తర్వాత తాజాగా లాహోర్‌లోని క్షిపణి వ్యవస్థ కేంద్రాన్ని కూడా ధ్వంసం చేయడంతో ఇపుడు పాక్ ఫోకస్ మొత్తం సరిహద్దు వెంబడి ఉన్న పంజాబ్, రాజస్థాన్, జమ్ముకాశ్మీర్‌లపైనే ఉన్నట్లు తెలుస్తోంది. క్షిపణితరహాలో ఉన్న ఈ సిలిండర్లు జేతువాల్‌గ్రామంలో కొన్ని చోట్ల పడి ఉన్నాయని గ్రామస్తులు ఫిర్యాదులుచేసారు. రాత్రి 1.30 గంటలు దాటిన తర్వాత ఈ పరికరాలు కనిపించాయని, అయితే ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని వారు తెలిపారు. బల్‌దేవ్‌సింగ్, మఖాన్‌సింగ్ వ్యవసాయ పొలాల్లో పడి ఉన్నాయని, అయితే ఇప్పటివరకూ ఎలాంటి పేలుళ్లు సంభవించలేదని అధికారులు తెలిపారు. అయితే పోలీసులు, ఫోరెన్సిక్ విభాగం నిపుణులు ఈ క్షిపణి తరహా సిలిండర్లను పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్మీ అధికారులకు కూడా వీటిపై సమాచారం ఇచ్చినట్లు సీనియర్‌పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. రాత్రి 1.30 గంటల ప్రాంతంలో అమృత్‌సర్ వాసులకు వరుసవెంబడి కాల్పులశబ్దాలు వినిపించాయని చెప్పారు. రాత్రి.1.30 గంటల తర్వాత మూడు పేలుళ్లుజరిగాయని, పవిత్రనగరంలో ఈశబ్దాలతో ప్రజలు భయపడిపోయినట్లు అధికారులుతెలిపారు. అయితే జిల్లా యంత్రాంగం ఎలాంటి ఆందోళన వద్దని, భయం వలదని వెంటనే అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించింది. ఘగ్‌వాల్ గ్రామంనుంచి తెల్లటి సిలిండర్ ఆకారంలో ఉన్న క్షిపణిని స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. అశోక్‌కుమార్ అనే ఇంటియజమాని ఆవరణలో పడి ఉన్నట్లు గుర్తించారు.

పేలుడు శబ్దంకూడా భారీగా వినిపించిందని, గ్రామస్తులంతా లేచి సోదాలు చేసారన్నారు. సమాచారం రావడంతో వెంటనే ఈ సిలిండర్ ఆకారంలో ఉన్న క్షిపణిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పుకార్లు, విషప్రచారాలను నమ్మవద్దంటూ ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు ప్రజలను చైతన్యపరుస్తున్నారు. బిఎస్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు మొత్తం సరిహద్దురక్షణలో ఉన్నారని, ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురయినా తక్షణ చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రజలకు భరోసా ఇచ్చారు. నేషనల్ హెల్‌మిషన్ డైరెక్టర్ ఈ సందర్భంగా రాష్ట్రంలోని అందరు వైద్య అధికారులకు శెలవులు రద్దుచేసారు. అత్యవసరవిధులకు సైతం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీచేసారు. పంజాబ్‌లోని ఆరు సరిహద్దుజిల్లాలు ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్; ఫాజిల్కా, అమృత్‌షర్, గురుదాస్‌పూర్, తరన్‌తరన్‌జిల్లాల్లోని అన్ని స్కూళ్లను మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



## భారత్‌పై ప్రతీకార దాడులకు పాక్ సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

### -ప్రధాని షెహబాజ్ షరీఫ్

**ఇస్లామాబాద్, మే 8:** భారత సైనిక దాడులకు స్పందనగా తమ దేశ సాయుధదళాలు ప్రతీకార దాడులుచేసే అధికారం ఉందని పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి ప్రకటించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన జాతీయ భద్రతా మండలి సమావేశంలో ఈనిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో పాక్ మంత్రులు, వివిధరాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని సర్వీసుల అధిపతులు సీనియర్ అధికారులు హాజరయ్యారు. భారత్‌నుంచి వస్తున్న దాడులను ప్రతిఘటించేందుకు త్రివిధ దళాలకు రక్షణ వ్యవస్థలకు పూర్తిస్వేచ్ఛఇస్తూ ప్రతిఘటించే అధికారం వారికి ఉందని ఎన్ఎస్‌ఎ వెల్లడించింది. భారత్ దాడులకు ధీటుగా ప్రతిఘటించేందుకు మూడు దళాలకు పూర్తి అధికారాలను కల్పిస్తున్నట్లు ఎన్ఎస్‌ఎ వెల్లడించింది.

## పాక్ మిలిటరీ వాహనంపై బలూచ్ లిబరేషన్ బాంబు దాడి

### 14 మంది సైనికుల మృతి

**ఇస్లామాబాద్, మే 8:** బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ) వరుస దాడులతో పాకిస్థాన్ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పాక్ సైనిక వాహనంపై బిఎల్‌ఎ దాడి చేసింది. ఐఇడి బాంబులతో పాకిస్థాన్ ఆర్మీ వాహనాన్ని పేల్చివేసింది. మాచ్‌కుండ్ ప్రాంతంలో బిఎల్‌ఎ దళాలు ఐఇడి పేల్చాయి. ఈ దాడిలో 14 మంది పాక్ సైనికులు మృతి చెందారు. బలూచిస్థాన్‌లోని బిలాన్ పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు దాడుల్లో 14 మంది పాక్ ఆర్మీ హతమయ్యారు. బిలాన్‌లోని మాచ్‌లోని షోర్కాండ్ ప్రాంతంలో పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై బిఎల్‌ఎ రిమోట్ కంట్రోల్ ఐఇడి దాడి చేసింది.

ఈ దాడిలో 12 మంది సైనికులు మరణించారు. మరణించిన సైనికుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ తారిక్ ఇమ్రాన్, సుబేదార్ ఉమర్ షరూక్ ఉన్నారు. ఈ పేలుడు ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఇక మరోచోట బిఎల్‌ఎ నిర్వహించిన రెండో దాడిలో ఇద్దరు పాక్ జవాన్లు మృతి చెందారు. కచ్‌లోని కులాగ్ టిగ్రామ్ ప్రాంతంలో పాక్ సైనికులను లక్ష్యంగా చేసుకుని ఐఇడి పేలుడు బాంబులు అమర్చి ఇద్దరు సైనికులను హతమార్చారు. ఈ రెండు దాడులు తామే చేశామని బిఎల్‌ఎ ఓ ప్రకటనను కూడా విడుదల చేసింది. అంతేకాకుండా పాక్ ఆర్మీపై బిఎల్‌ఎ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్ ఆర్మీనికి కిరాయి ముఠాగా ఆ ప్రకటనలో తెలిపింది.

కాగా.. రెండు రోజుల క్రితం కూడా బలూచిస్థాన్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు ఆర్మీ ప్రాణాలు కోల్పోయారు. కచ్చి జిల్లాలోని మాచ్ ప్రాంతంలో పాక్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఐఇడితో పేల్చేశారు. ఈ పేలుళ్లలో ఏడుగురు పాక్ సైన్యం మృతి చెందారు. అయితే ఈ దాడికి పాల్పడింది బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఉగ్రవాదులుగా పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది.

మరోవైపు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో వరుస పేలుళ్లు జరిగాయి. లాహోర్ వాల్టన్ రోడ్‌లోని సైనిక విమానాశ్రయం వెలుపల మూడు పేలుళ్లు సంభవించాయి. పేలుళ్లను పాక్ అధికారులు ధ్రువీకరించారు. అయితే పేలుళ్ల నష్టంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ పేలుళ్లలతో మందస్తు చర్యల్లో భాగంగా లాహోర్ ఎయిర్‌పోర్టును మూసివేశారు. ఒక్కసారిగా పేలుళ్లు సంభవించడంతో జనం భయంతో అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు.



## జస్టిస్ ఎన్వీ రమణ ప్రజల న్యాయమూర్తి

### జస్టిస్ గవాయి ప్రశంసలు

**న్యూఢిల్లీ, మే 8:** భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను కాబోయే సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ 'ప్రజల ప్రధాన న్యాయమూర్తి'గా అభివర్ణించారు. సామాన్యులకు న్యాయాన్ని చేరువ చేయడంలో జస్టిస్ రమణ దార్శనికతను, ఆయన చేసిన విశేష కృషిని జస్టిస్ గవాయ్ కొనియాడారు. జస్టిస్ ఎన్వీ రమణ వివిధ సందర్భాల్లో చేసిన ప్రసంగాల సంకలనమైన నెరేటివ్స్ ఆఫ్ ద బెంచ్ ఏ జడ్జ్ స్పీక్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం న్యూఢిల్లీలోని ఢిల్లీ హైకోర్టు ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.న్యాయమూర్తులు సాధారణంగా ప్రజలతో మమేకం కారని, ఒంటరిగా ఉంటారనే అపోహను జస్టిస్ రమణ ఛేదించారని జస్టిస్ గవాయ్ అన్నారు. 'ప్రజల వద్దకు వెళ్లాలని, వారితో మమేకం కావాలని విశ్వసించిన వ్యక్తి జస్టిస్ రమణ. ఆయన నిజంగా ప్రజల భారత ప్రధాన న్యాయమూర్తి అని నేను భావిస్తున్నాను. బహుశా న్యాయమూర్తులు ప్రజల నుంచి వేరుగా ఉంటారన్న అడ్డుగోడను తొలగించిన తొలి సిజెఐలలో ఆయన ఒకరు' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

మే 13న ప్రస్తుత సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ అనంతరం, మే 14న సిజెఐగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ గవాయ్, తనకు, జస్టిస్ రమణకు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు మధ్య మూడు ఉమ్మడి అంశాలు ఉన్నాయని తెలిపారు. మేమ్ముగ్గురం గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చాం. ముగ్గురం వ్యవసాయ కుటుంబాలకు చెందిన వాళ్లం. అలాగే, మేమంతా తొలితరం న్యాయవాదులం అని ఆయనవివరించారు. 2021లో జస్టిస్ రమణ సిజెఐగా ఉన్న సమయంలో ఒకేసారి తొమ్మిది మంది న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ప్రమాణ స్వీకారం చేయడం చరిత్రాత్మక ఘట్టమని గుర్తుచేశారు. ఆ రోజు ప్రమాణం చేసిన వారిలో ఒకరైన జస్టిస్ బివి నాగరత్న, భవిష్యత్తులో భారత తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఈ లక్షణాలన్నీ ఆయన తీర్పుల్లోనూ, ఈ పుస్తక రూపంలో మనముందున్న ప్రసంగాల్లోనూ ప్రతిఫలిస్తాయి అని జస్టిస్ గవాయ్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్ కూడా మాట్లాడుతూ జస్టిస్ రమణ నిత్యం సమాజ శ్రేయస్సు గురించే ఆలోచించేవారని కొనియాడారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ రమణను ప్రజా స్నేహితుడుగా అభివర్ణించారు. అనంతరం జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థ కేవలం వివాదాలను పరిష్కరించే సంస్థ మాత్రమేకాదని, అది రాజ్యాంగ నైతికతకు ప్రతీక అని, సామాన్యుడికి మిగిలిన చివరి ఆశాకిరణాల్లో ఒకటని అన్నారు. తాను సిజెఐగా ఉన్న సమయంలో న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, కోర్టు విచారణ ప్రక్రియలో భారతీయ భాషలను భాగం చేయడం, ప్రజలకు నాణ్యమైన న్యాయ సహాయం అందేలా చూడటం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ పుస్తకం న్యాయ సిద్ధాంతాలపై వ్యాఖ్యానం కాదని, విద్యార్థి నాయకుడిగా, కార్మిక సంఘ కార్యకర్తగా, పాత్రికేయుడిగా, న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తాను పొందిన అనుభవాల నుంచి రూపుదిద్దుకున్న ఆలోచనల సమాహారమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

## దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఏడు లక్షల క్రిమినల్ అప్పీళ్లు

**న్యూఢిల్లీ, మే 8:** దేశంలో హైకోర్టు జడ్జీల నియామకాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్‌లోని హై కోర్టుల్లో 7 లక్షల క్రిమినల్ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. ఈ క్రమంలో హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన పేర్లను త్వరగా సిఫారసు చేయాలని కేంద్రాన్ని కోరింది. దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో గరిష్ఠంగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అలహాబాద్ హై కోర్టులో 79 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 11 మందే పనిచేస్తున్నారని స్పష్టం చేసింది. అలాగే 94 మంది ఉండాల్సిన బాంబే హైకోర్టు 66 మంది న్యాయమూర్తులతో పనిచేస్తోందని వెల్లడించింది. కలకత్తా హై కోర్టులో మొత్తం 72 మంది న్యాయమూర్తులు ఉండాలి. అక్కడ 44 మంది న్యాయమూర్తులతో హైకోర్టు పని చేస్తోంది. దిల్లీ హైకోర్టులో ప్రస్తుతం 41 మంది జడ్జీలు ఉన్నారు. అక్కడ సాధారణంగా 60 మంది న్యాయమూర్తులు ఉండాలి. హై కోర్టు న్యాయమూర్తుల కొరత వల్ల క్రిమినల్ అప్పీళ్లు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను అరికట్టాల్సి ఉందని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కొలీజియం సిఫార్సులను త్వరగా క్లియర్ చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కోరింది. హైకోర్టు జడ్జీల నియామకానికి సంబంధించిన పెండింగ్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం త్వరగా క్లియర్ చేస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంది. కాగా, కేంద్ర ప్రభుత్వం వద్ద 2023 నాటి నాలుగు సిఫార్సులు, 2024లో చేసిన 13 సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే చర్యల్లో భాగంగా న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను సుప్రీంకోర్టు ఇటీవలే ప్రకటించింది. న్యాయమూర్తులు స్వయంగా అందజేసిన ఆస్తుల వివరాలను సర్వోన్నత న్యాయస్థానం తన వెబ్ సైట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. వెబ్ సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనే కాకుండా హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియ, హైకోర్టు కొలీజియానికి అప్పగించిన బాధ్యతల వివరాలు సహా ఇతర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

# శ్రీకాళహస్తి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

**శ్రీకాళహస్తిరూరల్,మే 8 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా మండలంలోని ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి, బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఆలయాల్లో ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్న కేశవ స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. ఇక సంప్రదాన్ని కళ్ళకట్టినట్లు మామిడి తోరణాల, అరటి చెట్లను శోభాయమానంగా తీర్చి దిద్దారు. ఊరందూరు గ్రామ పొలిమేరల్లోంచి వెంకటేశ్వరస్వామి విద్యుత్ దీపాలను ముస్తాబు చేసారు. చక్కటి చలువ పందిళ్ళు వాటికి విద్యుత్ దీపాల కాంతితో ముస్తాబు చేసారు. బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో సంప్రదాయ బద్దంగా వేదపండితులు అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి చెందిన పెద్దలు భక్తులు హాజరు కాగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ గావించారు. పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించుటకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి ఆదేశాలతో చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ఏర్పాట్లు చేపట్టారు. అనుబంధ ఆలయాల్లో, గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వహించే ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో చక్కటి ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఊరందూరు గ్రామంలోని ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వహణ బాధ్యతను ఇఓ ఎఇఓ హేమామాలిని, సూపరింటెండెంట్ రవిలకు పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు. గురువారం ధ్వజారోహణం కార్యక్రమాల్లో ఆలయం తరఫున సారెను ఆలయ ఎఇఓ హేమామాలినితో పాటు దుర్గా ప్రసాద్ వారి సహచరులు హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వ హిస్తున్న ఊరందూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఇలా తెలిపారు. గురువారం ధ్వజారోహనం హంసవాహన సేవ ఉంటుందన్నారు. కాగా మే 9న తిరువాచ్చి ఉత్సవం శేష వాహనం ఉంటుందన్నారు.



దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆలయం

10న తిరువాచ్చి ఉత్సవం హనుమంత సేవ, 11న సూర్యప్రభ ఉత్సవం సింహావాహన సేవ, 12న గిన్నెబిక్ష-మోహిని ఉత్సవం గరుడ సేవ, 13న తికెవాచ్చి ఉత్సవం కళ్యాణోత్సవం, గజవాహన సేవ, 14న వసంతోత్సవం, రథోత్సవం, 15న తిరువాచ్చి ఉత్సవం పల్లకి సేవ, 16న పార్వేట ఉత్సవం అశ్వవాహన సేవ, ధ్వజావరోహణం, 17న శాంతి అభిషేకం ఏకాంత సేవ నిర్వహించబడుతుందని వివరించారు.

# ప్రతిపాదనలకే ప్రీపెయిడ్ ట్యాక్సీలు!



**ప్రభాతవార్త ప్రతినిధి - తిరుమల:** ఎన్నోవ్యయప్రయాసలకోర్చి తమ మొక్కులుతీర్చుకునేందుకు ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిచెంతకు వస్తున్న భక్తులను తిరుమలకొండపై ట్యాక్సీడ్రైవర్లు, యాజమాన్యం నిలువుదోపిడీ చేస్తున్నారు. కొంతదూరానికి కూడా భక్తుల నుండి అధిక ఛార్జీలు వసూలుచేస్తున్నారనే ఆరోపణలు, ఫిర్యాదులు బలంగా ఉన్నాయి. ట్యాక్సీడ్రైవర్ల దోపిడీపై పలుమార్లుభక్తులు టిటిడి టోల్‌ఫ్రీనంబర్‌కు, ఈమెయిల్‌ద్వారా ఫిర్యాదు చేశారు. నిర్ణీత ఛార్జీలు వసూలుచేసేలా, ప్రీపెయిడ్ ట్యాక్సీలు నడిపేలా టిటిడి, తిరుపతి జిల్లా పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తిరుమలకు దేశవిదేశాల నుండి భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తుంటారు. రోజూ లక్షమందివరకు భక్తులు వస్తుంటేవీరిలో 70శాతంమంది భక్తులు ఆర్టీబస్సులు, రైళ్ళలోనే చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో, ట్యాక్సీల్లో వస్తుంటారు. వీరంతా గదుల కోసం సిఆర్ఒ , పద్మావతి విచారణకార్యాలయం, ఛైర్మన్ క్యాంపు కార్యాలయం, జెఇఒ కార్యాలయాలకు చేరుకోవడానికి ట్యాక్సీలపై ఆధారపడాల్సి వస్తోంది. తిరుమలలో రాంభగీచా బస్టాండ్, వెంకన్న ఆలయం ముందురోడ్డుపై నుండి

**- తిరుమలలో ప్రైవేట్ డ్రైవర్ల చేతిలో భక్తుల దోపిడీ !**

సిఆర్ఒ, పిఎసిలు, పద్మావతివిచారణ కార్యాలయాలకు చేరుకోవాలంటే 300రూపాయలు నుండి ఏకంగా 500 రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. ఇక స్థానికంగా ఉన్న ఉమ్మడి ఆలయాల పేరుతో భక్తులను మరీ నిలువుదోపిడీ చేస్తున్నారు. తిరుమలలో పలుప్రాంతాల సందర్శనకు ప్రైవేట్ ట్యాక్సీడ్రైవర్ల చేతిలో దగాపడుతున్నారనే ఆవేదన వెలిబుస్తున్నారు. తమ చేతిలోని డబ్బులు ట్యాక్సీలకు ఖర్చుయితే తిరుగుప్రయాణం ఎలా అనే ఆవేదన కూడా అధికశాతంమంది భక్తులు వ్యక్తం చేస్తున్నారు. కొండపై ఉచిత బస్సులు (ధర్మరథాలు)నడుస్తున్నా ప్రైవేట్ ట్యాక్సీలపై ఆదారపడుతుంటారు. ఇక గోవిందుని దర్శనానికి వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్, ఏటిసి క్యూలైన్, ఏటిజిహెచ్ క్యూలైన్, వైకుంఠమ్ 2 క్యూలైన్‌ల వద్దకు చేరుకోవడానికి ట్యాక్సీలే శరణ్యం.

**- ప్రీపెయిడ్‌ట్యాక్సీ మాటే మరిచారు!:** తిరుమల కొండపై భక్తులు గదులు పొందడానికి విచారణ కార్యాలయాల వద్దకు వెళ్ళాలన్నా, దర్శనానికి చేరుకోవాలన్నా ప్రైవేట్ ట్యాక్సీలే . భక్తులకు సేవల పేరుతో, బయటి ప్రాంతాలనుంచి వస్తున్న యాత్రికులపై ఆధారపడి దాదాపుగా 4వేల వరకు ట్యాక్సీలు ఉన్నాయి. తిరుమలలోనే 1,500వరకు ట్యాక్సీలు స్థానికంగా తిరుగుతుంటాయి. ఇక తిరుమలలో స్థానిక ఆలయాలు పాపవినాశనం, జాపాలి, ఆకాశగంగ, వేణుగోపాలస్వామి ఆలయం, శిలాతోరణం, శ్రీవారిపాదాలు ఇలా భక్తులు సందర్శించడానికి సుముఖత చూపుతున్నారు.

## ఆర్‌డిటిపై కేంద్రం ధోరణి మారాలి :కె.ఎ.పాల్

**కొత్తచెరువు, మే 08, ప్రభాతవార్త** ఆర్‌డిటి సంస్థలకు ఎఫ్‌ఆర్‌సిఎ అనుమతులు లేకుండా చేయడం దారుణమని ఇప్పటికైన ఆర్‌డిటిపై కేంద్రం ధోరణి మారాలని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎ.పాల్ పేర్కొన్నారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువు మండలం, పోతులకుంట గ్రామంలో వి.సి.శ్రీనివాసరెడ్డి, గోవింద రెడ్డిల ఇంటికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆర్డిటి సేవలు సంస్థలు దాదాపు 45 సంవత్సరాలుగా 25 లక్షల కుటుంబాలకుపైగా సేవలు అందిస్తోందని, వేల మందికి చదువు చెప్పి, మందికి ఇల్లు కట్టి వేల మందికి ఉద్యోగాలు ఇచ్చి వందల మందిని విదేశాలు పంపించి కులమతాలు బేధాలు లేకుండా కాపాడుతూ వస్తోందన్నారు. అయితే ఆర్‌డిటి ఇక్కడ సేవలు చేయకుండా విదేశాల నుంచి డబ్బు లేకుండా స్తంభింపజేసి వేలుకోట్లు ఆస్తులను దోచుకోవాలని బిజెపి టిడిపి, జనసేన పార్టీ వాళ్ళు కుట్ర చేస్తున్నట్టు ఆరోపించారు. ఆర్డిటికి 30 రోజుల నుంచి 60 రోజుల్లో అనుమతులు ఇప్పిస్తానని, తెలంగాణ రాయలసీమ అనంతపూర్ కర్నూలు చిత్తూరు కడప జిల్లాలో ఆర్డిటి చేసిన సేవకు నేను అన్ని విధాల తోడ్పాటు అందించడానికి వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం అనంతపూరంలో హెల్త్ వర్కర్స్ ధర్నా చేస్తుంటే వారికి వెళ్లి మద్దతు ఇచ్చి వారిని రెగ్యులర్ చేయమని డిమాండ్ చేయడం జరిగిందన్నారు.

# ఎఆర్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలతే ఎసిబి నకిలీ ఎస్పీ!

## పోలీసుల అదుపులో లేడీ పోలీస్



**విశాఖపట్నం, మే 8, ప్రభాతవార్త** నకిలీ ఏసీబీ అధికారి కేసులో ఉన్న ట్విస్ట్ తొలగి పోయింది.. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌నంటూ ఫోన్‌లో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడిన మహిళ ఎవరనే దానిపై క్లారిటీ వచ్చేసింది. గతంలో నోట్ల మార్పిడి కేసులో అరెస్టై, సస్పెండై జైలుకు వెళ్లొచ్చిన ఏఆర్ ఇన్స్‌పెక్టర్ స్వర్ణలతే ఏసీబీ నకిలీ ఎస్పీగా పోలీసులు తేల్చారు. విశాఖ నగరంలోని మధురవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో బుధవారం నకిలీ ఏసీబీ అధికారి కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బలగా సుధాకర్ చాలాకాలం కిందట విశాఖలోని ఆదర్శనగర్ పాత డెయిరీఫారం వద్ద నివాసం ఉంటుండగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని కలిసి.. తాను ఏసీబీ సీఐ గా పరిచయం చేసుకుని, మీ ఆఫీస్ అవినీతిపై తమకు చాలా ఫిర్యాదులు అందాయని, వాటిపై కేసు నమోదు చేయాల్సి ఉందంటూ బెదరించాడు. అంతే కాకుండా ఏసీబీ జాయింట్ డైరెక్టర్ తో మాట్లాడి సెటిల్ చేస్తానన్ని ఒకరికి ఫోన్ చేసి సబ్ రిజిస్టర్ తో మాట్లాడించాడు. దీంతో ఆ అధికారి ..:సుధాకర్ చెప్పినట్టు చేయండి, మిగిలింది నేను చూసుకుంటానన్ని అంటూ సబ్ రిజిస్టర్ కు భరోసా ఇచ్చింది. అయితే సబ్ రిజిస్ట్రార్ కు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ ఏసీబీ అధికారి సుధాకర్ వ్యవహారం బయటపడింది. పీఎం పాలెం పోలీసులు నకిలీ ఏసీబీ అధికారి సుధాకర్ ను అరెస్ట్ చేశారు.. అయితే, నకిలీ ఏసీబీ అధికారి కేసులో సంచలన అంశాలు వెలుగు చూశాయి. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌నంటూ ఫోన్‌లో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రార్‌తో మాట్లాడిన మహిళ ఏఆర్ ఇన్స్పెక్టర్ స్వర్ణలతగా పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ప్రస్తుతం ఆమె బాపట్ల జిల్లాలో ఏఆర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 2000 రూపాయల నోట్ల మార్పిడి కేసులో స్వర్ణలత అరెస్టయ్యారు . సినిమాల్లో నటించాలన్న పిచ్చితో డబ్బులు కూడగట్టేందుకు దొంగ పోలీస్ అవతారమెత్తారు. నటనలో శిక్షణ తీసుకోవడమే కాదు.. డ్యాన్సులు నేర్చుకున్నారు. అంతేకాదు ఏపీ 31పేరుతో ఓ సినిమా పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. ఆమె డ్యాన్స్ వీడియోలు, సినిమా పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత నకిలీ దందా వ్యవహారం బయటపడటం.. అరెస్టవ్వడంతో కొన్నాళ్లు సైలెంట్ ఉన్నా స్వర్ణలత.. మళ్లీ దందా ద్వారా స్వర్ణలత నకిలీ ఏసీబీ ఎస్పీ వ్యవహారం తెరపైకి వచ్చింది. పీఎంపాలెం పోలీసులు ఆమెను అదుపులోకి విచారిస్తున్నట్టు నార్త్ ఏసీపీ అప్పలరాజు తెలిపారు.

## విద్యుత్ శాఖ పై మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి చేసేవన్నీ తప్పుడు ప్రచారాలు :మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:**విద్యుత్ శాఖ పై వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేసేవన్నీ తప్పుడు ప్రచారాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీ పెంచలేదని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఇకపై పెంచకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 2022 నవంబర్ లో కేవలం సోలార్ విద్యుత్ ను రూ.5.12 కి యూనిట్ కొనుగోలు చేసేలా వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇదే ఒప్పందం ద్వారా సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ ను యూనిట్ కు రూ. 4.60 కు పీక్ అవర్స్ లో సరఫరా చేసేలా కొనుగోలు ఒప్పందం చేసుకున్నామన్నారు. పీక్ అవర్స్ లో (అత్యధిక వినియోగ సమయం) కూటమి ప్రభుత్వం రూ.4.60కు కొనుగోలు చేస్తున్న యూనిట్ ను వైసీపీ ప్రభుత్వం రూ.9.30కు కొనుగోలు చేసిందని మంత్రి వెల్లడించారు. ఇటువంటి నిర్ణయాలతో ప్రజల నెత్తిన ఐదేళ్లలోనే సుమారు రూ.1.29 లక్షల కోట్ల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాజస్థాన్ సెకీతో చేసుకున్న ఒప్పందంతో డిస్కంలు, ట్రాన్స్ కో, జెన్ కోలు సర్వనాశనం అయ్యాయని తెలిపారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. యాక్సిస్, బ్రూక్ ఫీల్డ్ కంపెనీతో కూటమి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాల పై అవినీతి సొమ్ముతో ఏర్పాటు చేసిన సాక్షి మీడియాను అడ్డం పెట్టుకుని జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం లో సెకీ నుంచి రూ.2.49కి విద్యుత్ కొనుగోలు చేసామనేది పచ్చి అబద్ధమని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ట్రాన్స్మిషన్ లాసెస్, ఇతర ఖర్చులన్నీ కలిపితే రూ. 5 పైనే ఖర్చు చేయాల్సి వస్తుందని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.



## గట్టిగా మూడేళ్లు పోరాడితే వచ్చేది మన ప్రభుత్వమే: మాజీ సీఎం జగన్

**విజయవాడ మే8 ప్రభాతవార్త ప్రతినిధి:** మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అన్నారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం శ్రీ సత్యసాయి జిల్లా మడకశికర మున్సిపాలిటీ పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల ఎంపీపీలు, వైఎస్ ఎంపీపీలు , మున్సిపల్ ఛైర్ పర్సన్లు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు కౌన్సిలర్లు ఎంపీటీసీలతో పాటు ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అయిన వైఎస్ జగన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చూస్తుండగానే ఏడాది గడిచింది. కళ్లు మూసుకుని తెరిస్తే మూడేళ్లు గడుస్తాయి. మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు మిమ్మల్ని వేధిస్తున్నవారెవ్వరినీ వదిలిపెట్టబోం మనం అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు.

## వేర్వేరు మార్గాల మీదుగా చర్లపల్లి-శ్రీకాకుళం మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు


**గుంతకల్లు రైల్వే,మే 8,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి వేర్వేరు మార్గాల మీదుగా చర్లపల్లి-శ్రీకాకుళం-చర్లపల్లి మధ్య వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లే నెంబర్ 07421ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13నుంచి జూన్ 24వరకు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07422ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 14నుంచి జూన్ 25వరకు ప్రతి బుధవారం శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుంది. ఈ రైళ్ల మార్గమధ్యలో నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో నిలుస్తాయి. అలాగే చర్లపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లే మరో రైలు సర్వీసు నెంబర్ 07425ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12నుంచి జూన్ 23వరకు ప్రతి సోమవారం చర్లపల్లి నుంచి బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07426ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 12నుంచి జూన్ 23వరకు ప్రతి సోమవారం శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుంది. ఈ రైళ్ల మార్గమధ్యలో కాజీపేట, వరంగల్లు, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం స్టేషన్లలో నిలుస్తాయి.

# ఉత్తర కాశీ యాత్రలో విషాదం!

## హెలికాప్టర్ ప్రమాదంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి మృతి

## తీవ్ర గాయాలపాలైన బావ ముష్టూరు భాస్కర్

**గుంతకల్లు, మే 8 ప్రభాతవార్త** ఉత్తరాఖండ్ లోని ఉత్తరకాశిలో గురువారం జరిగిన ఘోర హెలికాప్టర్ ప్రమాదంలో అనంతపురం టిడిపి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి (48) మృతి చెందగా, ఆయన బావ ముష్టూరు భాస్కర్ తీవ్ర గాయాలపాలయ్యారు. హెలికాప్టర్ లో ఏడుగురు ప్రయాణిస్తుండగా ప్రమాద ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ముష్టూరు భాస్కర్ ఒక్కరే తీవ్ర గాయాలతో బయట పడినట్లు తెలుస్తోంది. చికిత్స నిమిత్తం ఆయనను సమీపంలోని ఎయిమ్స్ రిషికేష్ ఆసుపత్రికి తరలించారు. ఘటన ఎంపీ, భావ భాస్కర్ కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. సమాచారం అందుకున్న ఇరువురి కుటుంబ సభ్యులు ఉత్తరాఖండ్ (రిషికేష్) కు బయలుదేరి వెళ్లారు. ఇదిలా ఉండగా ఉత్తర భారత దేశ యాత్రల కోసం ముష్టూర్ భాస్కర్ దంపతులు టూరిస్ట్ ప్యాకేజీ ద్వారా ఈనెల 6న గుంతకల్లు నుండి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. అక్కడి నుండి విమాన మార్గం ద్వారా టూర్ కు బయలుదేరి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 11న తిరిగి గుంతకల్లుకు రావాల్సి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చివరి చెల్లెలైన వేదవతి కుమారి ని 1994 మార్చి 24న పట్టణానికి చెందిన ముష్టూరు భాస్కర్ కి ఇచ్చి వివాహం జరిపించారు వీరికి అభిషేక్, సాయి ఇద్దరు కుమారులు. భాస్కర్ ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారంతో పాటు, ప్రైవేట్ బ్యాంకు, ఓ ఆసుపత్రి, మద్యం షాపులను నిర్వహిస్తున్నారు.



ముష్టూరు భాస్కర్ దంపతులు(ఫైల్ ఫోటో)

### వేదవతి కుమారి మృతిపై మంత్రి కందుల దుర్గేష్ సంతాపం

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** .ఉత్తరాఖండ్‌లో హెలికాప్టర్ కూలిన ఘటనలో ఏపీకి చెందిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ సోదరి వేదవతి కుమారి మృతిపై మంత్రి కందుల దుర్గేష్. ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి దుర్గేష్.. మృతురాలు వేదవతి కుమారి భర్త భాస్కర్ కు తీవ్ర గాయాలు.. రిషికేష్ లోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న భాస్కర్ కు మెరుగైన వై+ద్య సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు

## భార్యపై అనుమానంతో కత్తితో నరికి హాత్యచేసిన భర్త!

**వెంకటాచలం (నెల్లూరు), మే 8, ప్రభాతవార్త :** భార్యను అతి కిరాతకంగా కత్తితో నరికి చంపిన ఘటన మండల పరిదిలోనే చవటపాళెం పంచాయతీలోనే అబ్బీ సాహెబ్ కండ్రిగలో బుధవారం రాత్రి సంచలనం రేపింది. వివరాలు పొదలకూరు మండలంలో వామిటిపత్తి గ్రామానికి చెందిన పచ్చిపాల బాబు, భారతి(30) దంపతలుకు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వాల్లకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమార్తె 8దవ తరగతి చదువుతుండగా మరో కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తైంది. కొన్నాల్లు వాల్ల కాపురం సజావుగా సాగింది ఇటీవల కాలంలో భార్య భర్తల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. భార్య వేరే వాళ్ళతో ఫోన్లో మాట్లాడుతుంన్న అనుమానంతో బాబు భార్య అయిన భారతిని వేదించేవాడు. ఇటీవల మూడు నెలల క్రితం భార్యభర్తల మధ్య గొడవలు రావడంతో బాబు పురుగుల మందు సేవించాడు. ఎలాగైన భార్యను హతమార్చాలనుకొని భర్త నిర్ణయించుకున్నాడు దీంతో ఈ నెల 1వ తేదీన భారతి అక్కైన మందలకృష్ణవేణి వెంకటాచలం మండలంలోని చవటపాళెం పంచాయతీలోనే అబ్బీ సాహెబ్ కండ్రిగ లో నివాసం ఉంటున్నారు. పిల్లలకు సెలవులు కావడంతో అక్క ఇంటికి బాబు, భారతి ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చారు దీంతో బాబు భారతిని హతమార్చాలని ముందస్తు ప్రణాళికతో నిర్ణయించుకున్నారు దీంతో బుధవారం అర్థ రాత్రి భార్యభర్తలు ఇద్దరు మిద్దపై నిద్రిస్తుండగా 1:00 గంట సమయంలో భర్త కత్తితో భార్యను అతి కిరాతకంగా గొంతు కోసి హత్య చేశాడు. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న వాళ్ళు అనుమానము వచ్చి పరిశీలించగా భారతీ రక్తపు మడుగుల మధ్య కిరాతకంగా మృతి చెంది ఉంది. వెంటనే బంధువులు, గ్రామస్తులు బాబుని అదుపులోకి తీసుకొని వెంకటాచలం పోలీసులకు సమాచారం అందించారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

**విజయవాడ మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** అప్పుల విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధ చర్యలను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం పై హైకోర్టుస్పందించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సంస్థ ద్వారా రూ.9వేల కోట్లను అప్పులుగా బాండ్ల రూపంలో సేకరించేందుకు వీలుగా జారీ చేసిన ఉత్తర్వుల విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏపీ ఎండీసీ వైస్ ఛైర్మన్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 6కి వాయదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ , న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌బీఐ నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను ప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా బాండ్ల కొనుగోలు దారులు సంచిత నిధి నుంచి తీసుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వంజారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## రాష్ట్రంలో స్పేస్ - డిఫెన్స్ ప్రాజెక్టులు ఏర్పాటయ్యేలా త్వరలో నూతన పాలసీ

**విజయవాడ మే8 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతరిక్ష-రక్షణ రంగాలకు సంబంధించి ప్రాజెక్టులు రాష్ట్రంలో నెలకొల్పేలా పెట్టుబడులు ఆకర్షించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి పెట్టారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రస్తుతం రాష్ట్రానికి స్పేస్ టెక్నాలజీ అడ్వయిజర్‌గా ఉన్న ఎస్ సోమనాథ్, అలాగే మాజీ డీఆర్డీఓ ఛైర్మన్ ప్రస్తుత రాష్ట్ర ఏరోస్పేస్ డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డితో చర్చించారు.

స్పేస్ డిఫెన్స్ పాలసీల రూపకల్పనతో పాటు ఈ రెండు రంగాలకు సంబంధించి రాష్ట్రానికి వచ్చే ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు పొందేలా చురుకైన పాత్ర పోషించాలని ఇరువురికి ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థులు స్పేస్ డిఫెన్స్ రంగాల వైపు ఆకర్షితులయ్యేలా ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

## శిక్షణా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి: మంత్రి ఎస్.సవిత

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:**మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలన్న సదుద్దేశంతో ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. శిక్షణా కేంద్రాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీలు) తరుచూ సందర్శించాలని ఆదేశించారు. వంద శాతం మేర లబ్ధిదారులు శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈడీలు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారులతో సెక్రటరీ సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జునతో కలిసి మంత్రి సవిత వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, 175 నియోజక వర్గాల్లో 745 శిక్షణా కేంద్రాలు ప్రారంభమయ్యామన్నారు. త్వరలో మరిన్ని కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా శిక్షణా కేంద్రాల్లో తీసుకున్న చర్యలు, హాజరు గురించి మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ప్రతి ఇంటి నుంచి ఓ మహిళను పారిశ్రామిక వేత్తగా చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,02,832 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందజేస్తున్నామన్నారు.

## పిడుగుపాటుకు గుర్రై మహిళ మృతి

**పెద్దపంజాణి, మే 8 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం ముత్తుకూరు పంచాయతీ నెర్నిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన నాగభూషణం భార్య అర్చన అనే మహిళ పొలంవద్ద ఉండగా అకస్మాత్తుగా అమెపై పిడుగు పడటంతో మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అభయాంజనేయస్వామి విగ్రహా ప్రతిష్ఠ - కుంభాభిషేకం



శ్రీకాళహస్తి ఆభయ అంజనేయస్వామి ఆలయ కుంబాబిషేకం విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైకాపా నాయకులు

**శ్రీకాళహస్తి,మే 8 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని స్వామి వారి సన్నిధికి సమీపంలో దిగువ సన్నిధివీదిలో బ్రాహ్మణ సేవా సమాజం సారథ్యంలో నూతనంగా సంకటహార అభయ ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ కుంబాబిషేకం గురువారం సేవా సమాజం అధ్యక్షులు సింగరాజు ప్రకాశం శాస్త్రి పర్యవేక్షణలో హనుమాన్ సేవా సమితి అధ్యక్షులు దర్భా తులసీరామ్ మిత్రబృందం సారథ్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు టిటిడి ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. శ్రీకాళహస్తి దిగువ సన్నిధివీధిలో బ్రాహ్మణ సేవా సమాజనం నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి ఆలయం కుంబాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నూశ్రీకాళహస్తి ఆభయ ఆంజనేయస్వామి ఆలయ కుంబాబిషేకం విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైకాపా నాయకులుతనంగా తయారు చేయించిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని భారీ ఎత్తున గ్రామోతనసవం నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. వీధినంతా దీపాల కాంతితో ముస్తాబు చేసారు. మూడు రోజుల నుంచి నూతన విగ్రహం ఆలయానికి షోడషోభిషోపచారాలు నిర్వహించారు. ఈ ప్రాంతం వేదపండితుల వేద మంత్రాలతో దద్దరిల్లింది. ఆలయ కుంబాభిషేకానికి హాజరైన టిటిడి మాజీ చైర్మెన్, తిరుపతి మాజీ శాసనసభ్యుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ హిందూమతంలో హనుమంతునికి ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉందన్నారు. హనుమంతుడు లేకుంటే రాముడు

# అన్నవరం సత్యదేవునికి పట్టువస్త్రాలు



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఇంద్రకీలాద్రి, మే 8, ప్రభాతవార్త: అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న కళ్యాణోత్సవాలకు శ్రీ స్వామివారి తోబుట్టువు బెజవాడ దుర్గమ్మ తరపున గురువారం పట్టువస్త్రాలను అందించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆలయ ప్రధానార్చకులు లింగంభొట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల బృందం, అర్చకస్వాములు, శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చేరుకుని అక్కడ శ్రీ స్వామివారికి అందించే పట్టువస్త్రాలను ఆలయాధికారులకు అందించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, సన్నాయి నాదాల నడుమ పట్టువస్త్రాలను పూర్ణకుంభంతోస్వాగతం పలికి శ్రీ సత్యనారాయణ స్వామివార్ల దేవస్థానం బృందం పట్టువస్త్రాలను అందుకుని శ్రీ స్వామివార్ల వద్ద వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తీసుకుని వచ్చిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం బృందంకు శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామివార్ల దర్శనంతో పాటు ప్రసాదాలు, మెమొంటో, శేషవస్త్రం సమర్పించి వేదాశీర్వచనాలందించారు. దుర్గమ్మ ఆలయానికి భక్తుల విరాళాలు: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రూ.1లక్ష 11 వేలను విరాళంగా గురువారం విజయవాడకు చెందిన టి హనుమంతరావు వారి కుటుంబసభ్యులతో కలిసి ఆలయాధికారులకు అందించారు. అలాగే దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న స్వర్ణతాపడం పనులకు గుంటూరుకు చెందిన బి కోట్ల నాయక్ రూ.1లక్ష 116ల విరాళాన్ని గురువారం ఆలయాధికారులకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు దుర్గమ్మవారి దర్శనం కలిగించిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## కోనకు పల్లకీలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుడు



రాపూరు (నెల్లూరు), మే 8, ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారు బ్రహ్మోత్సవాలకు పెళ్లి కొడుకుగా ముస్తాబై ఉభయ నాంచారులతో కలిసి గురువారం గోనుపల్లి గ్రామం నుండి పెంచలకోనకు పల్లకీలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గోనుపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాలకు ఉభయ దేవేరులతో పల్లకిలో కోనకు బయలుదేరిన స్వామి వారికి గోనుపల్లి గ్రామస్తులు వారి నివాసాల ముందు బాగాన పందిళ్ళు ఏర్పాటు చేసి స్వాగతం పలికి మొక్కులు చెల్లించారు. స్వామి వారు గ్రామ గిరిజన కాలనీ వద్దకు చేరుకోగానే గిరిజనులు వారి సాంప్రదాయం ప్రకారం ఇంటి అల్లుడైన పెంచల స్వామికి గిరిజన సాంప్రదాయం ప్రకారం పుట్టతేనే, ఇంజేటి గడ్డలు, ఇతర దుంపలు, ఆవీనారా మొలతాడు వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు.

అక్కడి నుండి బయలు దేరిన స్వామి వారు గోల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు చేరుకోగానే గోల్లబోయిన స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తొలి దర్శనం గోల్లబోయిన స్వామి వారికి ఇచ్చారు. అక్కడి నుండి సుమారు 6 కిలోమీటర్ల మేర స్వామి వారిని బోయిలు గోవింద నామస్మరణలతో పల్లకీలో మోసుకుంటూ కోనకు చేరుకున్నారు. కోనలోని స్వామి వారి ముఖద్వారం వద్దకు స్వామి వారు చెరుకున్నంతనే అర్చక స్వాములు అక్కడికి చేరుకొని స్వామి వారికి పూజలు నిర్వహించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఆలయ డిప్యూటీ కమీషనర్ పొరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, గోనుపల్లి సర్పంచ్ గోతాటి నారాయణమ్మ, సేవా కమిటీ సభ్యులు రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్లా హజరత్ నాయుడు, తోట క్రిష్ణయ్య, శ్రీశైలం భార్గవ రామ్, కిస్నేర నరసింహ రావు,పెమ్మసాని సుగుణమ్మ, మోమిడి నరసింహులు, బోగులు బాస్కర రెడ్డి, బోతల శివ నాగేశ్వర రావు, దాసరి బాస్కర నాయుడు, యం.నవకృష్ణ చౌదరి, ఈతముక్కల యోగేశ్వర రావు తదితరులు వున్నారు. స్వామి వెంట కాలినడకన వేలాదిమంది భక్తులు కోనకు బ్రహ్మోత్సవాలకు కాలినడకన పల్లకీలో కోనకు బయలుదేరిన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి ఎంట ఈ పర్యయం గతంలో ఎన్నడూ లేని విధంగా వేలాది మంది భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం,చెక్క భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



## పెనుశిల నృసింహుని సేవలో తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి సుధ

రాపూరు (నెల్లూరు), మే 8, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామిని గురువారం తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జెపి సుధ తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కోనకు వచ్చిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు ఆధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి వారికి, శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి, శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆస్థాన మండపంలో వేదపండితులు ఆమెకు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గుండ్లూరు శేష స్వామి, పలువురు దేవస్థానం సిబ్బంది వున్నారు.

# టమోటా సాగు భారమై యువరైతు బలవన్మరణం

చౌడేపల్లి, మే 8 ప్రభాతవార్త టమోటా సాగు యువరైతు ఉసురు తీసింది...గతంలో చేసిన అప్పుకు ప్రస్తుతం సాగుచేసిన రుణం తోడు కావడం వెరసి మోపుడు అప్పులు పెనుభారం కావడంతో యువరైతు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ శివపురం అగ్రహారంకు చెందిన లోకేష్(26) వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నాడు. తండ్రి కమలాకర్ మహారాష్ట్ర పూణేవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కగానొక్క కుమారుడైన లోకేష్ చిన్నతనం నుంచి కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. ఈక్రమంలో తనకున్న ఎకరా పొలంలో జీవీవల టమోటా సాగు చేసాడు. గత 10రోజులుగా టమోటాకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చేదెలా అంటూ ప్రతిరోజు ఇంట్లో తెలిపేవాడు. టమోటా పంట దిగుబడి ఆశాజనకంగా వున్నప్పటికీ జీవీవల మరింత ధర తగ్గిపోవడంతో యువరైతు మనస్థాపానికి గురై తన సెల్‌ఫోన్‌లో బుధవారం రాత్రి " ఐయామ్ వెరీ సారీ "అని స్టేటస్‌లో పెట్టి కనిపించకుండా పోయాడు. ఉదయాన్నే కీలేరుకుండ తన పొలానికి పక్కనే వున్న చింతచెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. గుర్తించిన స్థానికులు తల్లి హేమావతికి తెలియజేసారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వివరించారు. భర్త చనిపో యిన తర్వాత ఉన్న ఒక్క బిడ్డను చూసుకొని జీవిస్తున్న తల్లికి లోకేష్ మరణం జీర్ణించుకోలేక పోతోంది.

# ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ పునరుద్ధరణ చేయండి

## - సిఎంను కలిసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డిటి) సంస్థకు ఎఫ్‌సిఆర్ఎ కింద వివిధ దేశాలనుంచి అందే సహాయానికి సంబంధించి రెన్యూవల్ పునరుద్ధరణ చేసేందుకు తగుచర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబునాయుడును గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ కలిసిన సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా సీఎంకు వివరిస్తూ.. 1969లో విన్సెంట్ ఫెర్రర్ దంపతులచే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో స్థాపించబడింది. గ్రామీణ ప్రాంతాల్లోనే పేదరికం, బాధలు, అన్యాయాలను నిర్మూలించడానికి, సమాన అవకాశాలు, సంపదను అందరికీ అందించడానికి ఈ సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. సంస్థను ఏర్పాటు చేసిన తర్వాత కరువు పీడిత ప్రాంతాల్లో ఫుడ్ ఫర్ వర్క్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. తద్వారా వేలాదిగా బావులు తవ్వటం, లక్షలాది గృహాల నిర్మాణం, కుష్టు వ్యాధి కేంద్రం స్థాపన వంటి పనులు చేపట్టిందన్నారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభించి కూలీలను రైతులుగా మార్చడంలో సహాయ పడిందన్నారు. గ్రామీణ సమాజాల్లో పేదరికం, బాధలు, అన్యాయాలను తొలగించి, స్థిరమైన అభివృద్ధి ద్వారా సమాజాన్ని సాధికారపరచడం, మహిళలు, పిల్లలు, వైకల్యం ఉన్న వ్యక్తులు, గిరిజన వర్గాల అభివృద్ధి కోసం ఆర్‌డిటి సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని.

విద్య, వైద్య, గృహ నిర్మాణం, స్థిరమైన జీవనోపాధి, సాంస్కృతిక-క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలను మెరుగు పర్చడానికి మొబైల్ లైబ్రరీలు, ట్యూషన్ స్కూళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా స్కాలర్‌షిప్పను అందిస్తోందన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్‌లలో రెండు సెకండరీ ఆసుపత్రులు, ఒక ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ స్థాపించిందన్నారు. రోజువారీ 3వేల మంది పేదవారు ఈ ఆసుపత్రుల సేవలను వినియోగిస్తున్నారన్నారు.

## జిఆర్ఎంబి సొంత నిర్ణయాలు మినట్స్‌గా రికార్డులు చేయడం తగదు

### ఇఎన్‌సి అనిల్‌కుమార్

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: గోదావరి యాజమాన్య బోర్డు సమావేశాల సమయ నిర్వహణ నుంచి మొదలు కొని సమా వేశంలో జరిగి చర్చ సందర్భంగా వెలు వడిన అభిప్రాయలు పరిగణలోకి తీసు కోకుండా సొంతనిర్ణయాలతో రికార్డు చేస్తున్నారని తెలంగాణ నీటిపారుదలశాఖ ఇఎన్‌సి జి అనిల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిఆర్ఎంబి సమావేశాలు ఏర్పాటు చేసే ముందు సభ్యరాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకితీసుకొని మీటింగ్ షెడ్యూల్ నిర్ణయించాలని సూచించారు. జిఆర్ఎంబి, విపిలు ముఖ్యమైన సమాచారాలు సభ్య దేశాలకు పంపిణీ చేయాలని గోప్యంగా పెట్టడం తగదని అంటూ గోదావరి యాజమాన్య బోర్డు చైర్మన్‌కు తన నిరసన వ్యక్తంచేసేవా ఘాటుగా లేఖను రాశారు. జిఆర్ఎంబి కార్యదర్శి వ్యవహారంలో ఇరు రాష్ట్రాలు చేసిన ఫిర్యాదులను కూడా మినిట్స్‌లో వారికి అనుకూలంగా రాసు కున్నారని ఆయన చేసిన ఆర్థిక అవకతవకలకు కూడా చోటు లేకుండా చేశారని దుయ్యబడుతూ లేఖను రాశారు. స్టాఫ్ నియామకాలపై తెలంగాణప్రభుత్వం కోరుతున్న సవరణల విషయంలో కూడా బోర్డు ఉదాసీనతపై కూడా ఆయన తప్పుపట్టారు. జిఆర్ఎంబి సీడ్ మనీ ఇవ్వడంతోపాటు ప్రాజెక్టుల అప్పగింతపైని ఎక్కడ అనేదేలేదని దానిని తప్పుగా రికార్డులచేశారన్నారు.

# మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రుణ సదుపాయం



## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: మహిళా సంఘాలకు గత యేడాది లక్ష్యానికి మించి రుణ సదుపాయం కల్పించామని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ప్రజాభవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సెర్ప్ వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా ఆర్థిక సాధికారతకు ఆలంబనగా నిలుస్తున్న నిలుస్తున్న సెర్ప్ బ్యాంక్ లింకేజీ వార్షిక కార్యాచరణను ఆవిష్కరించ డమే్వడం సంతోషంగా ఉందన్నారు. గత యేడాదితో పోలిస్తే అదనంగా గత ఏడాది రూ.5 వేల కోట్ల రుణాలు ఇప్పించామని ఇది మహిళా సంఘాల చరిత్రలో ఒక రికార్డు సృష్టించామన్నారు. గత ఏడాది యాక్షన్ ప్లాన్ను విజయవంతం చేసుకున్నట్లు గానే ఈ సంవత్సరం కూడా ఈ యాక్షన్ ప్లాన్ విజయవతం చేయాలన్నారు.అంతే కాకుండా యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉండాలన్నారు. రుణాలను తిరిగి చెల్లించడంలో మహిళా స్వయం సహాయక బృందాలు తమ నిబద్ధతను చాటుకున్నాయన్నారు. పెద్ద,పెద్ద పారిశ్రామిక వేత్తలు, సూటు,బూటు వేసుకున్న వ్యక్తులు బ్యాంకులకు కన్నాలు వేస్తుంటే స్వయం సహాయక సంఘాలు మాత్రం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నాయన్నారు. అయినా మహిళా స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు భయపడుతున్నారన్నారు. మహిళా సంఘాల తరఫున మేము బ్యాంకులకు గ్యారెంటీ ఇస్తున్నట్లు ప్రకటించారు. మహిళా సంఘాలు తీసుకునే ప్రతి పైసా తిరిగి చెల్లిస్తామని ఆమె బ్యాంకర్లకు భరోసా ఇచ్చారు. మహిళా స్వయం సహాయక బృందాలు స్వయం ఉపాధి స్థాయి నుంచి సంపద సృష్టించే స్థాయికి ఎదిగాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాల్లో కోటి మంది సభ్యులను చేర్చే లక్ష్యంగా ,అందరిని కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయకరణ చేయక ముందు బ్యాంకులన్నీ పట్టణాలకే పరిమితమైట్లు ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. బ్యాంకులను జాతీయకరణ చేయడంతో బ్యాంకులన్నీ పల్లెలకు తరలి వెళ్ళాయని అక్కడి పేదలకు లోన్లు కూడా ఇస్తున్నాయన్నారు. అందుకే మహిళా శక్తి పథకానికి ఇందిరమ్మ పేరుపెట్టుకున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకర్లు ఇచ్చే లోన్లు దేశ ప్రగతికి ఉపకరిస్తాయని, అందుకే బ్యాంకర్లు తమ సహకారాన్ని మరింత విస్తరించాలన్నారు. బ్యాంకు లోన్లకు దూరంగా ఉన్న వర్గాలను గుర్తించి లోన్లు ఇప్పించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు తీసుకునేటు మొత్తం రుణాలను తిరిగి చెల్లిస్తామని బ్యాంకర్లకు ఆమె హామీ ఇచ్చారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు లోన్లు ఇవ్వడంలో టార్గెట్ రీచ్ అయిన బ్యాంకర్లను మంత్రి సీతక్క ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్డీ కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మూసీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించిన ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇవి నర్సింహారెడ్డి

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లను ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇవి నరసింహారెడ్డి పర్యటించారు. గురువారం ఈ రెండు రిజర్వాయర్ల పరిసర ప్రాంతాలను ఉన్నతాధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ల స్టోరేజ్ సామర్థ్యం, అందులోకి వచ్చే ఇన్, ఔట్ ఫ్లోస్ సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ ఎండికి వివరించారు. అనంతరం మూసీలోకి మంచినీటిని విడుదల చేయ డం, దానికి సంబంధించిన ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో ఎండి అధికారులతో సమగ్రంగా చర్చించారు. మూసీ, ఈసా నదుల పొడవునా బాపూఘాట్ వరకు విస్తరించి ఉన్న ప్రాంతానికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు. ఈ పర్యటనలో ఎంఆర్‌డిసిఎల్ జాయింట్ ఎండి గౌతమి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్ దత్తుపంత్, మెయిన్ హోర్స్, జలమండలి సూపరింటెండెంట్ ఇంజినీర్ బ్రిజేశ్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కన్నుమూత

హైదరాబాద్ (ఉప్పల్), మే 8, ప్రభాతవార్త: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి(80) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం మృతి చెందినట్లు మాజీ



ఎమ్మెల్యే రాజిరెడ్డి సోదరుడు ప్రస్తుత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి హబ్సిగూడలోని ఆయన నివాసానికి తరలించారు. బండారి రాజిరెడ్డి మృతి పట్ల సిఎం రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి కెటిఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పలువురు పార్టీల నేతలు, కాలనీ సంఘాల అధ్యక్షులు నివాళులు అర్పించారు. గత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నుంచి పోటీ చేసి తొలిసారిగా ఉప్పల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిడిపి బోర్డు మెంబర్‌గా, కీసరగిరి బ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయం చైర్మన్‌గా ఆయన పనిచేశారు. బండారి రాజిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం కీసరలోని ఆయన వ్యవసాయం క్షేత్రంలో జరు గుతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

# తెలంగాణ మిర్చి రైతులకు మోడీ ప్రభుత్వం అండ

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ.. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం వర్తింపచేస్తామన్న కేంద్రం

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం(ఎంఐఎస్)లోని ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్‌ను అమలు చేయడం ద్వారా తెలంగాణ మిర్చి రైతులకు లబ్ధిచేకూర నుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. పంట పండించేందుకయ్యే ఖర్చుకన్నా తక్కువ మొత్తానికి మార్కెట్లో విక్ర యించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు కనీసం పండించేందుకు అయిన ఖర్చును అయినా అంది స్తూ మిర్చి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ఉండటానికి వర్తలు తీసుకుంటున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. ఎంఐఎస్ మార్గ దర్శకాలకు అనుగుణంగా ఈ పథకాన్ని తెలం గాణలో అమలు చేయడానికి సుముఖంగా ఉన్నా మని, ఈ మేరకు వర్తలు తీసుకోవాలని తెలం గాణ వ్యవసాయ శాఖకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలోని మిర్చి రైతులకు ఎలాంటి నష్టం చేకూరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏప్రిల్ 4న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఖమ్మం, మహబూబాబాద్, జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో రైతులు ఎక్కువగా మిర్చి పంట పండిస్తారని, బహిరంగ మార్కెట్లో సాధారణ కన్నా తక్కువ ధర పలుకుతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని ఆ లేఖలో కోరారు. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ స్పందిస్తూ 2024-25 లో ఈ పథకం కింద తెలంగాణలో ఉత్పత్తి అయిన మిర్చి పంటలో 1,72,135 మెట్రిక్ టన్నుల పంటకు (తెలంగాణలో ఉత్పత్తి అయ్యే మొత్తం 6,88,540 మెట్రిక్ టన్నుల మిర్చి పంటలో 25 శాతం) ఈ పథకాన్ని వర్తింపజేస్తామని వెల్లడిం చింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద మార్కెట్ ధరకు, సాగు ఖర్చుకు మధ్య వ్యత్యాసాన్ని రైతులకు చెల్లిస్తామని వెల్లడించింది. మిర్చి పంటకు ఎంఐఎస్ ధరను క్వింటాలుకు రూ.10,374గా నిర్ణయించింది. ఎంఐఎస్‌కు, మార్కెట్ ధరకు మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలుత రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మిర్చి రైతులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టి సారించాలన్నారు. ఈ ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ వివరించింది. పంటల ధరల హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు రైతులకు కనీస ధర రావాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో జీవీవల కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆయ సురక్షణ్ అభియాన్ (పిఎం ఆశ) పథకాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా మిర్చి సహా హార్టికల్చర్ ఉత్పత్తుల కోసం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను తీసుకొచ్చిందన్నారు.

## తల్లిదండ్రుల్లా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

### 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు నియామక పత్రాలు

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ (హెచ్‌డబ్ల్యూఓ)లంటే తల్లిదండ్రుల్లా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని.. విద్యార్థుల్లో క్రాప్సి డెన్స్‌ను అభివృద్ధి చేస్తూ వారికి భవిష్యత్ మార్గదర్శకులుగా ఉండాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బిసి సంక్షేమ శాఖలో నూతనంగా నియామకమైన 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకి సచివాలయంలో గురువారం నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాలమాయాదేవి, బిసి గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు, కార్పొరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్ గౌడ్, మెట్టు సాయికుమార్, జైపాల్, జ్ఞానేశ్వర్, కల్లు సుజాత, వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌గా నూతనంగా నియామక పత్రాలు పొందుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. మీరంతా బిసి సంక్షేమ శాఖ కుటుంబంలో చేరుతున్నారని.. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఇది ఆత్మమని అన్నారు. ఉపాధ్యాయ, డాక్టర్, జర్నలిజం, రాజకీయాలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వృత్తిలో ఒక గౌరవాన్ని సాధించుకుంటామన్నారు. రాష్ట్రంలో 703 హాస్టల్స్ ఉంటే వాటిలోని ఖాళీల భర్తీ పూర్తి చేశామన్నారు. డిసెంబర్ 7, 2023న ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. విద్యార్థులకి మెస్ చార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని.. బలహీన వర్గాల శాఖ కుటుంబం గౌరవాన్ని పెంపొం దించాలన్నారు. పెద్దలకే పరిమితం అయిన సన్న బియ్యం సామాన్యుడి వరకు ప్రభుత్వం అందిస్తుందని.. బలహీన వర్గాల శాఖ మంత్రిగా తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా కుల సర్వే చేశామన్నారు.

## తీవ్రవాదరహిత తెలంగాణగా మార్చాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌దే

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: తీవ్రవాదరహిత తెలంగాణగా మార్చాల్సిన బాధ్యత సిఎం రేవంత్‌రెడ్డిపై ఉందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి, భారత సైన్యానికి సహ కరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆక్రమ వలసదారులను యుద్ధ ప్రాతి పదికన గుర్తించి తిప్పిపంపే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మరోవైపు దేశ సమగ్రతపై దాడి జరిగిన నేపథ్యంలో భారత సైన్యం మహిళా సైనికులు అత్యంత సాహసోపేతంగా మాతృమూర్తులను సింధూరాన్ని తుడిచివేసిన ఉగ్రవాదులపై దాడి చేసి బదులు తీర్చుకుంటే ఇక్కడున్న కొంతమంది కుహనా మేధావులు ఆపరేషన్ సిందూర్‌ను హేళన చేసేలా సామాజిక మాధ్య మాల్లో పోస్టులు చేయడం దురదృష్టకరం అన్నారు. ఒక యూని వర్సిటీలో బాధ్యతగల స్థానంలో ఉన్న సూరేపల్లి సుజాత సామాజిక మాధ్య మాల్లో దేశం పట్ల, ఆపరేషన్ సింధూర్ పట్ల హేళనగా పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. సుజాతపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్య శిక్షణకు వినూత్న కార్యక్రమం

## జెఎన్‌టియు - టిసిఎస్ ఐయాన్ ఒప్పందం

### మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే మరో వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రాం కింద ఐదు నెలల శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అయాన్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సచివాల యంలో మంత్రి సమక్షంలో హైదరాబాద్ జెఎన్ టియు - టిసిఎస్ ఐయాన్ సంస్థల మధ్య అవగా హన ఒప్పందం కుదిరింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పి యువతను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రారంభించామని శ్రీధర్ బాబు తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు లేకుండా డిగ్రీలతో ఉద్యోగాలు రావడం కష్టం అన్నారు. దీనిని అర్థం చేసుకు న్నందునే శిక్షణ పైన దృష్టి సారించామన్నారు. చదువు పూర్తి చేసే సమ యానికి ప్రతి ఒక్కరికి ఏదో ఒక అంశంలో నైపు ణ్యం పెంచగలిగితే ఉద్యో గాలు ఇవ్వడం కోసం కంపెనీలు వాకిటకే వచ్చే అవకాశం వస్తుంది. టిసిఎస్ ఐయాన్ సంస్థ మొదటి దశలో ప్రతి ఐదు నెలల 20 వారాలకు వంద మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ట్రెయినింగ్ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. ఆ సంస్థతో ఎంప్యానెల్ అయిన మూడు వేలకు పైగా కంపెనీలు వీరిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయి. పైలట్ కార్యక్రమం కింద మొదట మంథనిలోని జెఎన్‌టియు కళాశాల విద్యార్థులకు ప్లేస్ మెంట్ సక్సెస్ ప్రోగ్రాం కింద నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తాం అన్నారు.

## శ్రీదేవిలా ఎవ్వరినీ ఊహించుకోలేం.. రాఘవేంద్రరావు

దర్శకేంద్రుడు కే. రాఘవేంద్ర రావు సృష్టించిన అద్భుతం జగదేక వీరుడు అతిలోక సుందర్తి. మే 9న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈక్రమంలో దర్శకేంద్రులు మీడియాతో మాట్లాడుతూ పలు విషయాల్ని పంచుకున్నారు. ఈ క్రమంలో ఎప్పటి నుంచి వినిపిస్తున్న జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ గురించి కూడా మాట్లాడాడు. శ్రీదేవీ పాత్రల్లో ఎవ్వరినీ ఊహించుకోలేం.. ఆ దేవతా రూపం మళ్లీ అలా కనిపించడం కష్టం.. చాలా రిస్క్ ప్రాజెక్ట్ అవుతుందని అన్నాడు. మే 9న జగదేక వీరుడు రీ రిలీజ్ ప్రమోషన్స్‌లో దర్శకేంద్రుడు సీక్వెల్ గురించి ఏమన్నాడంటే? జగదేక వీరుడు అతిలోక సుందరి జగదేక వీరుడు అతిలోక సుందరి



దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు సృష్టించిన అద్భుతాలలో జగదేక వీరుడు అతిలోక సుందర్తి ఒకటి. ఈ మూవీలో చిరంజీవి, శ్రీదేవీ నటించిన తీరు, కనిపించిన తీరుకి జనాలు ఫిదా అయ్యారు. చిరంజీవి డ్యాన్సులు, నటన, ఇంద్రజగా దేవత రూపంలో కనిపించిన శ్రీదేవీపై కాసుల వర్షాన్ని కురిపించారు. తుపాను ప్రభావం లోనూ ఈ మూవీ కోట్లు కుమ్మరించి ఇండస్ట్రీ హిట్‌గా, క్లాసిక్ హిట్‌గా నిలిచింది. అయితే ఇన్నేళ్లకు మళ్లీ ఈ మూవీని 2డీ, 3డీ ఫార్మాట్‌లోకి మార్చి తీసుకు వస్తున్నారు. జగదేక వీరుడు అతిలోక సుందరి రీ రిలీజ్ కోసం చిరంజీవి, అశ్వనీదత్, రాఘవేంద్ర రావు ఇలా అంతా కూడా తమ తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు. ప్రమోషనల్ ఇంటర్వ్యూలు కూడా చేశారు. ఇక ఈ మూవీ సీక్వెల్ గురించి ఇప్పుడు ఎక్కువగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సీక్వెల్‌ను రాఘవేంద్ర రావు పర్యవేక్షణలో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌లతో నాగ్ అశ్విన్ తీయాలని చిరంజీవి కోరుకుంటున్నాడు. ఇక అశ్వనీదత్ కూడా అదే కోరుకుంటున్నాడట. రాజు పాత్రలో చిరంజీవి, ఇంద్రజగా శ్రీదేవీ కనిపించిన తీరుకు అంతా ఫిదాఅయ్యారు. ఒక్కోపాట ఒక్కో ఆణిముత్యంలా ఉంటుంది. ఇక చిరంజీవి, శ్రీదేవీ కలిసివేసిన స్టెప్పులు ఇప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా ఉంటాయి. అయితే ఈ కాంబోని మ్యాచ్ చేయడం అంత ఈజీ అయితే కాదని అందరికీ తెలిసిందే.

## ‘ఆర్య @21’ వరల్డ్ బాక్సాఫీస్ రికార్డులు

అల్లు అర్జున్ హీరోగా, అనూ మెహతా హీరోయిన్‌గా తెరకెక్కిన చిత్రం ఆర్య. ఈమూవీ ద్వారా సుకుమార్ దర్శకునిగా పరిచయమయ్యారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్‌రాజు నిర్మించిన ఈ సినిమా 2004 మే 7న విడుదలైంది. ఈ చిత్రం విడుదలై నేటికి 21 ఏళ్లు అయ్యాయి. అల్లు అర్జున్ లైఫ్ ఛేంజింగ్ మూవీగా ఆర్య నిలిచింది. 2004 మే 7న ఆర్య మార్నింగ్ షో పడింది, ఇదేదో ఫీల్ మై లవ్ అంటున్నారు ఏంట్రా కొత్తగా? హీరో క్యారెక్టర్ ఇలా ఉంది ఏంటి? అంటూ డివైడ్ టాక్. వన్‌సైడ్ లవ్ కాన్సెప్ట్ కొత్త కావడంతో ప్రేక్షకులు వన్‌సైడ్ రిజల్ట్ ఇవ్వలేకపోయారు. అయితేఇదంతా మొదటి రెండు రోజుల సంగతే. ఆ తరువాత కట్‌చేస్తే 125 రోజులు ప్రదర్శితమై, టాలీవుడ్‌లో ట్రెండ్ సెట్ చేసింది. 2003 నవంబర్ 19న సినిమా లాంఛనంగా ప్రారంభమైన ఆర్యను 120రోజుల్లో పూర్తి చేశారు సుకుమార్. దేవిశ్రీ ప్రసాద్ ఫీల్ మై లవ్ అంటూ ప్రతి ప్రేమికుడు ఆ ప్రేమను ఫీలయ్యేలా చేయడమే కాదు, తకదిమితోం అంటూ చిందులు తొక్కించారు. అ అంటే అమలాపురం.. ఆ అంటే ఆహాపురం అంటూ అక్షరమాలకు కొత్త అర్థం చెప్పినా దేవికే చెల్లింది. ఇక అలా రూ.4 కోట్లతో నిర్మించి రిలీజ్ చేస్తే డివైడ్ టాక్‌తో మొదలై బ్లాక్ బస్టర్ అయ్యి, ఫుల్ రన్‌లో రూ.30 కోట్లు వసూలు చేసింది. ఇక మలయాళంలో డబ్ చేసి విడుదల చేస్తే, రూ.35 లక్షల వరకూ వసూలు చేసి అల్లు అర్జున్‌కు మల్లు అర్జున్ అనే పేరు కూడా సంపాదించి పెట్టింది. నిజానికి అల్లు అర్జున్ గంగోత్రి ద్వారా టాలీవుడ్‌కు పరిచయమయ్యాడు. అయితే తన తొలి సినిమాకు, రెండో సినిమాకు గుర్తు పట్టలేనంతగా అతడు మారిపోయాడు. అతని లోని స్టైలిష్ స్టార్‌ను పరిచయం చేసిన సినిమా ఈ ఆర్య. గంగోత్రిలో అమాయకు డైన ఓ అబ్బాయి పాత్రలో కనిపించిన బన్నీ.. ఆర్యలో మాత్రం డిఫరెంట్ లుక్‌లో కనిపించడంతో పాటు తనలోని అసలైన



యాక్టింగ్, డ్యాన్సింగ్ స్కిల్స్‌ను బయటపెట్టాడు. యూత్‌లో స్టార్‌గా మారిపోవడానికి కారణం ఈ ఆర్య సినిమానే. ఈ సినిమాతో అల్లు అర్జున్ కెరియరే మారిపోయింది. తనలోని డ్యాన్స్, నటన, స్టైల్ ఇలా అన్నీ తెరపై చూపించాడు. దీంతో ఒక్కసారిగా ఆయనకు చాలామంది ఫ్యాన్స్ అయిపోయారు.



## ‘కుబేర’ న్యూ పోస్టర్ రిలీజ్

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర భారతీయ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా సినిమా నుంచి సరికొత్త పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

ధనుష్ రష్మిక మందన చిరునవ్వులతో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇప్పటికే సినిమాలోని నాలుగు ప్రధానపాత్రలను పరిచయం చేసిన ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ అద్భుతమైన స్పందనతో అంచనాలను పెంచింది. ఇటీవల రిలీజ్ అయిన ఫస్ట్ సింగల్ పోయిరా మామ చార్ట్ బస్టర్ హిట్ అయింది. మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో ఉంది. పోయిరా మామ్మా సాంగ్‌తో కుబేర మీద ఉన్న హైప్ నెక్స్ట్ లెవెల్‌కి చేరుకుంది. మేకర్స్ త్వరలో ప్రమోషన్స్‌ను కిక్ స్టార్ట్ చేయబోతున్నారు. క్యారెక్టర్ బేస్డ్ నరేటివ్స్‌తో అదరగొట్టే శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని నెవర్ బిఫోర్‌గా తీర్చిదిద్దారు, ఇది ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు.

## మాళవిక నయా లుక్



## క్రేజీ ప్రాజెక్ట్స్ లైనప్ చేసుకుంటున్న హీరో ధర్మ

డ్రింకర్ సాయి సినిమాలో నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు టాలెంటెడ్ హీరో ధర్మ. అందరి ప్రశంసలతో పాటు పలు అవార్డ్స్ కూడా దక్కించుకున్నారు. ఇప్పుడీ యంగ్ హీరో క్రేజీ ప్రాజెక్ట్స్ లైనప్ చేసుకుంటున్నారు. నటుడిగా తనను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసేలా ఆ మూవీస్ ఉండబోతున్నాయి. వీటికి సంబంధించిన అనౌన్స్ మెంట్ త్వరలో చేయబోతున్నారు హీరో ధర్మ.



గతేదాది థియేటర్స్‌లోకి వచ్చిన డ్రింకర్ సాయి సినిమాయూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఆకట్టుకుని మంచి విజయాన్నిసాధించింది. ఈ సినిమాలో హీరో ధర్మ తనడ్యాన్సులు, ఫైట్స్, యాక్టింగ్‌తో అందరినీ మెప్పించాడు. సాయి పాత్రలో ధర్మ చేసిన పర్‌ఫార్మెన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. టీజింగ్, ఫన్, ఎమోషనల్ సీన్స్‌లో మెచ్యూర్డ్ యాక్టింగ్ చేశాడు ధర్మ. తన నెక్ట్స్ మూవీస్‌ను మరింత పర్ఫెక్ట్‌గా ప్లాన్ చేస్తున్నాడీ యంగ్ హీరో. ఈ క్రమంలో ఇన్నోవేటివ్ స్క్రిప్ట్స్‌లో నటించేందుకు, యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్స్‌తో పనిచేసేందుకు ధర్మ ఆసక్తిగా ఉన్నారు.

## ‘వృశ్చికం’ మూవీ షురూ

మంగపుత్ర, యశ్విక జంటగా నటిస్తున్న సినిమా “వృశ్చికం”. ఈ చిత్రాన్ని శ్రీ ఆద్య నిర్మాణం బ్యానర్‌పై శివరామ్ నిర్మిస్తున్నారు. మంగపుత్ర దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానంలో పూజా కార్యక్రమాలతో “వృశ్చికం” సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ పాల్గొని గౌరవ దర్శకత్వం వహించారు. నటులు కోసూరి సుబ్రహ్మణ్యం కెమెరా స్విచ్చాన్ చేయగా, సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తానా క్లాప్ ఇచ్చారు. హీరో, దర్శకుడు మంగపుత్ర మాట్లాడుతూ, నేను 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. నటుడిగా పవన్ కల్యాణ్ జల్సా, గబ్బర్ సింగ్, సర్దార్ గబ్బర్ సింగ్ మూవీస్‌తో పాటు బాహుబలి 1, 2 చిత్రాల్లో నటించాను. రాజమౌళిని చూసి ఆయన దర్శకత్వానికి ఏకలవ్య శిష్యుడిగా మారాను. వృశ్చికం మూవీతో హీరోగా నటిస్తూ దర్శకుడిగా మారుతున్నాను. ఈ సినిమా సస్పెన్స్ థ్రిల్లర్ హారర్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంటుంది. 3 షెడ్యూల్స్‌లో 45 రోజుల్లో సినిమాను పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నా. రామచంద్రాపురం, భద్రాచలం, హైదరాబాద్‌లో షెడ్యూల్స్ చేస్తాం. ఈ సినిమాను మంచి ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అడ్వాన్స్డ్ టెక్నాలజీతో మీ ముందుకు తీసుకొస్తాం. మాచిన్న చిత్రానికి మీ అందరి సపోర్ట్ కావాలని కోరుకుంటున్నాం. అన్నారు. హీరోయిన్ యశ్విక మాట్లాడుతూ, వృశ్చికం సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. మా మూవీ ఓపెనింగ్‌కు వచ్చి బ్లెస్ చేసిన పెద్దలు పరుచూరిగోపాలకృష్ణకి ఇతర గెస్ట్‌లకు థ్యాంక్స్ అన్నారు. నటుడు కోసూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వృశ్చికం సినిమాలో నేను ఒక ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నాను. ఈ సినిమా ప్రారంభోత్సవానికి కెమెరా స్విచ్చాన్ చేయడం సంతోషంగా ఉంది. చిన్న చిత్రానికి మీ అందరి సపోర్ట్ కావాలి. మీడియామిత్రులు మా వృశ్చికం మూవీని ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నా అన్నారు. సంగీత దర్శకుడు ప్రమోద్ మాట్లాడుతూ, వృశ్చికం సినిమాకు మ్యూజిక్ చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రంలో మూడు పాటలు ఉంటాయి. సాంగ్స్ తక్కువే అయినా బీజీఎంకు మంచి ఇంపార్టెన్స్ ఉంటుంది. మంచి పాటలు, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. కొత్త తరహా కంటెంట్‌తో వృశ్చికం సినిమా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది అన్నారు. యాక్ట్రెస్ క్రాంతి బలివాడ మాట్లాడుతూ, వృశ్చికం సినిమా టైటిల్ చూస్తేనే ఎంతో ఆసక్తికరంగా అనిపిస్తోంది. నేను నటిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా చాలా సినిమాలు చేశాను. ఈ టీమ్‌లోని వారితో కూడా పని చేశాను. మళ్లీ మేమంతా కలిసి ఈ సినిమాకు వర్క్ చేయడం హ్యాపీగా ఉంది అన్నారు.



## 14న ‘గేమ్ ఆఫ్ ఛేంజ్’

5వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు నలందా విశ్వవిద్యాలయం బ్యాక్‌గ్రౌండ్‌లో భారతదేశంలో జరిగిన కొన్ని చరిత్రలో రాని నిజజీవితాల కథనాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో వస్తున్న చిత్రం గేమ్ ఆఫ్ చేంజ్. జాతీయ, అంతర్జాతీయ నటి నటులతో సిద్దార్థ్ రాజశేఖర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మలయాళ దర్శకుడు సిధిన్ దర్శకత్వంలో సిద్దార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా నిర్మించిన అంతర్జాతీయ చిత్రం గేమ్ ఆఫ్ చేంజ్. ఈ చిత్రం ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇక సినిమా మే 14న అన్ని భాషల్లో చాలా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు సిధిన్ మాట్లాడుతూ, ఇక్కడ సాధారణ క్షణాలు అసాధారణమైన జీవన మలుపులుగా మారతాయి. గేమ్ ఆఫ్ చేంజ్ అనే సినిమా ఒక శక్తివంతమైన జీవన విధానాన్ని తీర్చిదిద్దే అస్త్రం వంటిది. సాధారణమైన క్షణాలు అసాధారణమైన మార్పులను రేకెత్తించిన పలు వ్యక్తుల ఆకర్షణీయమైన వ్యక్తిగత నిజ జీవిత కథనాలను మిళితం చేసి రూపొందించిన చిత్రమిది. భారతదేశ చరిత్రలో కుమార గుప్తుడు శా.శ 427లో నిర్మించిన నలందా విశ్వవిద్యాలయం బ్యాక్‌గ్రౌండ్‌లో జరిగిన కొన్ని నిజ జీవితాల కథనాలతో ఈ చిత్రం వుంటుంది అన్నారు. నిర్మాత సిద్దార్థ్ రాజశేఖర్ మాట్లాడుతూ, 2018లో ఇంటర్నెట్ లెఫ్ స్టైల్‌హబ్ ప్రారంభించి, ఇప్పటివరకు 30 వేల మందికి డిజిటల్ కోచింగ్ ఇచ్చాను. నేను ఇంగ్లీష్‌లో రాసిన యు కెన్ కోచ్ అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా అమ్మకాలు జరిగాయి.



ప్రస్తుతం సినిమారంగంపై వున్న మక్కువతో ఈరోజు నిర్మాతగా, నటుడిగా గేమ్ ఆఫ్ చేంజ్ చిత్రంతో మీ ముందుకు వచ్చాను అన్నారు. మరో నిర్మాత మీనా చాబ్రియా మాట్లాడుతూ, ఇండియాలో ఇప్పటివరకు ఎవరూ చేయని సాహసం చేసాం. ఇటీవల సెన్సేషన్ క్రియేట్ చేసిన చావా సినిమా కథ గురించి మన భారతీయులకు, పైగా శంభాజీ మహారాజ్ గురించి మరాటి వారికీ కూడా తెలియని కథ అది. అలాంటి కథను ప్రజల ముందుకు తీసుకువచ్చారు. సినిమా చూసిన ప్రతీ భారతీయుడికీ రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వయోబేధం లేకుండా చిన్నారుల నుండి వృద్ధుల వరకు దేశభక్తి ఉప్పొంగింది. అదే విధంగా మా గేమ్ ఆఫ్ చేంజ్ చిత్ర కథ కూడా ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్‌పై రాలేదు. మే 14న ప్రపంచ వ్యాప్తంగా ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం అన్నారు. నటినటులు: బ్లైర్ సింగర్, సిద్దార్థ్ రాజశేఖర్, సురేంద్రన్ జయ శేఖర్, దినాజ్ వేర్వాట్వాల, ఆదిత్య, సోనియాశర్మ, గీతా మిక్కిలినేని,హరీష్, ప్రియాదావే, కుషాల్ కులకర్ణి, దేవినా రావు, విశాల్ సైని, డాక్టర్ ప్రభాకర్‌రాజు, వినీతసిద్దార్థ్ తదితరులు. దర్శకత్వం: సిధిన్, నిర్మాతలు: సిద్దార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా.

## మోడలింగ్‌తో కావ్య థాపర్ కెరీర్ స్టార్ట్!

కావ్య థాపర్.. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఈ చిన్నది. కావ్య ప్రధానంగా తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో నటిస్తుంది. 2013లో తత్కాల్ అనే హిందీ లఘు చిత్రంతో తన కెరీర్ ప్రారంభించింది. ఆ తర్వాత పతంజలి, మేక్‌మైట్రిప్, కోహినూర్ వంటి పలు ప్రకటనల్లో నటించింది. 2018లో ఈ మాయ పేరేమిటో చిత్రంతో తెలుగు సినిమా రంగంలో అడుగుపెట్టింది, ఇది ఆమె తొలి తెలుగు చిత్రం. ఆతర్వాత 2019లో మార్కెట్ రాజా ఎంబిబిఎస్ అనే తమిళ చిత్రంతో తమిళ సినిమా రంగంలోకి ప్రవేశించింది. వీటితోపాటు 2022లో మిడిల్ క్లాస్ లవ్ చిత్రంతో హిందీ సినిమాల్లో అడుగుపెట్టింది. ఏక్ మినీ కథ (2021), పిచ్చైక్కారన్ 2 (2023), ఈగల్ (2024), విశ్వం (2024) సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఈగల్ ఆమె అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇటీవల రామ్ పోతినేని హీరోగా నటించిన డబుల్ ఇస్మార్ట్ సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా కావ్య థాపర్‌కు సక్సెస్ అందించలేదు. అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ ఈ చిన్నదానికి సాలిడ్ హిట్ మాత్రం దక్కడం లేదు. డబుల్ ఇస్మార్ట్ సినిమా తర్వాత కావ్యకు అనుకున్నంతగా ఆఫర్స్ రావడం లేదు. ఈ సినిమా కూడా కావ్య థాపర్‌కు సక్సెస్ అందించలేదు. అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ ఈ చిన్నదానికి సాలిడ్ హిట్ మాత్రం దక్కడం లేదు. డబుల్ ఇస్మార్ట్ సినిమా తర్వాత కావ్యకు అనుకున్నంతగా ఆఫర్స్ రావడం లేదు. దాంతో ఈ చిన్నది సోషల్ మీడియాలో ఫుల్ బిజీగా ఉంది. ఈ బ్యూటీ రెగ్యులర్‌గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం విదేశాల్లో విహరిస్తోంది ఈ చిన్నది. అక్కడి నుంచి కొన్ని ఫోటోలు షేర్ చేసింది ఈ భామ.



## ‘త్రీ రోజెస్’ రాశీ సింగ్ గ్లింప్స్ రిలీజ్

ఈషా రెబ్బా, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ త్రీ రోజెస్. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్‌కు ఇప్పుడు సీజన్ 2 రాబోతోంది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. త్రీ రోజెస్ సీజన్ 2 నుంచి హీరోయిన్ రాశీ సింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌లో రాశీ సింగ్ క్యారెక్టర్‌ను ట్రెడిషనల్‌గా పరిచయం చేస్తూ, మోడరన్‌గా టర్న్ అయిన ట్విస్ట్ చూపించారు. ఆమె ఎందుకు ట్రెడిషనల్ నుంచి మోడరన్‌గా మారింది అనేది గ్లింప్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది. త్రీ రోజెస్ సీజన్ 2 లో ఒక రోజ్‌గా రాశీ సింగ్ క్యారెక్టర్ ఆకట్టుకోనుంది. ఇప్పటికే త్రీ రోజెస్ సీజన్ 2 నుంచి రిలీజ్ చేసిన హీరోయిన్ ఈషా రెబ్బా, కుషితకల్లపు గ్లింప్స్‌లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. త్వరలోనే ఈ వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది.



# ఇంటి అలంకరణలో ఫ్లవర్‌వాజు



ఇంటి అలంకరణలో భాగంగా అక్కడక్కడా ఫ్లవర్‌వాజ్‌లు అవర్చడం మామూలే. కొంతమంది వీటిలో కృత్రిమ పూలకు బదులు అసలైన పూలనే ఉంచుతుంటారు. కానీ, వీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అవి తక్కువ సమయంలోనే వాడిపోతాయి. అలా జరగకుండ ఆ ఫ్లవర్‌వాజుల్లో అమర్చిన పూలు రోజంతా తాజాగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

రోజుపూలు కొనడానికి వెళ్లినప్పుడు పూల రెక్కలన్నీ ఒక్కచోట కలిసే కాడ భాగాన్ని పరిశీలించండి. దాన్ని నొక్కినప్పుడు అది మరీ మెత్తగా అనిపిస్తే ఆ పూలు పాతవని అర్థం. అలాకాకుండా కాస్త మెత్తగా, కాస్త గట్టిగా అనిపిస్తే అవి తాజా పూలని అర్థం. అలాంటి వాటిని ఎంచుకుంటే రెండు రోజుల పాటు తాజాగా ఉంటాయి.

అలాగే ఎక్కువ రకాల పువ్వులు తీసుకున్నప్పుడు వేటికవి విడివిడిగా ప్యాక్ చేయించుకోవాలి. అలా చేస్తే ఇంటికి చేరుకున్న తర్వాత వాటిని సులువుగా విడదీసుకోవచ్చు. పువ్వులు కూడా నలిగిపోకుండా ఉంటాయి. ఫ్లవర్ వాజు నీళ్లలో ఉంచే పువ్వులకు కాండం ఎంతవరకు నీటిలో మునుగుతుందో చూసుకుని దాని కింద ఉండే ఆకులు తీసేయాలి. ఇలా చేయడం వల్ల నీళ్లు శుభ్రంగా ఉంటాయి. అలాగే పువ్వులూ ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి.

మీరు తీసుకువచ్చిన పువ్వుల కాండాలు కూడా సరిచూసుకోవాలి. అవి విరిగి ఉన్నా.. లేక చివర్లు ఎండిపోయినట్టు ఉన్నా.. వాటిని కట్ చేయాలి. కత్తిరించిన తర్వాత వాటిని ఫ్లవర్‌వాజ్‌లో పెట్టేంత వరకూ నీటిలో ఉంచాలి. ఫ్లవర్‌వాజ్‌లు కూడా శుభ్రంగా ఉంటేనే పూలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి. అందుకే సబ్బు, వేడినీళ్లను ఉపయోగించి ఫ్లవర్‌వాజ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

వాడిపోయిన పేరేకల్ని తొలగించాలి. ఫ్లవర్‌వాజ్‌లో ఉండే నీళ్లు ఏ మాత్రం జిగురుగా అనిపించినా వెంటనే మార్చేయాలి.

నేరుగా ఎండ పడే చోట అధిక ఉష్ణోగ్రత ఉండే చోట ఫ్లవర్‌వాజులు ఉంచినా అందులో అమర్చిన పూలు త్వరగా వాడిపోతాయి. కాబట్టి చల్లటి ప్రదేశాల్లోనే ఫ్లవర్‌వాజులు ఏర్పాటు చేయాలి. □

# ధైర్యసాహసాల సివంగులు


ఇండో-పాకిస్థాన్ యుద్ధాలు (1947, 1965), బంగ్లాదేశ్ విమోచన, కార్గిల్, 2016 సర్జికల్ స్ట్రైక్, బాలాకోట్ వైమానికదాడి.. ఇలా ఇప్పటివరకూ మనకూ పాకిస్థాన్‌కూ మధ్య ఎన్నో దాడులు, ఎదురుదాడులు జరిగాయి. ఏ యుద్ధం చూసినా.. మహిళలు ప్రాథమిక, సంస్థాగత పాత్రలకే పరిమితం అయ్యారు. కానీ ఇప్పుడు జరిగిన ఆపరేషన్ సిందూర్‌ని ముందుండి నడిపించారు **కల్నల్ సోఫియా, కమాండర్ వ్యోమిక**. అంతేకాదు, మిలిటరీ ఆపరేషన్‌లో జరిగిన విషయాల్ని మీడియా ముందూ వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడిలో భర్తల్ని కోల్పోయిన మహిలల కన్నీటిని తుడుస్తూ మహిళా మేజర్ల ప్రాతినిధ్యంలో ఈ యుద్ధం జరిగింది.

'ఆపరేషన్ సిందూర్'.. సైనిక చర్య మాత్రమే కాదు. త్రివిధ దళాల్లో మమిళా శక్తిని చాటిచెప్పే చరిత్రాత్మక ఘట్టం కూడా. ఈ అవకాశం ఎవరో ఇచ్చిందో.. అనుకోకుండా వచ్చిందో కాదు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, కల్నల్ సోఫియా ఖురేషీల ధైర్యసాహసాలకు కట్టిన పట్టం. దేశ రక్షణలో లింగ భేదాన్ని చెరిపేసి.. అత్యవసర వేళల్లో ఆదిపరాశక్తులుగా మారి ఉగ్రవాదుల్ని మట్టుపెట్టారు ఈ అధికారిణులు.

## న్యాయం కోసమే ఈ యుద్ధం..



'పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది కుటుంబాలకు న్యాయం చేయాలనే ఈ యుద్ధం. పాకిస్థాన్ ఎలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడినా ఊరుకోం. అన్నింటికీ సిద్ధంగా, సమర్థంగానే ఉన్నాం' అని మీడియా ముందు భారతదేశ శక్తిసామర్థ్యాల గురించి ధైర్యంగా చెప్పారు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్. ఈమెకు చిన్నప్పట్నుంచీ విమానం అంటే ఇష్టం. ఆ ఇష్టంతోనే వైమానిక దళంలో చేరాలనుకున్నారు. తన కుటుంబం నుంచి సాయుధ దళాల్లో చేరిన మొదటి వ్యక్తి వ్యోమిక. ఇంజినీరింగ్ చదువుకున్నారు. ఎన్‌సిసి శిక్షణ అనంతరం 2019లో భారత వైమానిక దళంలో హెలికాప్టర్ పైలట్‌గా నియమితులయ్యారు. అత్యంత ప్రతికూల భూభాగాల్లో చేతక్, చీతా వంటి హెలికాప్టర్లు నడిపిన మహిళగా గుర్తింపు పొందారు. 2500 గంటలకు పైగా యుద్ధ విమానాల్ని నడిపిన అనుభవం ఉందీమెకు. అరుణాచల్ ప్రదేశ్ లాంటి కఠినమైన వాతావరణం, ఎత్తైన ప్రదేశాల్లో విమానాలను నావిగేట్ చేస్తూ.. కీలకమైన రెస్క్యూ మిషన్లకు నాయకత్వం వహించారు. హిమాచల్ ప్రదేశ్‌లో 21,650 అడుగుల ఎత్తు ఉన్న మణిరంగ్ పర్వతంపై 2021 జరిగిన మహిళల యాత్రలో ఈమె పాల్గొన్నారు. ఇవన్నీ ఆమె ధైర్యసాహసాలకు ప్రతీకే. ఈ నేర్పే ఆమెను ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించేలా చేసింది.



## పాక్ పౌరులు మా టార్గెట్ కాదు...

' పాకిస్థాన్, పిఒకెలో.. లష్కరే శిక్షణా కేంద్రం, జైషే ఆయుధగారం, హిజ్బుల్, బంకర్లు, మసూద్ ఇల్లు.. ఇలా 9 ఉగ్రవాద స్థావరాలపై నిఘా పెట్టి దాడి చేశాం. పహల్గాం దాడికి సమాధానం ఇది. పాక్ పౌరులకు ప్రాణహాని తలపెట్టడం మా లక్ష్యం కాదంటూ మిలిటరీ ఆపరేషన్ వీడియోల్ని మీడియాకు చూపించిన కల్నల్ సోఫియా ఖురేషిది గుజరాత్. 1990ల్లో సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కార్ప్స్‌కు చెందిన ఆఫీసర్ ఈమె. బయోకెమిస్ట్రీలో పిజి చేశారు. ఐక్యరాజ్యసమితి పిస్ మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విదులు నిర్వర్తించారు. ఆమెలోని నాయకత్వ లక్షణాలు, కీలక సమయాల్లో ప్రదర్శించే ఓర్పు, నేర్పుల వల్లే సోఫియా ఎంపిక జరిగింది. ఆమె ఓ పిస్ కీపర్ అంటూ అప్పట్లో జనరల్ బిపిన్ రావత్ ఈమెను ప్రశంసించారు. అంతేకాదు, 2016 పుణెలో 'ఎక్సర్‌సైజ్ 18' పేరిట జరిగిన మల్టీ నేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌లో భారత్ తరపున నాయకత్వ బాధ్యతలు చేపట్టారీమె. దీనిలో 18 దేశాలు పాల్గొంటే భారత బృందానికి మాత్రమే మహిళా నాయకురాలు ఉన్నది. వ్యూహాత్మక ఆలోచనలు, ప్రణాళికా రచనలో ఈమె దిట్ట. ఇవే కల్నల్ సోఫియాకు ఈ అవకాశం తెచ్చిపెట్టాయి. ఎన్నడూ లేనివిధంగా తొలిసారి దేశచరిత్రలో యుద్ధానికి ప్రాతినిధ్యం వహించిన ఈ మేజర్ల ధైర్యసాహసాలు రాబోయే తరానికి స్ఫూర్తిదాయకం. □

# కంద దోశ



మినప్పిండి, బియ్యపిండి దోశలు సాధారణం. ఎప్పుడూ అదే అంటే విసుగొస్తుందని రవ్వ దోశ, టొమాటో దోశ. అంటూ చాలా రకాలు చేయడం తెలిసిందే. అంతకంటే ఇంకొంచెం ప్రత్యేకంగా ఉండాలని. కంద దోశ వేసుకొంటారు కొందరు. ఈ దుంపలో దురద గుణాలుంటాయిగా అనుకుంటున్నారు. మరేం ఫరవాలేదు. కొంచెం మందంగా ఉండే ఈ దుంపను చక్కగా పీల్ చేసి ఉప్పునీళ్లలో నానబెట్టాలి. కొంచెం సేపు గనుక అలా ఉంచా మంటే. ఇక ఏ ఇబ్బందీ ఉండదు. ఇంతకీ దీంతో దోశ ఎలా చేయాలంటే.. దుంపను నీళ్లలోంచి తీసి ఇంకోసారి కడిగి, ముక్కలుగా తరగాలి. మూడు గంటలు నానబెట్టిన పెసరపప్పులో నీళ్లు వంపేసి.. మిక్సీ జార్‌లో వేయాలి. దానికి కంద ముక్కలు అంగుళం సైజు అల్లం ముక్క ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు కొన్ని నీళ్లు జోడించి గ్రైండ్ చేస్తే పిండి సిద్ధమై పోతుంది. ఈ మిశ్రమానికి కాస్త బియ్యప్పిండి జోడిస్తే దోశలు మరింత క్రిస్పీగా వస్తాయి. పల్లీ చట్నీతో హ్యాపీగా తరుగు వేసి..దిబ్బరొట్టె కూడా చేసుకోవచ్చు. ఈ వెరైటీ దోశ మీకూ నచ్చుతుంది. ఒకసారి ప్రయత్నించి చూడండి. □



# మొటిమలను తగ్గించే కలబంద !

చర్మానికి చల్లదనాన్ని అందించడమే కాదు. మోముపై ఏర్పడిన మొటిమలు, మచ్చల్ని తగ్గించడంలోనూ కలబందను మించిన ఔషధం మరొకటి లేదని చెప్పడంలో సందేహం లేదు అందుకే దీన్ని వివిధ రకాల సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో కలబందతో పాటు ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ ఎలా తయారు చేసుకోవాలంటే... మూడు టేబుల్‌స్పూన్ల కలబంద గుజ్జుకు రెండు టేబుల్‌స్పూన్ల పసుపు, రెండు టేబుల్ స్పూన్ల రోజ్‌వాటర్ కలిపి మిక్సీ పట్టుకోవాలి. ఇందులో టేబుల్‌స్పూన్ శెనగ పిండి వేసి మరోసారి మిక్సీ పట్టుకోవాలి. అవసరమైతే ఇందులో మరికొంత రోజ్‌వాటర్ లేదంటే శనగపిండి వేసుకొని పేస్ట్‌లాగా చేసుకోవలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని 20 నిమిషాల పాటు ఉంచి ఆపై గోరువెచ్చటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల మొటిమల సమస్యను ఇట్టే తగ్గించు కోవచ్చంటున్నారు నిపుణులు. □



# ఈ కాలంలో దుమ్ము బాధా?

దుమ్ము చేరడం సహజం. రోజూ శుభ్రం చేసినప్పటికీ ఆయా వస్తువులపై, ఇంటి మూలల్లో కంటికి కనిపించని దుమ్ము కణాలు ఉండిపోతాయి. అలాగని ప్రతి వస్తువునూ తుడిచే సమయం, ఓపిక రోజూ ఉండకపో వచ్చు. అందుకే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే ఈ కాలంలో ఇంట్లో దుమ్ము బెడదను తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు అవేంటో తెలుసుకుందాం..

ఇంటిని శుభ్రం చేయడానికి చాలామంది చీపురును వాడుతుంటారు. అయితే దీనివల్ల మన కంటికి కనిపించని దుమ్ము కణాలు నేల పైనే ఉండిపోతాయి. అదే వ్యాక్యూమ్ క్లీనర్‌ని ఉపయోగిస్తే ఇంటి మూలమూలల నుంచి దుమ్మును తొలగించవచ్చు. రోజూ పొడి వ్యాక్యూమ్ క్లీనర్స్‌తో శుభ్రం చేస్తూనే.. వారానికోసారి లేదా రెండుసార్లు వ్యాక్యూమ్ క్లీనర్‌తో క్లీన్ చేస్తే ఫలితం ఉంటుంది. . చెప్పులు, షూస్.. వంటివి బయటి నుంచి ఎక్కువ దుమ్మును మోసుకొస్తాయి. కాబట్టి వాటిని ఇంట్లో దాకా తీసుకురాకుండా.. బయటే వదిలేయాలి. అలాగే ముఖద్వారం లోపలే కాకుండా.. బయట కూడా ఒక మృదువైన ఫ్యాబ్రిక్‌తో తయారుచేసిన డోర్‌మ్యాట్ వేస్తే.. మన పాదాలపై ఉన్న కంటికి కనిపించని దుమ్మును అది ఆకర్షిస్తుంది. తద్వారా ఇంట్లోకి దుమ్ము చేరకుండా జాగ్రత్తపడచ్చు.

✦ కొంతమందికి ఇంట్లో కూడా చెప్పులు వేసుకునే అలవాటుంటుంది. అయితే వాటిని బయటికి తీసుకెళ్లకుండా ఇంట్లోనే వాడుకోవాలి. అలాగే ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకోవడమూ ముఖ్యమే.

✦ ఈ కాలంలో సన్నటి దుమ్ము రేణువులు బెడ్‌షీట్స్, సోఫా కవర్స్, కర్టెన్లపై చేరుతుంటాయి. అందుకే వాటిని కాస్త గట్టిగా దులిపితే దుమ్ము లేవడం గమనిస్తుంటాం. అందుకే వీటిని వారానికోసారి మార్చి శుభ్రం చేయడం మంచిది.

✦ బయటి నుంచి వచ్చే దుమ్ము వల్ల కిటికీ గ్రిల్స్/బ్లైండ్స్ త్వరగా మురికిగా మారతాయి. ఇలాంటప్పుడు డిటర్జెంట్ నీళ్లు లేదా నీళ్లలో ముంచి పిండిన సాక్స్‌తో వాటిని శుభ్రం చేస్తే.. ఇంట్లో దుమ్ము బెడద ఉండదు. ఇల్లు కూడా నీట్‌గా కనిపిస్తుంది. సాక్స్‌కు ప్రత్యామ్నాయంగా విభిన్న లేయర్లతో కూడాన బ్లైండ్ క్లీనర్స్ కూడా ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్నాయి. ✦ డోర్‌మ్యాట్స్, కార్పెట్స్‌లో కంటికి కనిపించని దుమ్ము ఎక్కువగా చేరుతుంది. వాటిని వ్యాక్యూమ్ క్లీనర్‌తో తరచూ శుభ్రం చేస్తూనే.. వారం లేదా పదిహేను రోజులకోసారి మార్చి శుభ్రం చేయడం మంచిది.


✦ ఇంట్లో కొన్ని రకాల సామగ్రిపై పేరుకున్న దుమ్మును తొలగించాలంటే పెద్ద పనిలా అని పిస్తుంటుంది. శరీరం బద్ధకిస్తుంది.



ఇలాంటప్పుడు 'లింట్ రోలర్' ఉపయోగిస్తే పని సులభంగా పూర్తి అవుతుంది. పేరుకు తగ్గట్లే రోలర్‌లా ఉండే దీంతో ఆయా వస్తువుల ఉపరితలంపై రోల్ చేస్తే చాలు. వాటిపై ఉన్న దుమ్మును కూడా ఇది ఆకర్షించుకొని వాటిని మెరిపిస్తుంది.

✦ ఇంట్లో షెల్ఫులు/అరల్లో ఎక్కువగా దుమ్ము చేరుతుంటుంది. పైగా ఆ దుమ్ము ఓ పట్టాన వదలదు కూడా! ఇలాంటప్పుడు మృదువుగా ఉండే క్లీనింగ్ డస్టర్‌ని ఉపయోగిస్తే పని సులువవుతుంది.

✦ పెంపుడు జంతువుల చర్మంపై ఉండే



వెంట్రుకల వల్ల కూడా ఇంట్లోకి దుమ్ము చేరుతుంది. అలా జరగకూడదంటే. వాటికి రోజూ స్నానం చేయించడం, అవి తిరిగే, పడుకునే ప్రదేశాల్ని నీట్‌గా ఉంచడం మంచిది. తద్వారా వాటి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. ✦ ఇష్టంతోనో లేదంటే గృహాలంకరణలో భాగంగానో.. ఈ మధ్య చాలామంది ఇంట్లో వివిధ రకాల ఇండోర్ మొక్కల్ని ఏర్పాటుచేసుకుంటున్నారు. అయితే వీటిలో కొన్ని దుమ్మును శోషిస్తాయంటున్నారు నిపుణులు. కలబంద, స్నేక్ ప్లాంట్, బోస్టన్ ఫెర్న్, పీస్ లిల్లీ, రబ్బర్ ప్లాంట్.. వంటివి అందులో కొన్ని! వీటిని ఇంట్లో ఏర్పాటు చేసుకుంటే ఇటు అలంకరణ వస్తువుగా అందాన్నిస్తుంది. అటు ఇంట్లో దుమ్ము లేకుండా ఉంటుంది. □

# ఒకటే పరికరం..ఎన్నో పనులు !



సాగి గిన్నెలో కంటే కాడగిన్నెలో చాయ్ పెడితే పట్టుకోవడానికి సౌకర్యంగా ఉంటుంది. ఇప్పుడు అంతకంటే సౌఖ్యమైన సాధనం వచ్చింది. అదే 'మల్టీకుక్ కెటిల్ విత్ స్టీమర్. ఒక పెద్ద కప్పులా కనిపించే ఈ 600 వాట్స్ పరికరంలో ఎన్ని సదుపాయాలు ఉన్నాయంటే. పాలు కావచ్చు. కాఫీ, టీ చేయొచ్చు. గుడ్లు, కూరగాయలు, చేమ దుంపలు లాంటివేమైనా ఉడికించవచ్చు. ఇంకా విశేషమేమంటే. ఇందులో ఇడ్లీలు, మోస్ కూడా చేసేయొచ్చు. వేగంగా ఉడుకుతాయి కనుక సమయం ఆదా అవుతుంది. □

# అమ్మాయిలు సన్నబడాలంటే ..

బరువు పెరుగుతున్నామనుకుని తిండిమానేయడం, అసలు ఆరోగ్యాన్ని పట్టించు కోకుండా కనిపించిందల్లా తినడం రెండూ పొరపాటే. అమ్మాయిలు సాధారణంగా పని ఒత్తిడిలో చేసే పనులే ఇవి. నిజానికి సన్నబడాలంటే సమతులాహారం తీసుకోవాలి. సన్నబడాలనుకున్నప్పుడు అసలు కొవ్వుల అవసరమే ఉండదనుకోవడం, అవి లేని పదార్థాలను మాత్రమే తీసుకోవడం పొరబాటు. శరీర వ్యవస్థలు, హార్మోన్ల పనితీరు సరిగ్గా సాగిపోవాలంటే డైటరీ ఫ్యాట్‌ల అవసరం ఎక్కువే. లేదంటే నెలసరి ఇబ్బందులు తప్పకపోవచ్చు. పైగా ఆకలి అదుపు చేసుకోవలేక పోవచ్చు. మేలైన కొవ్వులు అందేలా గుడ్లు, పప్పుధాన్యాలు, అవి సెగింజలు, చేపలు వంటివి తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. మనం తీసుకునే ఆహారం ద్వారా అందే పిండిపదార్థాలు గ్లూకోజ్‌గా మారతాయి. ఇవి చక్కెరల్లా పని చేయడం వల్ల బరువూ పెరుగుతారు. ఆ పరిస్థితి ఎదురు కాకుండా ఉండా లంటే సంక్లిష్ట పిండి పదార్థాలున్న ఆహారాన్ని ఎంచుకోవాలి. బదులుగా సాధారణ బియ్యాన్ని తగ్గిస్తూనే, బ్రౌన్‌రైస్‌ని ఎంచుకోవాలి.



రాగులు, కొర్రలు, జొన్నలు వంటి చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాటివల్ల తగినంత పీచూ అంది జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆకు కూరలు, కాయగూరలను సమ ప్రాధాన్యంతో ఎప్పుడో ఒకసారి కాకుండా తీసుకునే ప్రతి భోజనంలో భాగం చేసుకోవాలి. కాయగూరల్లో ఉండే విటమిన్లు శరీరానికి మేలు చేయడమే కాదు. పీచునూ అందిస్తాయి. పొట్ట నిండేలా చేసి, ఆకలినీ తగ్గిస్తాయి. అందుకే కీరదోస, క్యారెట్, టొమాటో, ఉల్లిపాయ, బీట్‌రూట్, క్యాబేజీలతో పాటు ఆకుపచ్చని ఆకుకూరలు పాలకూర, మెంతి కూర, తోటకూర, కరివేపాకు వంటి వాటికి తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలి. □

# పుష్పక విమానం విశిష్టత

పుష్పక విమానం అంటే ఇంద్రాది దేవతలు ఆకాశంలో విహరించేది అని మన అందరికీ తెలుసు. అయితే ఈ పుష్పక విమానం గురించి దీని విశిష్టత గురించి తెలుసుకుందాం. ఈ పుష్పక విమానం మొదట్లో కుబేరుడు వద్ద ఉండేది. లంకలో మొదట్లో నివసించిన కుబేరుడిని చూసి ఓర్వలేక రాక్షస జాతి నిలయం లంకా నగరం అధినేత రావణాసురుడు లంక నుండి కుబేరుణ్ణి వెళ్లగొట్టాడు. అంతే గాకుండా అతని వద్ద వున్న పుష్పక విమానం సైతం బలవంతంగా తీసుకున్నాడు. అప్పుడు పుష్పక విమానం రావణుడికి శాపం పెట్టిందట. రావణా! విర్ర వీగకు ఈ వాహనం కుబేరుడుది అతని వద్ద బలవంతంగా తీసుకున్నావు నాలుగు అక్షరాల కుబేరుడు కరుణామయుడు అదే నాలుగు అక్షరాల శ్రీ రాముడి చేతిలో నీ చావు తప్పదు. జాగ్రత్త అని సాక్షాత్తు పుష్పక విమానం అయినా నా కాలి కింద నలిగి పోవాల్సిందే. అన్నాడు రావణుడు.. ఆలా కొద్దిరోజులకు రావణ సంహారంలో శ్రీరాముడు చేతిలో కుప్ప కూలి పోయాడు దుష్టుడైన రావణుడు. అనంతరం శ్రీ రామ పట్టాభిషేకం తదుపరి విభీషణుడు సహాయంతో తిరిగి పుష్పక విమానం కుబేరుడికే అప్పగించాడు శ్రీ రాముడు. ఈ పుష్పక విమానం దేవతలకే పరిమితం అయింది. □



ఆధ్యాత్మికం

# ఈ డ్రింక్‌తో వేసవి వేడిని తరిమేయండి !

ఎండలు మండిపోతున్నాయ్ ! ఈ తరుణంలో వేడిని తరిమికొట్టి, శరీరానికి చలువనిచ్చే ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోవడం మామూలే. మరి, డ్రింక్స్ విషయానికొస్తే.. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకురసం.. వంటివి తీసుకుంటుంటాం. అయితే వీటితో పాటు ఇంట్లోనే సులభంగా తయారుచేసుకోగలిగే, తక్షణమే శరీరానికి చల్లదనాన్ని అందించే పుదీనా జల్ జీరా డ్రింక్'ని మీరెప్పుడైనా ట్రై చేశారా? మరింకెందుకాలస్యం.. దాన్నెలా తయారుచేయాలో తెలుసుకుందాం..

**కావాల్సినవి :** పుదీనా ఆకులు-అర కప్పు, నిమ్మరసం-6 టేబుల్ స్పూన్లు, నల్ల ఉప్పు-2 టీ స్పూన్లు, నీళ్లు-8 కప్పులు, జీలకర్ర-2 టేబుల్ స్పూన్లు , కొత్తిమీర - అర కప్పు, అల్లం తురుము- 2 టేబుల్ స్పూన్లు, చక్కెర-4 టేబుల్ స్పూన్లు, చింత పండు గుజ్జు - 2 టేబుల్ స్పూన్లు , ఉప్పు- టీ స్పూన్, ఐసు ముక్కలు - సర్వింగ్స్‌కి సరిపడా

**తయారీ :** ముందుగా పుదీనా, కొత్తిమీర శుభ్రంగా కడిగి, సన్నగా తరుక్కోవాలి. వీటన్నింటినీ ఒక బౌల్‌లోకి తీసుకొని, అందులో చింతపండు గుజ్జు, వేయించిన జీలకర్ర, అల్లం తురుము వేసి బాగా కలుపుకోవాలి. వీటిని మిక్సీ జార్‌లోకి తీసుకొని, అందులో ఉప్పు, నల్ల ఉప్పు, చక్కెర, నిమ్మరసం, నాలుగు కప్పుల నీళ్లు పోసి పదార్థాలన్నీ బాగా బ్లెండ్ అయ్యేలా.. జ్యూస్ లాగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమానినన ఒక బౌల్‌లో వడకట్టుకొని మిగిలిన పిప్పిని పడేయాలి. ఈ రసంలో మిగతా నాలుగు కప్పుల నీళ్లు కూడా పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసుల్లో పోసుకొని.. ఐస్ క్యూబ్స్ వేసి, నిమ్మచెక్కలు-పుదీనాతో గార్నిష్ చేసుకొని, సర్వ్ చేస్తే ఎంతో రుచిగా, చల్లచల్లగా ఉండే పుదీనా జల్ జీరా డ్రింక్ సిద్ధం. □





# టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్‌లో జడేజా

## సెకండ్ ప్లేస్‌లో బంగ్లా క్రికెటర్ మిరాజ్



**న్యూఢిల్లీ:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్ రౌండర్స్ జాబితాలో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏకంగా 400 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అయితే బంగ్లాదేశ్ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో తాజా ర్యాంకింగ్స్‌ను పొందుపర్చారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో మిరాజ్ 116 పరుగులు రాబట్టడమేగాక, 15 వికెట్లు తీశాడు. దాంతో ఆల్ రౌండర్స్ జాబితాలో అతను ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. అంతేగాక రెండో టెస్టులో సెంచరీ ద్వారా మిరాజ్ ఐసీసీ బ్యాటర్స్ జాబితాలో కూడా 8 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జోయ్ రూట్ ఈసారి కూడా టాప్ 20లో చోటు దక్కించుకోలేకపోయారు. అయితే జింబాబ్వే లెఫ్ట్ హ్యాండర్ సీన్ విలియమ్స్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 19వ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన షద్మాన్ ఇస్లామ్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకుని 60వ స్థానానికి దూసుకెళ్లాడు. మిరాజ్ టెస్టు బౌలర్స్ విభాగంలో కూడా రెండు స్థానాలు మెరుపర్చుకుని 24వ స్థానానికి వెళ్లాడు.

# మహిళల ఫుట్‌బాల్ వరల్డ్ కప్

## జూన్ 24 నుండి జూలై 25 వరకు



**న్యూఢిల్లీ:** లాటిన్ అమెరికాలో జరిగే మొదటి ఎడిషన్ అయిన 2027 మహిళల ప్రపంచ కప్‌లో మ్యాచ్‌లను నిర్వహించడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బ్రెజిల్‌లోని ఎనిమిది వేదికలలో మరకానా స్టేడియం ఒకటి అని సాకర్ అంతర్జాతీయ పాలక సంస్థ ఫిఫా గురువారం తేదీలను ప్రకటించింది. దక్షిణ అమెరికాలో తొలిసారిగా జరుగుతున్న మహిళల ప్రపంచ కప్‌లో వివిధ దేశాల జట్లు పాల్గొంటాయి. జూన్ 24 నుండి జూలై 25, 2027 మధ్య జరిగే ఈ టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొంటాయి. రియో డి జెనీరోలోని ఐకానిక్ వేదికతో పాటు, పోటీలోని 64 మ్యాచ్‌లు బెలో హారిజాంటే (మినీరావ్ స్టేడియం), బ్రెసిలియా (నేషనల్ స్టేడియం), ఫోర్టలేజా (కాస్టెలావో అరేనా), పోర్టో అలెగ్రే (బైరారియో స్టేడియం), రెసిఫ్ (పెర్నాంబుకో అరేనా), సాల్వాబుకో అరేనాలో జరుగుతాయి. (ఇటాక్వెరా అరేనా)లో జరగనున్నాయి. ఫిఫా మహిళల ప్రపంచ కప్ 2027 ఒక చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుంది, ఈ టోర్నమెంట్ మొదటిసారి దక్షిణ అమెరికాకు వెళుతుంది" అని ఫిఫా ప్రధాన కార్యదర్శి మాటియాస్ గ్రాఫ్‌స్ట్రోమ్ అన్నారు. "మహిళల క్రీడ అసాధారణ వేగంతో అభివృద్ధి చెందుతూనే ఉంది మరియు టోర్నమెంట్‌ను బ్రెజిల్‌కు తీసుకురావడం ఖండం అంతటా మరియు అంతకు మించి కొత్త తరానికి స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. కాగా ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ సంయుక్తంగా నిర్వహించిన 2023 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న స్పెయిన్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఉంది.

# వరల్డ్ కప్ ఆర్చరీలో భారత్‌కు రెండు పతకాలు ఖరారు

## 9, 12 స్థానాల్లో ధీరజ్, దీపిక

**న్యూఢిల్లీ:** వరల్డ్ కప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖరారయ్యాయి. షాంఘైలో జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ పురుషుల, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఫలితంగా భారత్ ఖాతాలో కనీసం రెండు స్వర్ణాలు లేదా రెండు రజతాలు చేరనున్నాయి. తెలంగాణకు చెందిన తనిపర్తి చికిత, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్రకు చెందిన మధురలతో కూడిన భారత్ మహిళల కాంపౌండ్ జట్టు, ప్రవీణ్ దేవ్‌తలే, రిషబ్ యాదవ్, అభిషేక్ వర్మలతో కూడిన భారత్ పురుషుల కాంపౌండ్ జట్టు టైటిల్ పోరుకు అర్హత



సాధించాయి. శనివారం భారత్, మెక్సికో జట్లు రెండు స్వర్ణాల కోసం హోరాహోరీగా పోటీ పడనున్నాయి. క్వార్టర్ ఫైనల్లో భారత్ మహిళల జట్టు 232-229 పాయింట్ల తేడాతో అదెల్ జెక్సెన్‌బినోవా, విక్టోరియా లియాన్, రొక్సానా యునోసోవాలతో కూడిన కజకిస్తాన్ జట్టును ఓడిం చింది. సెమీ ఫైనల్లో భారత్ జట్టు 232-230 పాయింట్లతో ఎల్లా గిబ్సన్, ఇసబెల్లా కార్పెంటర్, లేలా అనిసన్‌లతో కూడిన బ్రిటన్ జట్టుపై గెలుపుసాధించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ పురుషుల జట్టు 239-232 పాయింట్ల తేడాతో అజయ్ స్కాట్, ఆడమ్ కార్పెంటర్, ల్యూక్ డేవిస్‌లతో కూడిన బ్రిటన్ జట్టుపై నెగ్గింది. సెమీ ఫైనల్లో భారతబృందం 232-231 పాయింట్ల తేడాతో మథియాస్ పుల్లర్టన్, మారిటన్ డామ్స్‌బో, నిక్లాస్ బ్రెడాల్‌తో కూడి డెన్మార్క్ జట్టును ఓడించింది. ఇక రికర్వ్ విభాగం పురుషుల క్వాలిఫయింగ్‌లో భారత్ ఆర్చర్లు అంతగా ఆకట్టుకోలేకపోయారు. ఓవరాల్‌గా 1995 పాయింట్లు స్కోరు చేసి 7వ స్థానంలో నిలిచిన భారత్‌కు తొలి రౌండ్‌లో బై లభించింది. కాగా మహిళల క్వాలిఫయింగ్‌లో భారత్ స్టార్ దీపిక కుమారి 655 పాయింట్లు సాధించి 12వ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే 652 పాయింట్లలో అంకిత 17వ, 642 పాయింట్లతో అన్షిక 29వ, 637 పాయింట్లతో సిమ్రన్‌జిత్ కౌర్ 39వ స్థానంలో నిలిచారు. మొత్తంగా 1949 పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచి తొలి రౌండ్‌లో బై దక్కింది.



# టెర్రర్ అటాక్ ఎఫెక్ట్: ఆసియా కప్ క్యాన్సిల్?

## భారత్‌పాక్ మ్యాచ్‌లు రద్దు!

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి వల్ల భారత్ పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలపై ఎఫెక్ట్ పడనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జరగాల్సిన 2025 ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ పాల్గొనడంపై గందరగోళం నెలకొంది. ఒకవేళ భారత్ లేకపోతే టోర్నీకి ఆదరణే ఉండదు. స్పాన్సర్లు కూడా ఆసక్తి కనబర్చరు. అందుకే ప్రస్తుత పరిస్థితుల కారణంగా టోర్నీ వాయిదా పడే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ఆసియా కప్ సెప్టెంబర్‌లో జరగనుంది. ఈసారి టోర్నీకి ఆతిథ్య హక్కులు భారత్ వద్దే ఉన్నాయి. కానీ, టోర్నీని యూఏఈ లేదా శ్రీలంక వేదికగా నిర్వహించే ఛాన్స్ ఉంది. షెడ్యూల్ కూడా ప్రకటించాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. భారత్ పాకిస్థాన్ మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో టోర్నీ నిర్వహించే అవకాశాలు చాలా తక్కువని భారత్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. కాగా గతంలో ఎప్పుడూ లేనట్లుగా ఈసారి ఈ టోర్నమెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించాలని నిర్ణయించారు.

టోర్నీలో 8 జట్లు టీ20 ఫార్మాట్‌లో తలపడేలా ప్లాన్ చేశారు. కొత్తగా ఒమన్, హాంగ్ కాంగ్ ఆసియా కప్‌లో ఆడనున్నాయి. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, హాంగ్‌కాంగ్ జట్లు పోటీ పడనున్నాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహించేలా ప్లాన్ చేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల టోర్నీ నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది. ఇక బంగ్లా టూర్ కూడా క్యాన్సిల్ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. భారత సీనియర్ పురుషుల జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ టూర్‌లో బంగ్లాతో మూడు వన్డే, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్ పర్యటనకు కూడా భారత్ వెళ్లే అవకాశం తక్కువేనని తెలుస్తోంది. ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్ ఆడేందుకు వీలు ఉంది. కానీ, ఇది కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై ఆ దేశ నేత చేసిన కామెంట్స్ దీనికి కారణం అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఇరు దేశాల మధ్య భద్రతా కారణాల వల్ల గతంలోనే భారత్ పాక్ ద్వైపాక్షి క సిరీస్‌లు రద్దయ్యాయి. ఈ రెండు జట్లు ప్రస్తుతం ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. అయితే ఈ విషయంలోనూ ఐసీసీ దృష్టిపెట్టాలని రీసెంట్‌గా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. మరోవైపు పాక్‌తో పూర్తిగా క్రికెట్ సంబంధాలు తెంచుకోవాలనే డిమాండ్ తెరముందుకొచ్చింది.

# టీమిండియా కెప్టెన్సీకి గట్టి పోటీ

## రేసులో బుమ్రా, గిల్, కోహ్లి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 మధ్యలో రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో భారత టెస్ట్ జట్టు కెప్టెన్సీ ఖాళీ అయింది. ఆ పోస్టు ఎవరికి దక్కుతుందో అని అందరిలో ఆసక్తి నెలకొంది. మరోపక్క టీమిండియా కెప్టెన్సీకి గట్టి పోటీ ఎదురైంది. కెప్టెన్సీ రేసులో పలువురు పోటీ పడుతున్నారు. ప్రధానంగా జస్ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లికి మధ్య పోటీ ఎదురైంది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ, న్యూజిలాండ్‌తో స్వదేశంలో మూడు టెస్టుల్లో ఓడిపోవడంతో రోహిత్ కెప్టెన్సీకి ప్రమాదం వచ్చింది. ఐపీఎల్ తర్వాత భారత జట్టు



ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. సో ఈ సిరీస్ కంటే ముందు జట్టును ఎంపిక చేసే క్రమంలో రోహిత్ కెప్టెన్సీపై సెలెక్టర్లు అతని మాట్లాడినట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ వదిలేయాలని సెలెక్టర్లు కోరడంతో, కెప్టెన్సీతో పాటు ఇక టీమ్‌లో ఉండటం కూడా కష్టమే అని భావించిన రోహిత్ ఏకంగా టెస్ట్ ఫార్మాట్‌కే రిటైర్మెంట్ ప్రకటించాడు. మరి రోహిత్ తర్వాత రాబోయే ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో భారత జట్టును నడిపించే అవకాశం జస్ప్రీత్ బుమ్రా లేదా శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీలలో ఒకరిని ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. ఈ ముగ్గురిలో ఒకరు జట్టుకు నాయకత్వం వహించవచ్చు. ఎక్కువగా అయితే బుమ్రాకే అవకాశం ఉంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో అతని కెప్టెన్సీలో టీమిండియా ఒక మ్యాచ్ కూడా గెలిచిన విషయం తెలిసిందే. గాయాల పాలు కాకుండా ఉంటే టెస్ట్ ఫార్మాట్‌లో బుమ్రా టీమిండియా కెప్టెన్ అయ్యే ఛాన్స్ ఎక్కువగా కనిపిస్తోంది. మరి టెస్ట్ క్రికెట్‌లో కెప్టెన్‌గా అదిరిపోయే రికార్డ్ ఉన్న విరాట్ కోహ్లీని కూడా సెలెక్టర్లు మరోసారి సంప్రదించనున్నట్లు వెల్లడవుతోంది.

# వాణిజ్యం

# గూగుల్‌లో మరోసారి ఉద్యోగాల కోత..

**ముంబై, మే 8:** కృత్రిమ మేధ అభివృద్ధిపై దృష్టిపెట్టిన టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి కంపెనీలో పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే మళ్లీ లేఆఫ్‌లు ప్రకటించింది. సేల్స్, పార్ట్‌నర్‌షిప్ విభాగాలను పర్యవేక్షించే తమ గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్‌లో 200 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. కస్టమర్లకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఈ చిన్న చిన్న సర్దుబాట్లు తప్పడం లేదని లేఆఫ్‌ల గురించి గూగుల్ వెల్లడించినట్లు తెలిపింది. నెల రోజుల వ్యవధిలో ఈ సంస్థ ఉద్యోగు లను తొలగించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఏప్రిల్‌లోనే తమ ప్లాట్‌ఫామ్, డివైజ్ యూనిట్లలో పనిచేసే వందల మంది ఉద్యోగులను కంపెనీ తొలగించింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్లలో పనిచేసే ఉద్యోగులపై ఈ వేటు పడింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా గత రెండేళ్లలో గూగుల్ అనేకమందిని విధుల నుంచి తప్పించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఇక, ఈ ఏడాది ఫిబ్రవరిలో



హెచ్‌ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కొంత మందిని తొలగించింది. ఖర్చు తగ్గింపులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. గూగుల్‌లో 20 శాతం మంది మరింత సమర్థంగా పని చేయాలని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 2022లో వెల్లడించారు. ఆ మరుసటి ఏడాదే 12వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థలు సెర్చింజిన్‌ను తీసుకొస్తుండడంతో గూగుల్‌కు గట్టి పోటీ తప్పదని విశ్లేషకులు భావిస్తున్న వేళ ఈ తొలగింపులు చేపట్టడం గమనార్హం. ఇక, అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలుచేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# దలాల్ స్ట్రీట్‌కు ఉద్రిక్తతల ఎఫెక్ట్..

**ముంబై, మే 8:** భారత్ పాక్ మధ్య నెలకొన్న ఉద్రి క్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన భారత సైనిక చర్యను జీర్ణించుకోలేని పాక్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణిదాడులకు యత్నిం చింది. దీంతో ఆ దేశంలో మోహ రించిన గగనతల రక్షణ వ్యవస్థల ను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడిం చాయి. ఈ వార్తల నేపథ్యంలో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరి గంటలో అమ్మ కాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 400 పాయింట్ల కు పైగా నష్టపోగా, నిఫ్టీ 24,300 దిగువకు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఉదయం 80,912.34 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య చలించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.72గా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం పతనం అవ్వగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించింది. ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటాస్టీల్ షేర్లు ప్రధానంగానష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్,



కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 61.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### అరగంట పాటు నిలిచిన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్

భారత్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలవుతోంది. ఆపరేషన్‌సిందూర్‌తో బుధవారం భారీగా పతనమైన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. అరగంట పాటు నిలిచి పోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగా లు విరుచుకుపడ్డాయన్న సమాచారంతో వ్యాపించ డంతో ఈ పరిస్థితి నెలకొంది. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్ఈ 100 సూచీ దాదాపు 6,948 పాయింట్ల నష్టంతో 103,060 వద్ద నిలిచింది.

# మెటా నుంచి కొత్త ఎఐ యాప్

**ముంబై, మే 8:** రోజు రోజుకూ అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత పెరుగుతోంది. వ్యాపారం, వైద్యం, విద్య, వినోదం సహా అనేక రంగాల్లో ఎఐ పరిష్కారాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఎవరి నోటా విన్న ఎఐ మాటే వినిపిస్తోంది. ఇక వినియోగదారుల మన్నన పొందేందుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్ వంటి టెక్ దిగ్గజాలు ఎప్పటికప్పుడు కొత్త ఎఐ టూల్స్‌ను పరిచయం చేస్తున్నాయి. తాజాగా మెటా కూడా ఎక్కడా తగ్గకుండా, తన సేవలన్నీ మరింత మెరుగుపరుస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా మెటా ఎఐ యాప్‌ను లాంచ్ చేసింది. చాట్‌బాట్ రంగంలో చాట్ జిపిటికి గట్టి పోటీ ఇవ్వడానికి మెటా ఎఐ యాప్‌ను తీసుకొచ్చింది. యూజర్ల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఒఎస్ వినియోగదారులకు ఉచితంగా అందుబాటులో ఉంది. ఇక లామా 4 లాంగ్వేజ్ మోడల్‌తో రూపొందించిన ఈ యాప్, కేవలం ప్రశ్నలకు సమాధానం ఇవ్వడమే కాకుండా, చాట్, రచనలు, హ్యూమర్, సహాయక సమాచారం ఇలా నేక రంగాల గురించి అద్భుతంగా సమాచారం అందిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, ఫేస్‌బుక్‌లో ప్రతిరోజూ చాలా మంది మెటా ఎఐని వినియోగిస్తున్నారు. ఈ యూజర్లకు మెరుగైన ఫీచర్లను అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా అప్లికేషన్‌ను పరిచయం చేస్తున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అలాగే ఈ యాప్‌లో డిస్కవర్ ఫీడ్ అనే ప్రత్యేక ఫీచర్ ఉంది. ఇక్కడ యూజర్లు తమ ఎఐ ప్రాంప్ట్‌లు, చిత్రాలు, చాట్‌బాట్ రిప్లైలను షేర్ చేయొచ్చు. ఇతరులు వాటిని లైక్ చేయొచ్చు, కామెంట్ లేదా రీమిక్స్ చేయొచ్చు. అయితే ఈ యాప్ ప్రస్తుతం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే మిగతా యూజర్లకు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ తెలిపింది.



# 116.37 కోట్లకు పెరిగిన వైర్‌లెస్ కస్టమర్లు

**ముంబై, మే 8:** టెలికం సేవల వినియోగదారుల్లో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య మార్చిలో పెరిగి మొత్తం 116.37 కోట్లకు చేరుకుంది. ఇది ఫిబ్రవరిలో 116.33 కోట్లుగా ఉంది. ఈ మేరకు టెలికం రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) వివరాలు వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ సబ్‌స్క్రిప్షన్లు పెరగ్గా, పట్టణ సబ్‌స్క్రి ప్షన్లు స్వల్పంగా తగ్గాయని తెలిపింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లు భారత టెలికం పరిశ్రమలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ చందాదారుల చేరికల్లో అగ్రగామిగా నిలిచాయి. భౌగోళికంగా ఢిల్లీ సర్వీస్ సెంటర్ అత్యధిక టెలి-సాంద్రతను కలిగి ఉంది. అంటే యూనిట్ ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో మొబైల్ చందాదారులను కలిగి ఉండడం. బీహార్ అతి తక్కువ టెలి-సాంద్రతను నమోదు చేసింది. పెరుగుతున్న సబ్‌స్క్రైబర్ల సంఖ్య దేశంలో కొనసాగుతున్న డిజిటల్ పరివర్తనను హైలైట్ చేస్తుంది.

యూజర్ డెమోగ్రాఫిక్స్, నెట్‌వర్క్ డిమాండ్లకు సంబంధించి టెలికం ఆపరేటర్లు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చూడాల్సి ఉంది. వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరగడం చాలా అంశాలను ప్రభావితం చేస్తుంది. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో మెరుగైన కనెక్టివిటీకి అవకాశం అందిస్తుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, విద్య, ఆరోగ్య సంరక్షణ, ప్రభుత్వ సేవలు ఎక్కువ మంది పొందేందుకు వీలవుతుంది. ఇ-కామర్స్, ఫిన్ టెక్, డిజిటల్ ఎంటర్‌టైన్ మెంట్ రంగాలు వృద్ధి చెందుతాయి. మొబైల్ వినియోగదారూలకు సేవలందించే వ్యాపారాలు, ముఖ్యంగా మొబైల్ అప్లికేషన్లు, స్ట్రీమింగ్ సేవలు, డిజిటల్ సర్వీసులు పెరుగుతాయి.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.